172

ఫిబ్రవరి 1990

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

మాసపత్రిక



జననాట్యమండలికి విప్లవాభినందనలు !

సృజన

ఆధునిక సాహిత్యవేదిక

172 | మాసపత్రిక | ఫిబ్రవరి **1990**

ఈ సంచికలో

నిర్వహణ

సాహితీ మిత్రులు

సంవత్సర చందా రు. **40** ఈ సంచిక రు. **4**

Edited, Printed and Published by P. Hemalata, Flat 11, Block 2, MIG II, Bagh Lingampalli, Hyderabad 500 044 and Printed at Nagendra Press, Vijayawada - 520 002

Working Editor : VaraVara Rao

ప్రభంజననాట్యం

జనం బాస జనం యాస జనం బతుకు జనం పోరు—చెప్పాలని ఒకచోట 'జననాట్య మండలి' పాటల్లో కవులకు, కళాకారులకు సందేశం వున్నది. అక్షరాల జనం ధ్యాసలో జనం మధ్యన జీవిస్తూ పోరాడుతున్న సాంస్కృతిక సంస్థ జననాట్య మండలి.

జనం గురించి రాసే సంప్రదాయం మనకు అరవై ఏళ్ళుగా వున్నది. జనంలో మసలుకుంటూ జనం జీవితంలో భాగమే కాకుండా పోరాటంలో భాగమై సాయుధ పోరాట సైనికులై సాంస్కృతిక కళారూపాలు ప్రదర్శించిన కవుల సంప్రదాయం కూడ మనకున్నది.

'పల్లెటూరి పిల్లగాడే' రాసాడేమోననిపించే ప్రజల పాటలు తెలంగాణ పోరాట సంప్రదాయంనుంచి మన సాహిత్యంలోకి వచ్చి చేరాయి. సుంకర సత్యనారాయణ, తిరునగరి రామాంజనేయులు నాటకాలు, కవిత్వం రాయడం విశేషం కాదు. నాజర్ బుర్రకథ చెప్పడం విశేషంకాదు. సుద్దాల హనుమంతు, రాజారాం, యాదగిరి పాటలు కట్టడం విశేషం. అలవాటయిన పల్లె పాటలనుంచి, బాణీలనుంచి క్రమంగా ఎదిగిన అవగాహనను తాముగా కవిత్వంగా చెప్పగలిగిన స్థాయిలోకి జనాన్ని చేర్చడమే ఏ ఉద్యమమైనా గర్వించదగిన విజయం. కమ్యూనిస్టులు మాత్రమే ఒక బందిపోటు దొంగల ముఠానాయకుణ్ణి కామ్రేడ్ ఛూ చేసేవంటి ప్రజాసైనిక నాయకత్వ స్థాయికి మలచగలుగుతారు. కల్లుముంతను మరవజాలని జనాన్ని కారణాలు తెలిసి ఆయుధాలు పట్టేలా చేస్తారు.

అలగాజనంగా నలుగురు భావించేవాళ్ళను 'ఇగ ఎగబడదమురో ఎములాడ రాజన్న మనం' అని వర్గపోరాటానికి పురికొల్పే శక్తి మార్క్సిస్టు అవగాహనలో వున్నది. ఇది జనం తమ వేలవేల సంవత్సరాల అనుభవాన్ని క్రోడీకరించుకొని ప్రోదిచేసుకున్న చైతన్యం. దాని భౌతిక వ్యక్తీకరణకూడ.

ఒకరు 'కికి' వంటి హాస్య, సరదా పత్రికలు నిర్వహిస్తూ నెహ్రూను, కవి తిలక్‌ను ఆరాధిస్తూ కాలం గడిపేవాళ్ళు. ఒకరు చదువువదిలి తల్లి చనుబాలతో అబ్బిన పాటను కుటుంబ నియంత్రణ ప్రచారంలో ప్రభుత్వానికి పణం పెట్టినవాళ్ళు, ఒకరు ఊపిరి మెసలడానికి వీలులేని ఉద్యోగంలో కంటోన్మెంట్‌లో ఎక్కడమ్మో కళామతల్లీ అని తల్లడిల్లినవాళ్లు- ఒక ప్రజాపోరాట రాజకీయ నిర్మాణానికి తటస్థిస్తే ఏమవుతుంది-మనం నలుగురం కలసి ఈ మట్టిని చెలిగి ఏమైనా చేయగలమేమో చూద్దాం అని బయల్దేరుతారు. 'ఆర్ట్ లవర్స్' ప్రజా హృదయ స్పందనల్ని ప్రేమించ

గలవాళ్ళయినపుడే అది జనం గుండెల చప్పుడును వినిపించే జననాట్య మండలి అవుతుంది.

నక్సల్బరీ వెలుగులో శ్రీకాకుళ పోరాటం ప్రారంభమైననాడే స్వయంగా ఆ పోరాటానికి నాయకత్వం వహించిన వెంపటాపు సత్యం గ్రహించాడు - 'కండబలం కలిగినట్టి కొండజాతివీరుల' పోరాటనాదాన్ని గుండెగుండెకూ చేరవేసే ప్రజా కళా రూపాలు కావాలి. ఈ పోరాటంలో వెనుకబడిన వ్యవసాయదేశంలోని మరింత వెనుకబడిన ఆదివాసులు చేపట్టారు. కానయితే పోడు వ్యవసాయమేకాని అది వ్యవసాయ విప్లవం ఇరుసుగా సాగుతున్నది. మావో ఆలోచనా విధానం గీటురాయిగాసాగుతున్నది. అందుకే 'అన్నా అన్నా విన్నావా మావో సూక్తులు విన్నావా'అని వెంపటాపు సత్యం ప్రజా యుద్ధపంథాలో నిర్బంధంనుంచి విజయందాకా అనుసరించ దగిన మెలకువలు, ఎత్తుగడలు, వ్యూహం, అంతా పూసగుచ్చినట్లు చెప్పాడు ప్రజల రాజకీయాలు లేని నైపుణ్యం నిపురువంటిది. కళల్లో, కవిత్వంలో నేర్పు జనజీవితానికి చేరువయినకొద్దీ నిప్పుసెగకు వెన్నకరిగినట్లు, పనస చెలగి తొనలు తీసినట్లు గుమాయిస్తుంది. రుచిస్తుంది.

ఆంధ్ర నాటక కళాపరిషత్తుల పోటీనుంచి, బరంపురమో, జయపురమో వెళ్ళి రంగువేసుకొని రంగస్థలంపై నటించడంనుంచి సుబ్బారావు పాణిగ్రాహిని శ్రీకాకుళ పోరాటం రంగమెటియా కొండల్లోకి తెచ్చింది. మనకిప్పుడు 'అక్టోబర్ 31' అని రాసిన పాణిగ్రాహి జముకుకథకన్న ముందుదేమీ మిగలలేదు. 'దిక్కూ మొక్కూ లేని జనం ఒక్కొక్కరు అగ్నికణం'గా మారిన తర్వాత 'శ్రమజీవుల రక్తంతో జెండా నెగరేసి', 'మృతవీరుల ఆశలతో మునుముందుకి సాగిన' పాణిగ్రాహి కలంలోని 'ఎరుపు' తప్ప మనకిప్పుడు వెనుకదేమీ మిగలలేదు. పాటలోనికి సూటిదనం, సులభత్వం, సౌకుమార్యం తెచ్చినవాడు పాణిగ్రాహి. గురజాడ 'ముత్యాల సరాల' లోని స్పష్టతను పాణిగ్రాహి తన ప్రజాకళారూపాల్లోకి తెచ్చి సాహిత్యాన్ని ప్రజాస్వామిక స్థాయినుంచి విప్లవదశకు మళ్ళించాడు. ఆ దిశలో ఇంక శ్రీకాకుళ పోరాటాన్ని శ్రీకాకుళ జాతరగా జనంలోకి తీసుకపోయిన సంస్థ జననాట్యమండలి.

1972-73లలో జననాట్యమండలి ఏర్పడేనాటికి నక్సల్బరీ శ్రీకాకుళ రాజకీయాలను ప్రచారం చేస్తున్న ఏకైక ప్రజా సాంస్కృతిక సంస్థ విప్లవ రచయితల సంఘం. ఒకవైపు నక్సల్బరీ వసంతమేఘంలా గర్జించి చలికాలం కుంపటిలో చల్లారుతూ రగుల్కొంటున్న నిప్పువలె నివురుకప్పి వున్నది. 'నెత్తురు పేరులు పారినా ఎత్తిన జెండా దించకోయ్' అనే తెలంగాణా సందేశాన్ని నెమరేస్తున్నది శ్రీకాకుళం.

తెలంగాణా అంతటా శ్రీకాకుళం చిగురిస్తున్న రోజులవి. ఒళ్ళు విరుస్తున్న చేలల్లో చెట్టుమీంచి పాలపిట్ట ఎగిరివచ్చినట్లు, పొలాలకు కాల్వకట్టిన నీళ్ళు పొర్లివచ్చినట్లు తొలి చినుకురాలి నేల గంధం చిమ్మినట్లు నిసర్గ సాంస్కృతిక సౌందర్యంతో జననాట్య మండలి ఆవిర్భవించింది.

ప్రజలగురించి రాసే తపననుంచి ప్రజారాజకీయాలు ప్రజలనుంచిరాసే స్థాయి కెదిగాయి. ప్రజలకర్థమయ్యే భాషనుంచి సాహిత్యం ప్రజలు మాట్లాడే మాండలికాల కాలపట్టయింది. జనపదాలు పోరాట పంథాను చేపట్టగానే జానపద బాణీలు విప్లవీ కరణపొంది ప్రజా కళారూపాలైనవి. ముడిసరుకు అదే- అది సరుకుగా మారకుండా మౌలిక రూపాన్ని మరిచుకొని పోరాటసారాన్ని అందించింది. డప్పు, పిల్లన గ్రోవి, జముకు, గజ్జెలు, కంజెర, డోలు ప్రజాసంగీత సాధనాలైనవి. గొంగడి, గోచీ ఆహార్యాలైనవి. ఎర్రజెండా మన చిటికెనవేలు పట్టుకొని, ముడిపీడని బంధం అయినడిపించింది. కొండలు పగిలేసిన చేతులు, పంటెనలు నిలిపిన చేతులు, సహస్ర వృత్తుల సమస్త చిహ్నాలైన చేతులు కలిసినపుడు చైతన్యంవలన స్ఫూర్తి కొడవలిమై దృశ్యమానమైనవి.

'బీదలపాట్లు' చెప్పడంతో ప్రారంభమైన కళాసాంస్కృతిక ప్రదర్శనలు 'ప్రజాయుద్ధ' భేరీలయినవి. ఈ క్రమంలో వ్యవసాయకూలీలు, భూమిలేని నిరుపేదలు కవులయ్యారు. కళాకారులయ్యారు. వీళ్ళలో అత్యధిక సంఖ్యాకులు దళితులు. విప్లవ సందేశాన్ని విప్లవ ప్రజానీకం దగ్గరికి తీసుకపోవడమేకాదు, విప్లవకర వర్గాలైన కార్మికకర్షక జనాలనుంచి సాంస్కృతిక యోధుల్ని తయారుచేసిన ఘనతకూడ జననాట్యమండలిదే. పాట ఎవరిదో వాళ్ళదగ్గరికి చేరింది. చావుడప్పు ఇపుడు పోరాట భేరీయై మోగుతున్నది. ఇపుడింక ఉత్పత్తి, ఉత్పత్తి సాధనాలు ఆ విప్లవకరవర్గాల చేతుల్లోకి రావలసి వున్నది. భూమి పోగొట్టుకొని భూసారమైన సంస్కృతినుంచి పరాయీకరణ పొందిన అశేష ప్రజానీకం నక్సల్బరీపంథా ఆచరణలోకి తెచ్చిన ప్రత్యామ్నాయ రాజకీయాలవలన ఒక్కొక్కటే తమ పనిముట్లను తాము స్వాధీనం చేసుకుంటున్నారు. తమ పనిముట్లను తమ పనులకొరకు వినియోగిస్తున్నారు. తమ పనుల ఫలసాయం తమకే చెందాలంటున్నారు. ఈ అన్నిటికీ భూమిక అయిన భూమిని, భూమి మీద అధికారాన్ని స్వాధీనం చేసుకోవడానికి రాజ్యంతో రాజీలేని యుద్ధం చేస్తున్నారు.

ఈ దారి పొడుగునా గుండె నెత్తురులు తర్పణచేసేది ప్రజలే. 'పదండి ముందుకు పదండిత్రోసుక' అంటూ 'మరోప్రపంచం' వెలుగుల్ని ఆవిష్కరించడానికి పురోగమింపచేది ప్రజలే. ఈ ప్రజలమధ్యన వుంటూ ప్రజలను ముందుకు నడిపించే

శక్తిమాత్రం వర్గ చైతన్యం. దాని ఆచరణ రూపమైన వర్గపోరాటం అగ్రగామి చైతన్యంగల కమ్యూనిస్టులు విప్లవోద్యమక్రమంలో ప్రజలను సాయుధుల్ని చేస్తారు- అంటే ప్రజల చేతులకు తుపాకులు అందిస్తారని కాదు. ప్రజాస్వామ్యం ఏర్పడడానికి ప్రజలు సాయుధులు కావలసిన అవసరాన్ని, అవగాహనను ప్రజల చైతన్యంలోకి రంగరిస్తారు. అప్పుడు ప్రజలే అనివార్యంగా సాయుధులవుతారు. రాజకీయాధికారాన్ని ప్రజాయుద్ధ పంథా ద్వారా సాధించుకుంటారు. విప్లవం రాజకీయాధికారమే కాదు. నూతన మానవుల్ని ఆవిష్కరించే, పరిపూర్ణపు బ్రతుకిచ్చే రసాయనిక పరివర్తన. విప్లవం ప్రజలందర్నీ సాయుధుల్ని చేసినట్లే ప్రజలందర్నీ సాంస్కృతిక యోధుల్ని చేస్తుంది. కవులు, కళాకారులుగా తీర్చిదిద్దుతుంది

పేట నేర్చుకున్న ఆదిమ సమాజం వేటాడిన అడవిపంది చుట్టూ నాట్యంచేసిన దృశ్యమో, వానకోసం ఎదురు చూసిన సమాజం, వానలో తడుస్తూ సామూహిక బృంద గానంలో తేలిపోయిన దృశ్యమో చూసినపుడు- కళలకు కష్ట సుఖాలను పంచుకునే సామూహిక స్వభావం వుందని మనకర్థమవుతుంది

బంజర్లను పొతంచేసి, దున్ని, విత్తి, నాటుపెట్టి, కలుపుతీసి, కోతకోసి కుప్పలకెత్తినపుడుగాని, మరోపనిలోగాని పాల్గొంటూ పాడినపుడు, అది నపుడు ఉత్పత్తికీ కళలకూ వున్న అవినాభావ సంబంధం మనకర్థమవుతుంది.

ఇపుడు మనకు ఈ ఉత్పత్తి సంబంధాలలో వచ్చిన ఘర్షణవల్ల జరుగుతున్న పోరాటంలో వర్గపోరాటానికి, కళలకున్న అనుబంధం కూడ కళ్ళకు కట్టినట్లు అర్థమవుతున్నది.

జననాట్యమండలి సాధించిన విజయం ఒక్కమాటలో చెప్పాలంటే అదే– నక్సల్బరీ రాజకీయాలు శ్రీకాకుళం జాతరలో జగిత్యాల జైత్రయాత్రలో తీసుకున్న మలుపు సజీవచరిత్రగా, సంచలనంగా సాంస్కృతిక కళారూపాల్లో వ్యక్తమైంది.

జననాట్యమండలి సాధించవలసిందేమిటంటే- జనంనుంచి గద్దర్ అనుకరణలు కాదు అనేకమంది గద్దర్‌లు రూపొందాలి. జనం అంతా జనసైన్యం అయినట్లుగానే జననాట్యమండలులు కావాలి. ప్రజా సాంస్కృతిక సైన్యం కావాలి.

జననాట్యమండలి వర్ధిల్లాలి !
ప్రజా కళలు, సంస్కృతి వర్ధిల్లాలి !
ప్రజా పోరాటాలు వర్ధిల్లాలి !

ఫిబ్రవరి 15, '90 —సంపాదకుడు

ఒక తండ్రి

గోపి

బుచ్చిరెడ్డి హఠాత్తుగా మంచంలో లేచికూర్చున్నాడు. అతని మోకాళ్ళు ఫల ఫల శబ్దంచేశాయి. అరుగుకిందికి దిగి ఆకాశం కేసి చూశాడు అమాసరోజులు చిమ్మం చీకటి. పైగా ఆకాశంలో చిక్కగా మబ్బులు పట్టాయి. రెండిండ్ల మధ్య ఆకాశం ముక్క చాప వెడల్పే ఉన్నది.

"తెల్లారిందో ఏందో?" గొనుక్కుంటూ దరువాజతీసి వాకిట్లో కొచ్చాడు. చిమ్మెట్లు రొదగా అరుస్తున్నాయి. వీధిలైటు చుట్టు ఉసిల్లు మూగుతున్నాయి. నిన్న సాయంకాలమే పెద్ద జడివాన కురిసిపోయింది. గడ్డంగోక్కుంటూ ఆకాశం కేసి చూశాడు. ఆకాశంలో ఎక్కడా ఒక్క చుక్క కన్పించలేదు. ఊళ్ళె చప్పుడులేదు.

బుచ్చిరెడ్డి ఆ రాత్రి తెల్లారిందో లేదోనని చూడడం ఇది మూడోసారి. ఆరాత్రి బుచ్చిరెడ్డి అసలు నిద్రపోనేలేదు.

"ఏమే ఇయ్యేడు ఏమారం కార్తులే" అనుకుంటూ ఇంట్లో కొచ్చాడు.

తలుపు తీసినప్పుడే తెలివైన సుగుణమ్మ "నాత్రంత కన్నుమీద కునుకు పడ నియ్యక పోతివి. లేడికి లేచిందే పరుగన్నట్టు నీ ఉరుకులాట నీదేగాని...."

"అరె ఇయ్యేల్ల గయ్యన్ని మాట్లాడకు. తల్లి కడుపులనుంచి ఇప్పుడే పుట్టి నట్టుగున్నది."

"ఊఁ" సుగుణమ్మ బుచ్చిరెడ్డి అంతరంగంలోని ఘర్షణ తెలియక ఎప్పటి లాగే అన్నది.

"ఊఁ లేదు ఆఁ లేదు. కార్తులు ఏవారమచ్చినయ్."

"నిన్ననే రోని (రోహిణి) బోయి మురకశిలె (మృగశిర) జొచ్చింది. కార్తి సందు నిన్న అనగూడ కొట్టిందికాదా?"

"అయితే అయితారం కార్తులన్నమాట."

"మునిమాపులేసి కార్తులడుగుతున్న వేంది?"

"పెరట్ల పెసలు అలుకాలె."

"బాగానే ఉంది పనివరుస ముసలితనానికి దసిలిరై కన్నట్లు గిప్పుడు నువ్వు గుంటుక కొట్తవా? అంతసాపు సీదగున్నదని ఇగ గదొక్కటి తక్కువయ్యిందా?"

"ఎట్ల జరిగేది గట్ల జరుగుద్ది. బిన మనసేతుల లేనప్పుడు ఊకె రంధిపడి ఏంజేత్తం. ఈ భూమండలంల ఎవలు సావకుంట బతికెటోల్లుశేరు. రెక్కలచ్చిన పచ్చులు ఎగిరిపోయినయి...." ఇంకా ఇలాటి మాటలేవో మాట్లాడుదామనే అను కున్నాడు. కాని అతనికి మధ్యలోనే 'గుంటుక' జ్ఞాపకం వచ్చింది. లేచి ఇంటిముంద టనేగల ఎడ్ల కొట్టంలోకి వచ్చాడు. రెండు ముసలెడ్లు చొప్పలేక బుచ్చిరెడ్డిలాగే బక్క సీలి ఉన్నాయి. వాటి ముందుకు వెళ్ళగానే బుచ్చిరెడ్డి ఒంట్లోనుండి వేడిపొగలు చిమ్మాయి. తనబాధల్లో తనుండి "నోరులేని జీవాల మిమ్ముల మాడ్సినగదరా?" అని వాటికి సంజాయిషీ చెప్పుకున్నాడు. రెండెడ్ల గంగడోలు రాశాడు.

"ఒరే గంగదేవి ఇయ్యేల్లనే సూరువోనియ్యి, సూటయాభై వోనియ్యి కంట్లం జొన్నసొప్పదెత్త. తినుండ్లి బిడ్డ తినుండ్లి. ఇగ మీరే నాకొడుకులు." ఎడ్లకు అతని మాటలకన్నా అతని చేతలప్రేమ అర్థమైనట్లున్నది. అవి ఆబగా అతని చేతులు నాకి నాయి. కొత్త ఉత్సాహమేదో వాటి ఒంట్లోకి ఎక్కినట్లైంది. మట్టుమీదనే అటిటు తిరి గాయి. అటుకుమీద పెట్టిన పరిగడ్డపంజతీసి వాటిముందు పెట్టాడు.

బుచ్చిరెడ్డికి ఎన్నెన్నో అనుభూతులు, కోపతాపాలు, సుఖదుఃఖాలు మనుసులో పోటెత్తాయి. గత మూడు సంవత్సరాలుగా బుచ్చిరెడ్డి కలలో బతికినట్టు బతుకు తున్నాడు. ఎక్కడ మొదలైన ఆలోచనైనా పుటుక్కున మధ్యలో తెగిపోయి పొట్ట కొచ్చి ఉండిపోయిన వరిపొలం చూసి నివ్వెరపోయిన రైతులా ఊరికినే చేష్టలుడిగి ఉండిపోయాడు. ఈ మూడు సంవత్సరాల బతుకులో ఆతను తన సొంతం జీవితాన్ని ఆ బతుకులో తారసపడ్డ మనుషులు ఆఖరుకు ప్రతి చిన్న ఘటనను కొత్తకోణంలో చూశాడు. ఒక ఉద్విగ్నమైన స్థితిలో బతికాడు.

"అయ్యన్ని మల్ల తవ్వకొని ఫాయిదాలేదు. బతుకాలె- తన దెబ్బైయేండ్ల బతుకులో తలపంచకుండ బతికినట్టే బతుకాలి. ఏ కట్టానికి జెనుక లేదు. సచ్చేతుదకు జెనికేదేంది? ఎట్ల కానున్నది అట్లయితది." లోపటి ఆలోచన పైకే అనుకున్నాడు.

గుంటుక ఎక్కడ పెట్టాడన్నది ఎంతకు జ్ఞాపకం రాలేదు. పసువుల కొట్టానికి వేసిన 'గెల్లాలల్లో' పునికాడు. ఆ కర్ర మొద్దుల్లో ఆ చీకట్లో గుంటుక ఆనవాలే దొరుకలేదు.

సుగుణమ్మ బయటకు లేచివచ్చి "ఏం ఇగమన లచ్చన్న రానట్టేనా?" అన్నది.

"గట్లనే తన్పతుతుంది?"

"అడివి తొంగి చూడకపోవుటానికి అని పుర్రెలబుద్దేనా?"

"కావచ్చు." అటుక్కు పెట్టిన వాసాలు పునుక్కుంట.

"ఎంగలరావో దొంగలరావో సచ్చిండుగదా!"

"బా సంపకుంటె ముద్దుపెట్టుకుంటరా?"

"దెబ్బయేండ్లచ్చే మనుమలకు కొడుకులు బుట్టిరి నీ బుద్ధి మారకపాయె."

అదే నిన్న సాయంత్రమైతే బుచ్చిరెడ్డి అగ్రహోద్రంగా ఊరు పేరు లేకుండా తిట్టేవాడు. చిమ్మెట్లరొదలో ఎడ్లు పరిగడ్డిలో మూతులతో గెలుకుతున్న చప్పుడులో మౌనంగా నిల్చున్నాడు.

"అయినే మంచోడేనటగాదా?" సుగుణమ్మ రెట్టించింది. ఆమెకు కీళ్ళనొప్పులు. దరువాజముందు కూర్చున్న చప్పుడు

"అందరు మంచోళ్ళే మంచోళ్ళు కానోడెవ్వడు. మీకందరికి ఇన్నూరెకరాలోడు, నూరెకరాలోడు మంచోని తీర్గనే కన్పత్తరు. ఆడు కడుపుల సల్ల కదులకుంట నీతి ముచ్చెట్లు సెప్పుతడు.... గీపదిహేనేండ్లల్ల ...." ముసలాయనకు ఏదో జ్ఞాపకంవచ్చి గొంతు బొంగురు పోయింది.

"కడుపుకోత-ఎంతమంది మనసొంటి ముసలోల్లు ఏడ్సేడ్సిసత్తండ్లు. ఇది బక్క గొడ్ల ఏడుపుకు గద్దలాగే కాలంకాదు. గిది ఇజ్జెం.... లథాయి...." ఇంకా చాలా చెప్పాలనుకున్నాడు కాని మాటలు తెగిపోయి ఆ తెల్లారే సమయంలో భల్లున ఏడుస్తానేమోనని భయపడిపోయాడు.

సుగుణమ్మ అడుగలేక పోయింది. ఆమెకు నాభి లెక్కడో కలుక్కుమన్నది. వాళ్ళిద్దరి మాటలు ఎక్కడ మొదలేసినా ఇద్దరు వద్దనుకున్న విషయం దగ్గరే ఆగిపోతాయి.

"వానింట్ల పీసెగ్గల్ల వాడుసత్తె సచ్చిండుగని- మల్ల ఊళ్లకుగ్గం అచ్చేటట్టున్నది- లచ్చన్న గందుకనే రాలేదనుకుంట" అన్నది.

"కావచ్చు. గిదికొత్తనా? ఎన్నిపారీల కాలేదు. దెంకపోయెటోడు చెంగో బిల్ల అన్నడు. ఏడికి పోతరు? పిరికోనికి ఏడికిబోయినా" అటుక్కు పెట్టిన గుంటుక దొరికింది. దాన్ని తిప్పలుపడి బయటకు తీశాడు. రిమ్మెన కొయ్యలు ఎక్కడ బెట్టిందో మళ్ళీ జ్ఞాపకం రాలేదు.

"ఏందది?"

"గుంటుకే-"

"మరినీ శాతనై తదా? పెద్దోడు మోయేడు సేతసేపిచ్చి ఆడు మరి బాపు అమ్మ సచ్చిండ్లో బతికిండ్లోనని తొంగన్న సూడకపాయె. అందరికి పగైపోయినం. నడిపోడు మున్స్రూపాల నౌకరిల పిల్లంపేరం గొడుత్తండు."

"ఆడేంజేత్తడేనర్సొక్కు లోడు. సరెగని- రుమ్మెన కొయ్యలు, పొన్నులు ఏడపెట్టిన. మతికత్తలేదు."

"గుమ్ముల కాడ పెట్టినట్టున్నది. ఇంక పుంజుఅన్న గుయ్యలే-" సుగుణమ్మ లేచి ఇంట్లోకివెళ్ళి దీపం ముట్టించి గుమ్ములసందులో వెతికింది. పొన్నులకోసం గూళ్ళన్ని వెతికింది.

అప్పటికి బుచ్చిరెడ్డి గుంటుక వాకిట్లోపెట్టి రుమ్మెన అమర్చాడు. తాళ్ళకోసం గాలిస్తున్నాడు.... భార్య తెచ్చిన కొయ్యలు అమర్చాడు. పలుగుకోసం, బారెడుబొత్తెల కోసం, పగ్గాలకోసం మళ్ళీ వెతుకులాట- అన్నీ దొరికాయికాని పొద్దెమట్టుదాడు లేసే లేదు. అయినా బుచ్చిరెడ్డి వొదిలిపెట్ట దల్చలేదు. జనుప గిర్రసేరు తెచ్చి ఎట్లాగైనా కట్టాలని చూశాడు— అన్నీ అమర్చిన గుంటుక పాతబడి లుకలుక లాడుతోంది.... లాభంలేదు వడ్లాయన దగ్గరికివెళ్ళి పేళ్లు వేయించాల్సిందే.

ఇంటిముందు బొడ్డుమల్లెచెట్టు మొదట్లో దిగాలుపడి కూర్చున్నాడు.

"నీతోని వశంగాదయ్యా నువ్వు పోరనివిగాదు-పడుసోనివిగాదు. ఎప్పుడు ఉరుకులాటే" సుగుణమ్మ లోపలికి వెళ్ళిందిగాని "ఇట్లాగైనా కొంత మనిషి ఏదో పని మీద పడుతడు. రెక్కలు తెగిన పక్షుల్లా ఇద్దరు ఈ ఇండ్లల్ల ముసలి దయ్యాల తీర్గ ఏడుత్తె ఎవలేమనుకుంటారో నంట తిరుగుతన్నం. ఒకప్పుడు కళకళలాడిన ఇల్లు-" సుగుణమ్మ బారెడు గాలొదిలింది. మంచంమీద కూర్చున్నదేగాని మనసంతా బుచ్చి రెడ్డి మీదనే ఉన్నది. మళ్ళీ లేచి వచ్చింది.

సడీసప్పుడు లేకుంట చెట్టు కింద సీకట్లో కూర్చున్నాడు బుచ్చిరెడ్డి. వీధిలో కరంటు వెలుగు.

"కాసేపు అట్ల కూరుకుదుపురా! ఇంక పుంజు గుయ్యలేదు." అన్నది....

బుచ్చిరెడ్డి మళ్ళీవచ్చి గుంటుక ఊపిచూసిండు. గాడీలల్ల వరిగడ్డి దగ్గర చేశాడు. ఇంట్లోకి వచ్చి మంచం మీద కూర్చున్నాడు.

సుగుణమ్మ తలుపేసి తను ఎప్పటిలాగే అరుగుమీది మంచంలో ఒరిగింది.

బుచ్చిరెడ్డి అట్లా ఎంత సేపు కూర్చున్నాడో తెలియదు.

తొలికోడి కూసింది—వీధిలో సందడి మొదలయ్యింది.

బుచ్చిరెడ్డి బయటకు వచ్చాడు. చింతచెట్లల్లో గాలిగమ్మత్తుగా రొదచేస్తోంది. తూరుపుదిక్కు చాపెలుపు చుక్కలు కన్పించాయి.

వీధిలో జనుప కాగడాలు మంటవేసి ఉసిల్లు పడుతున్నారు. మూలమలుపు దగ్గర వీధిలైటు ముందు స్త్రీలు పురుషులు ఆగమాగంగా కుండలు గంజులు పట్టుకొని చీపుర్లతో ఉసిల్లు ఊడ్చిఎత్తు కుంటున్నారు....ఉప్పరి వాడకు, గొల్లవాడకు మంటల కొసలుకన్పిస్తున్నాయి.

బుచ్చిరెడ్డి గుంటుక భుజంమీదికెత్తుకున్నాడు. ఆ బరువుకు తూలి నిలదొక్కుకున్నాడు.

పల్లాయన కైలాసం గోచీ ఊచిపోగా లైటు వెలుతురులో ఉసిల్ల కోసం అడికీడికి ఉరుకుతున్నాడు. మధ్యమధ్య "హన్నా నీయక్క - పెద్దబాడి షెతోని నరుకుదునా?" అంటున్నాడు.

అతని భార్య పొట్టి వరమ్మ తిడుతోంది. బరిబాత ఆడపిల్లొకతి ఏడుస్తోంది.

చింతకింద ధాతికాడ గుంటుక దించాడు.

"ఇగనావశంగాదు" నని భార్యకు గిలేటి సర్వయిచ్చి ధాతికాడికొచ్చి బుచ్చిరెడ్డిని చూసి బోలెడంత ఆశ్చర్యపడి "ఇగ ఇద్యేడు అయ్యింది పో-గుంటుకలకు బోయినోళ్ళు గుద్దు కుంటత్తరు." అన్నాడు నవ్వుతూ.

"అదెరా పిలడా?" బుచ్చిరెడ్డి నవ్వుతూ.

"అవ్వనీ బాంచెన్ మూదేండ్లాయె నీ ముఖంల నవ్వుసూడక" ముఖం మీద ముసురుతున్న ఉసిల్లను కొట్టుకుంట.

వీధిలైటు వెలుతురులో బుచ్చిరెడ్డి మొఖం పరిశీలనగా చూసి "నీకెందుకు గీతిప్పలు—బొచ్చెలసొంటి నలుగురు కొడుకులు. ఏడున్న పూట గడుత్తది. గీపాతులాట నీ కెందుకయ్యా!" కైలాసం ఇంవాకటి నవ్వు మరిచిపోయి.

"ఊకెనే ఉంటె దోత్తలేదోయి. నిన్న మొన్నటిదాకా మా లచ్చి రెడ్డి అత్తడోంట జూసిన. వాడింక రాకపాయె. మారెగీ ఏద్దు ముడ్డి పొడుసుక బతికినోడు ఏడ బతకలేడు. పునాస అలికినంక జూత్త." అన్నాడు.

ఇంట్లోనుంచి చిన్నబాడిసె ఉలితెచ్చి గుంటుక మీద రెండు దెబ్బలేసి "మారే గిది బనికచ్చేటట్టులేదు. నా తీర్గనే లుకలుకలాడుతంది." అన్నాడు.

"ఎరంబెట్ట లేదని సూడకు - మీ వోళ్ళను ఇంటికి దోలు. ఇయ్యాల్ల పని సాగియ్యి. రేపు సూద్దాం."

"ఎరం ఎవలడిగిండ్లయ్యా – మారాజు ఏడున్నడో నాకు అన్నం బెట్టి తను దేశాలు బట్టి బోయిండు." కైలాసం చెక్కేదాన్ని చెక్కిపెడుతూ.

బుచ్చిరెడ్డి మాట్లాడలేదు. ఆమతికి వద్దు - ఆ ఆలోచనలే ప్రస్తుతానికి వద్దను కుంటున్నాడు.... ఆ మాటలు పదే పదే సుళ్ళు తిరుగుతాయి. తను సర్వచేష్టలుడిగి మూడేండ్లనుండి ఎట్లా పనిపాట లేకుండా ఉండిపోయాడో అట్లాగే ఉండదలుచలేదు.

కైలాసం ఏదో మాట్లాడుతున్నాడు. ఆ మాటలు వినకుండా బుచ్చిరెడ్డి "రేపో మాపో వడ్లు అలుకాలె – ఎడ్లకు నొప్పగొనాలె - మడికట్టుకు నాలుగు నాగండ్లు కూలికి బెట్టుకుంటే నాసైపోతది."

అప్పటికి ఇంకో ఇద్దరు రైతులు వచ్చారు. వాళ్ళు బుచ్చిరెడ్డిని మందలించారు. అరకొరగా ఏదో చెప్పి గుంటుక ఎత్తుకొని నడుస్తున్నప్పుడు అన్పించింది. తను వాళ్ళతో అట్లా మాట్లాడాల్సిందికాదు. ఎంతకాలం భయపడతాం. ధైర్నెం తెచ్చు కోవాలి. అచ్చిన కట్టం, సచ్చిన తప్పదు. మొదట తనకు కాలుచెయ్యి ఆడితే....

అతను కొంచెం సందుబెట్టగానే వారం రోజుల క్రితం వచ్చిన ఉత్తరం జ్ఞాపకం వచ్చింది. బనీను జేబు తడుముకున్నాడు. ఒంట్లో కీళ్ళన్ని పట్టు తప్పినట్టు డీలా పడిపోయాడు. "వాడు ఎంతో ఆశతో ఉత్తరం రాస్తే తను పోలేకపోయిండు. కోరాపుట్ ఎక్కడుంటదో ఎవరినో అడిగితే కాజీపేటల రైలెక్కితే అక్కడికి సీదా పోతదట. పొద్దున ఎక్కితే తెల్లారి దిగాల్నట-అయిదారు వందలన్నా కావాలె- పెద్దోడు చాలా దూరంబున్నడు. వాన్ని అడుగదలుచు కోలేదు. ఈ మాటే వాడికి చెప్పవద్దు–నడిపోడు అగన్న పక్షి తిరుగుతండు. చిన్నోడు మా కొట్టి పోసుకుంటండు గాని వాని దగ్గర పది రూపాయలు దొరుకయి.... వాళ్ళను ఎందుకడుగాలె - ఏదో ఒకటి అమ్మిత...."

ఇంతలోనే ఇల్లువచ్చింది. సుగుణమ్మ ఆకిలి ఊడ్చి అలుకు బల్లుతున్నది ....

గుంటుకదించి మళ్ళీ బలం పుంజుకోవడం కోసం ఆలోచనలన్నీ దూరం కొట్టి ఎడ్లను గుంటుక్కు కట్టాడు. గుంటుక కర్రుమని బకాట్లో గీరుతూ నడుస్తున్నది.

అప్పటికి తూరుపు రేకలు బారుతున్నాయి.

* * *

బుచ్చిరెడ్డి కురుపెకట్టెతో కొంగ్రలు గీయడానికి ప్రయత్నం చేశాడు. చేతులు వనుకుతున్నాయి. కొంగ్రలు వంకర టింకరగా వస్తున్నాయి. అది రెండెకరాల గుడ్డం. పడమటి వేపున పెద్దబావి. దానినానుకొని ఇంకో రెండకరాల పొలం ఉన్నది. బావి గడ్డమీద కరంటు మోటర్ షెడ్డు — షెడ్డు చుట్టూ జామ, నిమ్మ చెట్లున్నాయి.

అప్పటికి తడిసిన మట్టిమీద బంగారు తీగల్లాగా ఎండ పొడమెరుస్తోంది. సీతాకోక చిలుకలు, దువ్వేన్లు, అప్పటికి రెక్కలాడని ఉసిల్లు ఎగురుతున్నాయి. ఉసిల్ల వేటలో పక్షుల మందలు ఎటుచూస్తే అటు నాగండ్లు, గుంటుకలు, రైతుల ఎడ్ల అదిలింపులు - పిలుపులు అరుపులు.

గెట్టు మీది కొచ్చి బుచ్చిరెడ్డి నిలుచున్నాడు. ఊరుదిక్కు చూశాడు. ఊళ్ళో గుడిసెల కప్పుల్లో నుండి పొగలు దట్టంగా లేస్తున్నాయి.

పక్క పెరట్లో కొమురమ్మ, శంకరయ్య మక్కలు వేస్తున్నారు. శంకరయ్య ఉరుకులు పరుగుల మీద నాగలి నడుపుతున్నాడు. ఆ నాగలివెంట మక్కలెయ్యలేక కొమురమ్మ గొనుగుతోంది. వాళ్ళ పెద్ద బిడ్డ చంకలో పిల్లవాన్ని మట్టిలో దింపేసి ఆరుద్ర పురుగులను ఏరుతోంది.

“ఒపోరీ! తమ్మునెత్తుకోవే” కొమురమ్మ అరిచింది. మట్టిలో పిలగాడు నాగలి కేసి పాకుతూ ఏడుస్తున్నాడు. పిల్ల విన్పించుకోలేదు.

బుచ్చిరెడ్డి తన పని మరచిపోయి పిల్లవాన్ని ఎత్తుకున్నాడు. శంకరయ్య నాగలి ఆపిండు.

కొమురమ్మ వచ్చి “పెదనాయిన్నా! రాత్రినుంచి పాలు చీకలేదు. ఈయినేమొ ఇప్పుడే అనకాలం బూనినట్టు చేత్తండు.” పిల్లవాన్ని తీసుకొని గట్టుమీద కూర్చుండి రొమ్ము నోట్లో పెట్టింది.

శంకరయ్య వచ్చి అక్కడి వాలకం చూశాడు.

చిన్న అంచెలో పెసల్లు, వంకర గీతల కోండ్రలు, గుంటుక మీదనే నెమ రేస్తున్న ఎడ్లు....

శంకరయ్యతో బుచ్చిరెడ్డి మాట్లాడక దాదాపు ఆరేండ్లవుతున్నది. ఒకప్పుడు శంకరయ్య అపూరి రైతుకూలి సంఘం అధ్యక్షుడు....ఆ తరువాత బుచ్చిరెడ్డికి ఎన్నో జ్ఞాపకం వచ్చాయి.

నిజానికి బుచ్చిరెడ్డి శంకరయ్య దిగజారి పోయాడనుకున్నాడు. శంకరయ్య కురుపెకట్టె తీసుకొని ఎకరం కోండ్ర లేశాడు. "నీనుంచేమయితదె లచ్చిరెడ్డి అన్నా రాకపాయె." శంకరయ్య.

ఆ పొడిమాటలకే బుచ్చిరెడ్డి గుండె రెపరెపలాడింది .... ఇన్ని రోజులు అందరు దేనికో దానికి లొంగిపోయిన వాళ్ళగానే చూశాడు. అందరు మాకేమ స్తదనే లెక్కలు కట్టేవాళ్ళే అనుకున్నాడు.

కాని వీళ్ళంతా నెత్తురు మాంసాలున్న మనుషులే....వాళ్ళకు చెప్పలేనన్ని బాధలు, బంధాలున్నాయి.

ఆ ఆలోచన తనకే కొత్తగా అన్పించింది.

పంచె ఒడి కట్టుకొని పిడికెడు పెసల్లు తీసి నేలమీద జల్లాడు. ముసలితనం వలన చెయ్యి వనుకుతోంది. పెసల్లు కోండ్రలో పడటంలేదు.

"ఎవలనన్న కై కిలి పెట్టకపోయినా? మనుసాగక పచ్చినవ్ గని-" శంక రయ్య పెసల్లుకూడా తనే అలికాడు.

బుచ్చిరెడ్డి ఒక్క మాట మాట్లాడలేదు. ఎన్నెన్నో చెప్పాలని ఉన్నది. ఈ ఆరేండ్ల కడుపుల ముచ్చెట్లు ఊరికి సంబంధించినవి. మూడేండ్ల ముచ్చెట్లు వాళ్ళ రెక్కల్లబొక్కల్ల మెదిలిన చిన్న కొడుక్కు గురించినవి.

శంకరయ్య మళ్ళీ నాగలిపట్టాడు. కొమురమ్మ మక్క లేస్తున్నది.

"పాపం నలుగురు కొడుకులుండి ముసలోల్లిద్దరు గీఊళ్ళె ముసలి గువ్వల తిర్గున్నరు," కొమురమ్మ.

శంకరయ్య మాట్లాడలేదు.

"పెద్దకొడుకు ఓరంగల్లుల పెద్దనౌఖరేసటగదా! అడికన్న పోతేంది?"

"మట్టిని నమ్ముకున్నోడు అడికిబోతె పిస్సలపడ్తడు"

"మరి లచ్చిరెడ్డన్నా ఇల్లు వట్టుకొని ఉంచేంది?"

"ఉండనిత్తరా? పోలీసోల్లు-మీ తమ్ముడేడని బెదిరిచ్చేడు. ఎన్ని పారీలు తాన చుట్టూ తిరిగిసావలేదు."

"చిన్న పొలగాడు ఇప్పుడు ఏడున్నడో-అయినె పోయినకాన్నుంచి మన ఊళ్ళె—"

"నాకే మెరుక?"

"అబ్బో నీ కెరుక లేకుంటుంటదా? చెప్పవుగని."

"నాకు చెప్పిపోయిండా? ఏంది?"

"అక్క డెక్కన్నో నూటయాభై రూపాల సార్జి తలిగే అవుతల జేల్లున్నదట-తండ్రికి ఉత్తుర మేసిండట."

"నీ కెట్ల తెల్సిందే?"

"చింతకింది రాయక్క నశ్యం దంచుకోనుబోతె సుగుణవ్వ చెప్పుకొని ఏడ్సిందట-బొగని-మీరేం మనుసులు. అయినె కొడుకున్నంత సేపు వాళ్ళింటికి బోతిరి. అయింక బందయితిరి. ముసలోడు నాఎరుకలనుంచి నికార్సుమనిషి. మీరంత-ఆయన కాల్రెక్కలిరిపిత్తిరి."

శంకరయ్య దీనికేమి జవాబు చెప్పలేదు. అతనిదగ్గర జవాబులేదు. ఇవ్వాళ్ళ పరిస్థితి మారింది....

భర్తమౌనం చూసి "ఎట్లయినా ఓడ దాటేదాక ఓడమల్లప్ప ఓడ దాటినంక బోడ మల్లప్ప అంటే ఎట్ల....తిరుపతిరెడ్డి దొర-ఆనింట్ల పీన్గెల్ల ఆడు ఏ పట్నంల సచ్చిండోగని ఆడు ఊళ్ళెరోజుకో జగడం—పూటకో పంచాదు బెట్టిచ్చె. నా కెరుకున్న కాడికెల్లి గీ ఊళ్ళె దొరకు దండం బెట్టంది గీ బక్కముసలి పెద్దనాయనే. అయినె మన అందరితోపాటు దెబ్బలు దినె తన్నులు దినె జేల్లబడె. ఆపారి మతికత్తె పెయ్యంత గొగ్గరిత్తది." కొమురమ్మ.

గుంటుక వెంబడి ఊగుతూ నడుస్తున్న బుచ్చిరెడ్డికి సరిగ్గా ఇలాంటి ఆలోచనలే వచ్చాయి. స్కైలాబ్ కూలి ఊళ్ళమీద బడుతదని ఊళ్ళల్లో పెద్ద దుమారం. అందరు ఎప్పుడు సత్తమోనని కోళ్ళు గోసుకున్నారు. పూట్‌గా తాగారు. తాగని పిల్లలు కొందరు హరిజనవాడకు దారిగురించి తిరుపతిరెడ్డిదొర పెరడి బండగోడ విచ్చేసిండ్లు- దారి చేశారు. మిట్టమధ్యాహ్నం ఆ కబురుచేరి ముగ్గురు పోలీసులువచ్చి

శంకరయ్యను తన చిన్నకొడుకు నిరంజన్‌రెడ్డిని పట్టుకున్నారు. మాటా మాటా పెరిగింది. పోలీసులు వొదులలేదు. రెచ్చిపోయిన జనం మీదబడి కొట్టారు. బట్టలు చింపేశారు. వాళ్ళు వెళ్ళిపోయి మునిమాపు జీబువచ్చింది. పన్నెండుమంది పోలీసులు వచ్చారు. వాళ్ల వస్తారని తెలిసే ఆడోల్లు కారంపొడి రోకండ్లు పట్టుకున్నారు. వాళ్ళందరిని నడిపింది కొమురమ్మే. అప్పుడు ఆరునెలల గర్భవతికూడా. తుపాకులు ఎత్తకుండానే ఊరుఊరంతా కలిసి పొల్లుపొల్లు పోలీసోల్లను గొట్టారు.

ఆ తరువాత ఊరు ఊరంతా గుడిమెట్టుబట్టింది. పోలీసులు తనను రక్తాలు కారంగ కొడుతూ థానాకు పట్టుకపోయారు. చెయ్యి విరిగింది. రక్తామండలం.

బుచ్చిరెడ్డి నుదురుకు పట్టిన చెమట తుడుచుకున్నాడు. అంతా కలిపి ఇరువై సుట్లన్నా గుంటుకు కొట్టలేదు.

అంబటేల్లయ్యింది. శంకరయ్య కొమురమ్మ కనిపించలేదు. ఆరెకరంమక్క లేసి వెళ్ళిపోయినట్లున్నది. బాగా చీకటి పూటనే నాగలి కట్టినట్టున్నది.

దప్పి అయినట్టనిపించి బావిదగ్గరకు నడిచాడు. దిగుడుబావిలోకి దిగి నీళ్ళుతాగి ఒడ్డెక్కేసరికి పానం చిత్తుబొత్తైంది. ఎండ అగాంచి కొడుతోంది. దక్షిణంవేపు గుడిమెట్టుమీద మబ్బులు అదరబాదరగా పరుగెత్తుతున్నాయి.

తన పెరడి నానుకుని ఉన్న తిరుపతిరెడ్డి ఇరువై ఎకరాల పెరట్లో తంగెళ్ళు మొలిచాయి. అందులోనే గొల్లవాళ్ళ గొర్ల మేపుతున్నారు. దూరంగా కనిపించే ఈదులవాగు బండునుండి ఎవడో గొల్లవాడు కేకవేశాడు.

అక్కడెక్కడో తీతువపిట్ట గూస్తోంది.

మళ్ళీ ఎండకాలం లాగే ఎండ కాస్తోంది. పెళ్ళగించిననేల ఎండలో నల్లగా మెరుస్తోంది.

జామచెట్టు నీడకు బుచ్చిరెడ్డి కూర్చున్నాడు.

బనీను జేబులోనుండి బాగానలిగి పోయిన ఉత్తరం తీసి అది తన కొడుకు గుండెకాయ అన్నట్లు రెండు చేతుల్లో పట్టుకొన్నాడు.

ఆ ఉత్తరం పదిమార్లో ఇంకా ఎక్కువగానో చదువుకున్నాడు.

"మేం పట్టుబడి ఆరునెలలైంది. మూడుగజాల పొడుగు రెండు గజాల వెడల్పున్న గదిలో ఇద్దరం ఆరునెలలనుండి ఉంటున్నాం. మాకు భాషరాలేదు .... ఇక్కడినుండి విశాఖపట్నం ఏదో కేసంట తీసుకపోయారు.

ఆ తరువాత ముసలాయన కళ్ళు మసకేసి పోయాయి. "నీ ఆరోగ్యం బావుందా ? నువ్వు అద్దాలు కొనుక్కున్నావా ?" నిజానికి ఈ వాక్యాలు అతనికి కన్పించలేదు.

తను గత యాభయేండ్లనుండి తలవంచకుండా బతికాడు. ఊళ్ళో అందరు తలవంచి తనువంచనందుకు దొర తన కులస్తుడే పాలివాడే అయినాకూడా దెబ్బలు కొట్టించాడు. తన అన్నదమ్ములు తన్ను ఈసడించుకున్నారు. తనస్వంత తమ్ముడే తలవంచి అమీన్ ఉద్యోగం సంపాదించాడు. చివరకు తన కొడుకులు "బాపూ నీ కెందుకే. అందరు తందానా అంటే నువ్వు తానే తందానా అంటే కాదా ? ఉప్ప రోల్లు, గొల్లోల్లు, కాపోల్లు, మాదుగులు, మన్నేలజోలి నీకెందుకు ఎవడేగంగల కలిస్తే నీకెందుకు ?" అన్నారు.

కాని ఒక్క చిన్నకొడుకు తన తండ్లాట అర్థం చేసుకున్నాడు.

"మనిషి బతకడం అంటే ఏంది ?" బుచ్చిరెడ్డికి మళ్ళీ అనుమానం కలిగింది. మళ్ళీ వెనుకటి ఆలోచనల్లోకి కూరుకపోతున్నాడు. నిస్సత్తువగా అయిపోతున్నాడు.

బుచ్చిరెడ్డి లేచి నిలుచునేసరికే శంకరయ్య గుంటుకుతెచ్చి తన పెరడిలో ఆపి బావికాడికే వస్తున్నాడు.

బుచ్చిరెడ్డికి కడుపు దేవినట్లనిపించింది.

సద్దిమూటదెచ్చి బావిదగ్గరపెట్టి, "నువ్వేం ఫికరుపడకు బాపూ- కాపురాయ లింగన్న వస్తానన్నాడు. పెసల్లు అలుకుతం" అన్నాడు.

"వద్దు శంకరీ ! సత్తవడుత నేనే అలుకుత".

"సచ్చెడెందుకు బాపూ" బుచ్చిరెడ్డిని ఆ వూరి వాళ్ళంతా అట్లాగే పిలుస్తారు

బుచ్చిరెడ్డి మాట్లాడలేదు.

"ఓ బామ్మర్ది - ఏడగుంటుకు కొట్టాలే" పెరట్లో నుండి కాపోల్ల రాయలిం గం కేకేశాడు.

శంకరయ్య వెళ్ళి గుంటుకు పట్టాడు.

ఆలోచనలు కట్టిపెట్టి బుచ్చిరెడ్డి గుంటుకుకాడికి నడిచాడు.

0 0 0

ఆకాశంలో చిక్కగా మబ్బులు పట్టాయి. వాతావరణం ఉక్కగా ఉన్నది. బుచ్చిరెడ్డి అడ్లు అలికాడు. పెసల్లు అలికాడు. ఇంటిదగ్గర దళ్ళబాగుచేశాడు.

ఉదయం పదకొండు గంటలకు అతని నడిపికొడుకు లచ్చిరెడ్డి వచ్చాడు.

"వచ్చినవ కొడుక- పాండవులకు వనవాసం కష్టాలచ్చినట్లు మనకు ఎన్ని తిప్పలు వచ్చెకొడుకా? ఇంటికాడ కోడలు, మనమడు బాగున్నారా? కొడుకా" సుగుణమ్మ లచ్చిరెడ్డి ఒళ్ళంతపునికి చూసింది.

బుచ్చిరెడ్డి పట్టి చేతులతోనే వచ్చాడు. అతనికి కొండంత ధైర్యం కల్గింది. సుగుణమ్మ కళ్ళల్లో జలజలనీళ్ళు పొంగినయ్. ఆమెకు చిన్నకొడుకు జ్ఞాపకం వచ్చాడు.

లచ్చిరెడ్డి ముఖంలో మార్పులేదు. లచ్చిరెడ్డి ఒడ్డుపొడుగు మనిషి. కోల ముఖం. కొద్దిగా గడ్డం పెరిగున్నది. అరుగుమీద మంచాలో తలపట్టుకొని కూర్చున్నాడు.

కొడుకు వ్యవసాయపు పనులగురించి అడుగుతాడని తాను అన్నీచేసి పారేసినట్లుగా చెప్పాలని బుచ్చిరెడ్డి ఉబలాటపడ్డాడు .... అంతకన్నా ముఖ్యంగా అతనికి కోరాపుట్ జైలునుండి కొడుకు రాసిన ఉత్తరం జ్ఞాపకమొచ్చింది. అదితీసి చేతికిచ్చాడు.

"వాడు ఎండలబడి వచ్చిండా? లేరా కాళ్ళు కడుక్కో- అన్నంతిను" సుగుణమ్మ.

లచ్చిరెడ్డి ఆ ఉత్తరం చదువుకున్నాడు. లచ్చిరెడ్డి ముఖం వానమబ్బు కమ్మిన ఆకాశం తీరుగై పోయింది. మంచాల్లోనుండి లేవలేదు.... తలవంచుకొని కాసేపు కూర్చుండి ....

"వనమిడిసిన కోతి తీర్గయింది. పెద్దన్నకు వెయ్యిలకు వెయ్యిలు బెట్టి చదివిచ్చిండ్లు. ఏరంధీ రవుసు లేకుంట బతుకుతండు. నావెనుకోడు చదువుకున్నడు. చిన్నోడు చదువుకున్నడు, ఎటుగాకుంట జేసిందినన్నే. ఈ ఊళ్ళెనన్న సత్తవడుత బతుకుదామంటే వాడు సంఘమో సంఘమంట బెట్టిండు. బాపుజబ్బ లెగిరేసిండు. ఎటుపోకుంట నాబతుకే తెర్లయిపోయింది". లచ్చిరెడ్డి గొంతు అంతకంతకూ బలహీనమైపోయింది.

అ మాటకు బుచ్చిరెడ్డి విలవిలలాడిపోయాడు.

"నన్నెక్కడకాకుంట జేసింది బాపే" లచ్చిరెడ్డి వెక్కి-వెక్కి- ఏడ్చిండు....

"అందరు బాపునే అనండ్లిరా ?" సుగుణమ్మ ఏడుపుగొంతుతో- బుచ్చిరెడ్డికి ఆమాటకాదు. అరుగుమీద సొమ్మసీలి కూర్చున్నాడు.

"నాపాలు నేను అమ్ముకుంట- మా అత్తగారింటకాడ కుక్కబతుకైపోయింది."

ఈ మాటకు విలవిలలాడిపోయాడు బుచ్చిరెడ్డి.

లచ్చిరెడ్డి ఇంకా ఏడుస్తూనే ఉన్నాడు.

బుచ్చిరెడ్డి "లచ్చన్నా ! అమ్ముకోరా ! భూములు జాగలు ఇండ్లు అన్ని అమ్ముకో- సాలకపోతే- మీ అమ్మను నన్ను అమ్ముకో" అని లేచి పశువుల కొట్టం లోకివచ్చి గడంచలో వెల్లకిలా పడుకున్నాడు.

లచ్చిరెడ్డి ఇంకా ఏదో అంటున్నాడు. "వాళ్ళ రోజుకొకన్ని చంపుతండ్లు — ఊళ్ళకు ఉగ్గం వచ్చింది. మా రే అటుగానోడు ఇటుగానోడు బతుకవశంగాదు.... వాళ్ళ తీసుకపోయి చంపుతరు.... వాడు మారాజు తీర్గపోయిండు.... వానిమీదికోపం నాయిన్నను నన్ను తీసుకపోయిదంచిరి. ఈడ ఎట్లుండుమంటవే అమ్మ"

ఆ తరువాత ఇద్దరి ఏడుపులు వినిపించాయి.

ఉరుములు ప్రారంభమయ్యాయి. చింతలు జయ్యిజయ్యిన వంగుతున్నాయి. తాడిచెట్లు ఒకటే గలగల. గాలిమోతకు ఉరుములకు ఊళ్ళె ఎవరిపిల్లో భయపడి ఏడుస్తోంది.ఎవడో వీధిలో 'గుంటుకలకు పోయినోళ్ళు గుద్దుకుంటచ్చిరి. నాగండ్లకు బోయినోళ్ళు నవ్వుకుంటచ్చిరి' అంటూ తపతప్పకాళ్ళు పడుతుండగా పరుగెత్తు తున్నాడు....

తప్పడతప్పడ గవ్వలంత చినుకులతో ప్రారంభమయ్యింది వాన.

ఈ చప్పుళ్ళమధ్య- బుచ్చిరెడ్డికి ఎన్నెన్నో జ్ఞాపకం వచ్చాయి.

తన కొడుకు ఒక్కడు పార్టీలో కలిసిపోతే తన కుటుంబమేకాదు. ఊరు ఊరంత గాలికి మొదలంటా చెట్టూగినట్లు ఊగిపోయింది. తను తన జీవితకాలమంతా దొరలను ఎదిరించాడు. దానివలన తనే తన్నులుతిన్నాడుకాని- ఊరుకేంగాలే— కాని ఇప్పుడు ఇట్లా ఎందుకౌతున్నది.

అంతెత్తు, వెడల్పుముఖం, బొద్దుమీసాలుగల నిరంజన్‌రెడ్డి బుచ్చిరెడ్డి చిన్న కొడుకు తనపక్క నిలుచున్నట్టే అన్పించింది.

ఊళ్ళో ఇరవై కుటుంబాలదాకా రెడ్డికుటుంబాలున్నాయి. అందులో నాలుగు కుటుంబాలు తిరుపతిరెడ్డివి.... ఆ నాలుగు కుటుంబాలుతప్ప మిగతా పదహారు కుటుం బాలు కులంరీత్యా రెడ్లే అయినా స్థాయిరీత్యా మిగతా రైతులతోపాటే- చాలామంది

ఏదో వొకరకంగా తిరుపతిరెడ్డికి తలవంచారు. కేరిదార్లుగా మారారు. ముకుందరెడ్డి తనలాగే తలవంచక- గోదావరిఖనికి వెళ్ళిపోయి బాయిపని చేసుకుంటున్నాడు. అతని బిడ్డ సుమతి. ఆమె భర్త పార్టీలో కలిసిపోయాడు.

తనతమ్ముడు ఈ గొడవలుపడలేక చదువుకున్నడు కనుక పోలీసు ఉద్యోగం దొరికి వెళ్ళిపోయాడు. వాడు అమీనయ్యిండు. వాడికి పిల్లలు లేకుంటే నిరంజన్‌రెడ్డిని సాదుకం ఇచ్చారు.

అక్కడవాడు రాజభోగాలే అనుభవించాడు. కాని అక్కడికన్నా వాని ధ్యాసంతా ఊరిమీదనే- ఉప్పరివాళ్ళపిల్లలతో ఆడటం.

బుచ్చిరెడ్డికి మూడేండ్లక్రితం డిపార్టుమెంటు బాధపడలేక రాజీనామా చేసిన తమ్ముడు జ్ఞాపకంవచ్చాడు. వాడి మూలకంగా ఆ భార్యాభర్తలిద్దరు ఎప్పుడు తగువులే -

"నిజంగానే నిరంజన్ వీళ్ళందరి కుటుంబాల్లో చిచ్చు రేపాడా ?"

వర్షం పెద్దదయ్యింది. వాకిట్లో నీళ్లు పారుతున్నాయి.

పెరడిదగ్గర కరంటు మోటార్ షెడ్లో మీటింగు బెట్టారు. తనకు తెలియని వాళ్ళు నలుగురు వచ్చారు. అందులో బుచ్చిరెడ్డి వయసున్న ముసలాయన—ఈ ముసలాయన కేంబొయ్యేకాలమో అర్థంకాలేదు.

తనను కావలుంచారు. వాళ్ళు మాట్లాడుకుంటూ ఉండగా నిరంజన్ తనదగ్గర కూర్చున్నాడు. తనధ్యాసంతా ఆ నలుగురిమీదే-తనను అటునుండి మళ్ళించడానికి.

"బాపూ ఓ పారి ఏమయ్యిందో ఎరికేనా ?"

"నాకెట్ల తెలుస్తుందిరా ? నాది గొడ్డటి పురాండం. నా కెరుకున్నదల్లా మాటంటె పడకపోవడం."

"ఎవలంటె"

"మనూళ్లె రైతులు నన్ను ఎందుకంటారు ?

"మరి ఎవలంటారు ?"

"వాడేవొర- అందరితీర్గ నేను కోతిదండాలు బెట్టాలె. వాడు రెడ్డిపుటుకే బుట్టిండు నేను గదేకులం. నేను కష్టంజేసుక బతుకుతున్నవానికి మాదుగులు మన్నేల తీర్గబాంచెనంట ఎందుకు బతుకాలె"

"బాపూ మాదుగులు మన్నేలు బాంచెనెందు కంటరే ?"

"ఈ ప్రశ్నకు బుచ్చిరెడ్డి తికమకపడ్డాడు.

"అదట్లాపోనియ్యి, తిరుపతిరెడ్డికి నువు దండం బెట్టలేదనే కోపమా ? మరి మా మగులు మన్నేలు దండం బెడుతరుగదా ? వాళ్ళవాడకు దారెందు కియ్యలేదు.... ఉప్పరోల్లకు ఇటుక జేసుకుంటె బట్టికింతని ఎందుకు గుంజుకున్నడు. ఎందరి భూములు గుంజుకున్నడు...."

"నువ్వు దండం బెట్టనందుకే నిన్ను కొట్టించిండనుకున్నవ్- కని మన గీ బాయికాడి పెరడి పదెకరాలంటివి. ఇప్పుడు నాలుగెకరాలు లేదు. నువ్వు కేసులకు దిర్గి అమ్మినవ్-దొరకుగాదు. అయ్యోరిపంతులుకు. అయ్యోరు పంతులు మరునాడే తిరుపతిరెడ్డి కిచ్చిండు. బాపూ నువ్వేకుల మన్నదిగాదు. నువ్వొక్కనివే ఎదురునిలిచిన పన్నదిగాదు. నువ్వు తలవంచలేదు. నిజమేకని" ఎందుకో నలుగురు పిలిస్తే వెళ్ళి గంటతరువాత వచ్చిండు.

"ఒపారి ఏం జర్గిందంటే....మనూల్లె కొట్లాటబడ్డంక నేను ఎల్లిపోయిన్నా. నేను పెద్దపెల్లి ఆవల తిరిగిన - ఏ వూరని అడుగకు. నేను గౌండ్లోల్లింటికాడ ఉండుడు. అయినె బావనురిదని చెప్పిండు. తాళ్ళయితే ఎక్కరాదు....కని కల్లు కుండలు మొయ్యబెట్టిండ్లు ద్దుత్తెరి గిదేం పార్టీపని అనుకొని కోపంగుండె - ఒనాడు కాగంతకుండ సుట్టబట్ట బెట్టుకొని నెత్తిమీద బెట్టుకున్న. అయితె చెప్పలేదుగద- మనూరితీర్గనే లొల్లిబడి పోలీసుక్యాంపు బెట్టిండ్లు. ఆ వూల్లెమల్ల అందరిని కుప్ప జెయ్యాలె....మునుపటితీర్గపోతే కలుపడి. కుండనెత్తిమీద బెట్టుకొని నడుస్తున్న. మెద నరాలు జువ్వజువ్వలాడుతున్నయ్. తాటితోపుకు ఊరికి మద్దెన మన అగుతీర్గనే ఈదుల వాగున్నది. అక్కడివచ్చేటాల్లకు నాకు ఎక్కడలేని కోపమొచ్చింది. రెడ్డి పుటుక పుట్టుదేంది ? కల్లుకుండలు మోసుదేంది ? కల్లుకుండ ఎత్తేసిన - పార్టీవద్దు మన్నద్దు అనుకున్న-ఎందుకో బాగా ఏడుపువచ్చింది. ఎటుగాకుంటయిన్నానని, చిన బాపు తిట్లు జ్ఞాపకం వచ్చినయి. వాగొడ్డుకు కూర్చున్న, కంజీకటయ్యింది. అంతలోనే నేను ఎంతకు రాకపోయేసరికి ఆ గౌండ్లాయన అదుర్దాపడి ఏం జరిగిందోనని, పోలీసులుగిన పసిగట్టిండ్లోమోనని ఎగపోసుకుంట ఉరికచ్చిండు. నన్ను చూడంగనే నా మీదవడి పెయ్యంత పునికిండు. కన్నీళ్ళతో నా కదుపుల తలబెట్టిండు....రుమాలుతో ఒళ్ళు తుడిచిండు. బాపూ నాకు చిన్నప్పుడు నీ పక్కలో పడుకున్నట్లు- బాపూ చిన్న బాపు బాగాతిట్టి ఏడిస్తే సైకిలు కొనిచ్చి నేను నిదరపోయినప్పుడు నన్ను పునికి నట్టు...."

''బాపూ నేను పోతున్ననే.''

బుచ్చిరెడ్డి ఉలిక్కిపడ్డాడు. వానవెల్సింది. కొద్దిగా తుప్పరపడుతోంది.

లేచి నిలుచున్నాడు. ఏమాట తోచలేదు.

"మనకట్టాలు కడతేరి తమ్ముడింటికత్తె వెంకటేశ్వరస్వామికి అందరిని తీసు కత్తనని మొక్కిన కొడుకా ! జేగర్తగపో."

"నా మనసు మంచిగలేక ఏదో అన్నబాపు. తమ్ముని దగ్గరికి మన సత్తెన్నను తీసుకుపో. అన్నదగ్గర అయినువందలడిగి పంపిత్త. పది దినాలనుంచి అందరం అత్తామనుకుంటన్నం. ఇంతట్ల వాన్నెవనో సంపిరి. ఊళ్ళల్ల ఉసికి ఉడుకుతంది. మల్ల పదిరోజులకత్త."

బుచ్చిరెడ్డి కలలో నడిచినట్లుగా కొడుకువెంట వాకిలిదాకా నడిచాడు.

వాళ్ళు వీధిమలుపు తిరిగి మూడు పానాదులదాకా వచ్చారు.

సుగుణమ్మ ఏదో చెప్పుతూనే ఉన్నది. బుచ్చిరెడ్డి నీళ్ళ కాలువల్లో అడ్డకట్టలేసి ఆడుకున్న పిల్లలను చూస్తున్నాడు....అతని కళ్ళల్లో ఊరిన నీళ్ళు — జ్ఞాపకాలు మరిచిపోదామని....

సుగుణమ్మ ఆగిపోయింది. బుచ్చిరెడ్డి లచ్చిరెడ్డివెంట చాలాదూరం వచ్చాడు.

ఆంజనేయునిగుడి దగ్గర లచ్చిరెడ్డి ఆగి తండ్రిని ''ఇగపోయే బాపూ'' అన్నాడు.

బుచ్చిరెడ్డి కొడుకుదగ్గరికాకా వచ్చి "మిమ్ములందరిని పిల్లజెల్లాతోని బతుకాలనే పెంచిన - కని....నాకు తెలువకుంటనే గిట్లయ్యింది. చిన్నోడు మిమ్ములనెప్పుడు ఆ మాటకత్తె ఈ భూలోకంల ఎవలను అసినిత్తని మాటనలే. వానిదారి మంచిదో సెడ్డదో నాకెరకలే. వానిమీద కోపం బెట్టుకోకు." ఇంకా చాలా చెప్పాలనుకున్నాడు చిన్నకొడుకు హృదయం తనకు మాత్రమే తెలిసిన హృదయాన్ని విప్పాలనుకున్నాడు. తన మొత్తం బతుకులో ఇలా నెమ్మదిగా మాట్లాడి ఎరుగడు. ఈ తీరు తనదికాదు.

''నాకు వాడు తమ్ముడుకాదే. ఏంజెయ్యాలె బాపు నా మనుసంతా ఎలుగడి బడ్డట్టుగున్నది" లచ్చిరెడ్డి చరాచరా వెళ్ళిపోయాడు.

బుచ్చిరెడ్డి హనుమాండ్ల గద్దెమీద కూర్చున్నాడు. గాలికి బొడ్డుమల్లె చెట్టు మీదినుండి వాన చినుకులు టపటప రాలుతున్నాయి.

తడిసిపోయి గుడ్డలు ఒంటికి అతుక్కుపోయి – పనులు సాగక గుంటుకలు, నాగండ్లు బజార్లో గిరుతుండగా చెక్కుకపోయిన చెంపలవాళ్ళు, ముఖాలమీద నెత్తురు లేనివాళ్ళు వస్తున్నారు.

చంకల్లో పిల్లల్నేసుకొని ఇంటిదగ్గర కావలున్న కొంచెం పెద్దపిల్లలు వీధుల్లోకే వచ్చి తల్లులకిస్తున్నారు. అరుపులు, పిలుపులు-ఎడ్ల కాలిగిట్టల చప్పుడు, వర్షానికి తడిసి రెక్కలార్చుకుంటూ ఎగిరే పక్షులు.... ఈ మొత్తం శబ్దప్రపంచం తనదికానట్టు-ఇందులో తను లేనట్టు రాతిస్థంభానికి జేరగిలబడి కూర్చున్నాడు....

తన చిన్నకొడుకు మల్ల ఊళ్లెకువస్తాడా ? వచ్చి పెండ్లిచేసుకొని అందరిలాగే బతుకుతాడా ? పెళ్ళిచేసుకున్నాడంటారు ? ఇందాక బాయికాడి మీటింగులో తెగిపోయిన ఆలోచన గుర్తొచ్చింది. వాడు తన అనుభవంద్వారా తన లోపమేమిటో ఎత్తి చూపాడు. తన కుటుంబం మొత్తం ఆఖరుకు భార్య, తమ్ముడు పెద్దకొడుకు చిన్నకొడుకు అందరు తను తిరుపతిరెడ్డికి లొంగిపోతే తమ బతుకు ఇట్లా ఉండకపోవునన్నారు. తిరుపతిరెడ్డి ఊరువిడిచి వెళ్ళిపోయిండు. ఇప్పుడు తమ్ముడు చెయ్యిబట్టే తమ బతుకు అల్లకల్లోల మయ్యిందంటున్నారు. కాని వాడు ఏమన్నాడు. ఆ అల్లకల్లోలం మనుషుల్లోకాక మనుషుల బతుకు తెరువులో ఉందన్నాడు. తిరుపతిరెడ్డికి లొంగినా లొంగకపోయినా రైతు బతుకు ఇంతే - కూలీలబతుకులు అంతే. కొట్లాట వీళ్ళకు లేనిది వాడికున్నదాంట్లో ఉన్నది. కులం ఒక్కటే అనికాదు.

అతనికి చివరిసారిగా మహారాష్ట్రలో కొడుకును కలిసింది జ్ఞాపకం వచ్చింది.

అప్పుడు ఇట్లాగే జైలునుండే ఉత్తరం రాసిండు. అటడిగి ఇటడిగి పోయే సరికి రెన్నెల్లుపట్టింది.... తనకు బేల్ ప్రయత్నం చేయమన్నాడు. తనవెంట పెద్ద కొడుకు వచ్చాడు.

ఆరునెలలు తిరుగగా తిరుగగా బేల్ దొరికింది. జైలునుండి విడుదలయ్యేసరికి సాయంత్రం అయిదయ్యింది. రైలుస్టేషన్‌కు పోదామన్నాడు తను.... రాత్రికి బండున్నది అంతదాకా స్టేషన్లో కూర్చుండాలెనని తనను ఒక మరాఠీ పంతులింటికి తీసుక వెళ్ళాడు. అక్కడ పిల్లలు, ఆ ఇంటామె ఒకటే హడావిడి పడ్డారు. వాళ్ళ స్వంత తమ్ముడే వచ్చినట్లుగా. వాళ్ళతో నవ్వుతూ ఆడుకున్నాడు. తనకు ఆ భాషరాక చూస్తూ కూర్చున్నాడు.

కాసేపటికి నేలమీద గోడనానుకొని కూర్చుండి-

"బాపూ" అన్నాడు ఆ పిలుపు కొత్తగా వింతగా ఉన్నది.

"బండెప్పుడురా నిరంజన్." అప్పటికి రాత్రయిపోయింది.

వాళ్ళు తిండికి పిలిచారు. ఆ పంతులు ఎటోపోయి వచ్చాడు.

తిండితిన్న తరువాత డాబామీదికి తీసుకవెళ్ళి తెల్లగా పిండారబోసినట్లుగా కాసే వెన్నెట్లో "బాపూ" అని ఇందాకటి పిలుపే పిలిచాడు. అప్పుడర్థం కాలేదుగాని- ఇప్పుడు వాడేదో చెప్పదలుచుకున్నాడు. ఆ గొంతునుబట్టి వాడేమి చెప్పగలడో అర్థమయ్యింది.

"నిరంజన్- చిన్నబాపు ఉద్యోగం రాజీనామా ఇచ్చిండు. మీ చిన్నమ్మ ఏడ్చేడ్చి దవాఖాన పాలైంది. మీ అమ్మ .... నీ కాలుకు ఆపరేషనయ్యిందంటివి. మనిషివి సగమైపోయినవ్.... నువ్వు అడవుల పొన్నతిర్గలేవు. అదిగాక నీకన్న పెద్ద లీడరు జయరామ్‌రెడ్డి" తను చెప్పవల్సిన విషయాలు ఎక్కడ మర్చిపోతాడేమొ నన్నంత గాభరాగా చెప్పుకొచ్చాడు.

తలవంచుకొని అన్ని విన్నాడు.... వాడు ఏదన్న మాట్లాడుతే ఎన్నివాదాలు చెప్పాలో తను సిద్ధంచేసుకొనే ఉన్నాడు.

"బాపూ నువ్వు యాభయేండ్లు తిప్పలువడ్డవి- రెడ్డిపైపుట్టి పౌరుషం కోసం కాదు.... లొంగిపోతకాదు.... అంతకన్నా ఏ రైతుకు తిప్పలు లేకుంట బతుకవశం గాదుగనక్క."

ఈప్రశ్నా? ఇది జవాబా? తను నిరుత్తరుడయ్యాడు.

"బాపూ తను పుట్టి పెరిగిన వాతావరణంలోనుంచి తనకు ఇష్టమున్నా కష్టమున్నా మనిషికి ఒక్కొక్క బతుకు ఖరారై పోతుంది. నేను ఉద్రేకంతోనో, ఆవేశంతోనో ఈ మార్గం ఎంచుకున్నది కాదు. పోనీ నీమాటమీద వస్తాననుకో ఏమౌతుంది? ఆంధ్రా పోలీసులు నన్ను చంపడం ఖాయం లేదా మళ్ళి జైలు .... నారాయణరెడ్డి నీకు ఎరికేననుకుంట ఇప్పుడేంజేస్తండు.... బాధకాగలేక రహస్యాలు చెప్పిండు. దొళ్ళి పోయిండు. ఇప్పుడు పోలీసోల్ల పెట్టుకొని బతుకుతండు."

"అదిగాదురా? మొన్న జయరామ్‌రెడ్డి కల్సిండు.... భూములు, పంచాదులు, మనుషులు ఊళ్ళల్ల ఉంటే మీరుగీ అడివిల."

"ఇంకేమన్నడు."

"జగిత్యాల తీరుగ మల్ల రైతుకూలీ సంగాలు బెట్టాల్నట."

"పెట్టి"

"కొట్లాడాల్నట."

"సరే ఎవలద్దన్నరు?"

మళ్ళీ తనకు మాటలు దోయలేదు.

"బాపూ అదంత పెద్దకథ- ముంగటికి వోయినాకొద్ది పద్ధతి మారుతూ ఉంటది... కాదు ఎనకటి తీర్గనే ఉండాలంటారు కొందరు. వాడు ఎనుకటితీర్గ లేనప్పుడు మనం ఎట్లా ఉంటం.... వాడు సి ఆర్ పి తెచ్చినంక- దొరలు ఊళ్ళిడిచిపోయి పోలీసులే ఊళ్ళేలినంక- మునపటి తీర్గ సంగాలుండయి."

వాడురాడని అర్థమైపోయింది.

కాని ఆశచావదు. ఈ ఆరునెలల తిర్గడానికి అర్థమేమిటి?

"నాయనా నిరంజన్...." తనగొంతు పూడుక పోయింది.

అంతలోనే డాబామీడికి ఎవరో వస్తున్న చప్పుడు. మరాఠీ పంతులు వచ్చారు.

ఆ పంతులు, నిరంజన్‌రెడ్డి ఏదో మరాఠీలో మట్లాడుకున్నారు. మరాఠీ పంతులు వెళ్ళిపోయాడు.

"బాపూ రైలుకు మన ఆంధ్రా పోలీసులు వచ్చిండ్లట. రైలు ఆలస్యం అయ్యిందట- నాకు బేల్ ఇప్పించిన వకీలు ఇంటికి పోయిండ్లట- ఆ వకీలును తీసుక పోయి ఠానాలో వేసిండ్లట-" మళ్ళీ ఏమనుకున్నాడో ఏమో.... కాసేపాగి.

"పెద్దన్నకు చెప్పు- నాకోసం పైసలు ఖర్చుబెట్టిండు. అమ్మకు చెప్పు ఎప్పుడో వచ్చికలుస్త. తప్పకుండవచ్చి కలుస్త" మాట్లాడేది అయిపోయింది. వాడెటో ఇప్పుడే పోవడానికి తయారుగున్నట్టు తోచింది.

ఇద్దరు డాబాదిగి వచ్చారు. ముందుగదిలో ఇంకా మీసంరాని పిల్లవాడు ఎదురు చూపులుచూస్తూ కూర్చున్నాడు.

"బాపూ, వాడు నావెంటరాలేదని చెప్పు. నడిపన్నను వారంపది దినాలు ఎటన్నపొమ్మని చెప్పు. ఆయింకమర్చిపోతరు". తయారై పోబోతూ "చిన్నాయన, చిన్నమ్మకు నేను చెప్పేదేమున్నది. నేను మీకన్నవాళ్ళను బాగా కష్టపెట్టానని అనుకుంటరు...." వెన్నెల వెలుగులో వాళ్ళిద్దరు వెళ్ళిపోయారు.

బుచ్చిరెడ్డి ఎందుకో పొడుగ్గా గాలిపీల్చి లేచి నిలుచున్నాడు. కాళ్ళు పట్టేసి నయ్. హనుమాండ్ల గద్దెదికి బజాట్లోకొచ్చి నిలుచున్నాడు. పడమటిదిక్కు మబ్బు మాయలేని సూర్యుడు- గుడి సెలమీద సాయంత్రపు ఎంత మెరుస్తోంది. బజార్లో నీళ్ల ఇంకిపోయి పిల్లలువేసిన కట్టలు అట్లాగే ఉన్నాయి.

బుచ్చిరెడ్డి మొదట ఇంటికి పోవాలనుకున్నాడు. మనస్కరించలేదు. ఈ జ్ఞాప కాలు సంతోషం, దుఃఖం కాని అదేదో స్థితిని కలిగిస్తున్నాయి. బుచ్చిరెడ్డి ఈ జ్ఞాప కాలలోనే బతుకుతున్నాడు.

బుచ్చిరెడ్డి పెరడికేసిదారితీశాడు. మళ్ళీ కలగాపులగమైన జ్ఞాపకాలు..... అ త్తిరి బి త్తిరి మాటలు.

వాటిని దూరంగొట్టే ప్రయత్నంలో వడివడిగా నడుస్తున్నాడు.....

0 0 0

ఆకాశం మబ్బు మాయలేకుండా తేటతెల్లమైంది.

బుచ్చిరెడ్డి వాగొడ్డుకు ఎడ్ల మేపుతున్నాడు. ఎటుచూస్తే అటు పచ్చగా పునాస పంట పెసరు మొలకలు కన్పిస్తున్నాయి. దూరంగా కనిపించే గుట్టబోరు ఒక పచ్చని శిఖరంగా కనిపిస్తోంది.

ఆవలొడ్డుకు గొల్లకొమురయ్య గొర్ల మేపుతున్నాడు. పూరేడుపిట్ట కుర్రుమంటు న్నట్టుగా "ఆ పల్లెనగలవన్ని కంపదడులే" అంటూ పాడుతున్నాడు.

"ఒహోయి గొల్లబోయిడా! నీ అండ్ల నువ్వే పాడుకుంటన్నవ్" బుచ్చిరెడ్డి కేకేసిండు.

బుచ్చిరెడ్డికి ఏదన్నా పాడాలని ఉన్నది. "ముసలితనానికి దసిలిరైకతీర్గగిప్పుడు పాటలేంది" అనుకున్నాడు.

"ఎవలది - బుచ్చయ్య పటేలేనా ?" గొల్లకొమురయ్య ఒటుగాలు ఎగేస్తూ ఈదుల్లనుంచి బుచ్చిరెడ్డి దగ్గరికొచ్చిండు.

గొల్ల కొమరయ్య వయసు అరవైదాటినయ్. అయినా నల్లగా పొట్టిగా కాలిన తునికి మొట్టులాగుంటాడు. పెయ్యికి కొమురయ్య ఎన్నడూ అంగి తొడుగలేదు. ఎండా, వాన, చలిలో ఆ పెయ్య కాయగాసిపోయింది. అతనికి ఈ భూప్రపంచంలో నా అన్నవాళ్లెవ్వరులేరు. అతను ఏ పూరివాడో ఎవరికి తెలియదు. తెలంగాణా సాయుధ పోరాటకాలంలో ఎక్కడో అతనికి తూటా తగిలిందంటారు.... పోరాట విర

మణ తరువాత ఈ ఊరికి వచ్చి అప్పుడు ఊరిబయట - ఇప్పుడు ఉప్పరివాడ వెలిసిన చోట గుడిసెలో ఉన్నాడు.

"ఇన్ని సంవత్సరాలు ఓ బండతీర్గ ఎట్లు బతికిండబ్బా" బుచ్చిరెడ్డి కొత్తగా చూసినట్లుగా....

అదేదో కొమురయ్యకు తెలిసిపోయినట్టే ఉన్నది.

"మీ చిన్నోడు ఉత్తరం రాసిండటగదా !" మాటమారుస్తూ.

"ఆఁ. పదిహేనొద్దులాయేరాసి- అదురాసిన దేశం యాడుంటదో ఎరికలే- సేతుల పైసలు లేకపోయె. గీవయసుల అంతదూరం ఒక్కన్ని ఎట్ల బోవాలెనని తండ్లాడుతున్న."

"పోతులకు పోతులు ఇంక ముగ్గురు కొడుకులున్నరుగదా!"

"మావున్నరుగని-వాళ్ళకు గుండెసిన్నది. పిరికి పిత్తులోల్లు. మొన్న మానడిపోడచ్చి కష్టసుఖాలడుగన్నా నన్ను సదివియ్యలేదని ఎగిరిండు."

"సమువుకున్నోల్లకు నెనరుండదిలే-అందరి కష్టసుఖాలు ఇసారం జేసెటోన్ని బతుకనియ్యరు."

"మా తమ్ముడు మా సిన్నోన్ని పదిపన్నెండేడ్లు సాది సమువు సెప్పిచ్చిండా? పోలీసోల్ల బుద్దె గంతేనేమొ?"

"ఎంత ఆశతోని ఉత్తరం రాసిండో?" కొమురయ్య

"నిన్న షావుకారికిపది గిద్దెల అడ్లు ఒప్పవచ్చిన. వానికన్న ఎక్కువనా? బట్టలు దీసుకున్న-పదిహేనొద్దులు ఎవడు సప్పుడు చేయండి. కరినగురంనుంచి మా మరదలు ఓ జతబట్టలు, కర్జెలు, అయిదునూర్ల రూపాయలు పంపింది. మా సత్తయ్య తను వస్తనన్నడు. రేపు మాపటి బండికి పోతం."

బుచ్చిరెడ్డి చెప్పుకొచ్చాడు.

బుచ్చిరెడ్డికి ఈ రోజంతా చెప్పరాని సంతోషంగా ఉన్నది. దాదాపు తనకు కనిపించిన వానికల్లా గుసగుసగా తను పోయే సంగతి చెప్పుకొచ్చాడు. శంకరయ్య ఇంటికి రెండుమూర్లు పెళ్ళినా శంకరయ్య కన్పించలేదు. నిన్న పొద్దాల లేసి సడ్డకునింటికి పోతనని పోయిండట-

వాళ్ళిద్దరట్లా మాట్లాడుకుంటుండగానే పొద్దుగూకింది.

బుచ్చిరెడ్డి ఎడ్ల కొట్టుకుని బయలుదేరాడు. పశువుల మందలు ఊళ్ళకు మర్లుతున్నాయి. పనులమీద వెళ్ళినవాళ్ళు ఈడ్చుకపోయిన ముఖాలతో ఇండ్లకు మరలుతున్నారు.

చెట్లమీద పక్షులు కవ్వర కవ్వర అరుస్తున్నాయి.....

గుడిసెలమీద పొగలు సుళ్ళు తిరుగుతున్నాయి.

బుచ్చిరెడ్డి కనిపించిన వారినల్లా మందలించాడు-యోగ క్షేమాలడిగాడు. వాళ్ళ సెలుకల్లో ఏమేమి అలికారో అడిగి తెలుసుకున్నాడు.

శంకరయ్య ఇంటి ముందు నిలుచున్నాడు. శంకరయ్య భార్య కొమురమ్మ రోట్లో తొక్కు నూరుతోంది. ఆమె కూతురు ఏడిచే పిల్లవాన్ని రొండికేసుకొని ఆ బరువుకు బాణం బద్దలాగా వంగి పోయి నిలుచున్నది. పిల్లవాడు తల్లికేసి సాగులు సాగుతూ ఏడుస్తున్నాడు.

"కొమురు. ముందుగాల పిలగానికి పాలియ్యరాదే" అన్నాడు బుచ్చిరెడ్డి.

"మా యిచ్చిన బాపూ....బొల్లగండ్లకు ఆకలైతంది. పొద్దుందాకా పోయచ్చిన..."

"శంకరి రాలేదా?"

"అయినకేంది మారాజు ఎటుబోతడే—"

"వచ్చినంక జెరంత ఇంటిదాక రమ్మంటివ."

"మా చెప్పుత బాపూ."

బుచ్చిరెడ్డి బజాట్లోకి వచ్చాడు. అప్పటికే ఎడ్లు మూలమలుపుతిరిగాయి.

"అద్దులే—ఏడేడ తిరిగత్తడో-నేనే వత్త" బుచ్చిరెడ్డి కేకేసి చెప్పి బజాట్లో నడిచాడు.

ం ం ం

సుగుణమ్మ హాడావిడి పడిపోతోంది. రెండు చేతిసంచుల్లో ఒకదాంట్లోబట్టలు, ఒకదాంట్లో పిండి పంటలు సదిరారు.

"ఇగో వాడు అందరికీ పెత్తడు. ఓ మాట చెప్పు!" సుగుణమ్మ పళ్ళెంలో సకినాలు తీసుకొచ్చింది.

"నా కెందుకే-వాడికే పెట్టు-" బుచ్చిరెడ్డి.

"వద్దువద్దు-మా అమ్మ కొంచెపుడి అనుకుంటడు" మళ్ళీ తనే-

పళ్లెంలోని సకినం ఒకటి తీసుకొని కొరకలేక "నా పండ్లు ఇప్పుదే ఇరుగ్గొట్టేటట్టున్నవ్. అన్నం తీసుకరా?" మళ్ళీ ఒకమారు లేచి సంచులు సదిరి చూసి గుమ్మికి తగిలించాడు.

అన్నం తెచ్చేసరికి బుచ్చిరెడ్డి వాకిట్లోకి శంకరయ్య కోసం చూచి వచ్చిండు.

"ఇగో పాపం యేరాలు శాంత కంటికోధార నేలకోధార. మీ అన్నదమ్ములు ఎంతైన బంధలు. పెంచిన ప్రేమగదా!"

"అడికి నువ్వు ఏడ్వనట్టు."

"గిట్లనే చెప్పుతవా?"

"ఆఁ మీ అమ్మ ఏడ్చేడ్చి నేల బట్టిందంట."

"అను. వానికెర్కలేదా?"

కంచంలో కెలికాడుగాని తిండే సయించలేదు. సుగుణమ్మ వొత్తిడి చెయ్య లేదు. ఆమె గత పదిహేను రోజులుగా సరిగా తినడంలేదు.

బుచ్చిరెడ్డి చెయ్యి కడుక్కొని వాకిట్లోకొచ్చి నిలుచున్నాడు. గడపలో కొచ్చి సుగుణమ్మ "ఎవలకోసం చూస్తున్నవ్."

"ఎవలత్తరే మనింటికి - శంకరిని రమ్మన్న గొడ్డు గోదా జెర పెరడికెళ్ళి సూడుమన్న."

ఇంట్లోకి వచ్చి చెప్పులేసుకున్నాడు.

"మల్ల రేపు పయినం. రాత్రయ్యేదనుక ఉండకు" సుగుణమ్మ—

బుచ్చిరెడ్డి వీధి మలుపు తిరిగే సరికే శంకరయ్య ఎదురొచ్చిండు. వీధి లైటు కింద ఇద్దరు ఎదురుపడ్డారు.

"బాపూ మీ యింటికే వస్తున్న" శంకరయ్య.

శంకరయ్య ముఖం వాడిపోయి ఉన్నది.

"ఎప్పుడొస్తివి" బుచ్చిరెడ్డి.

"ఇగో గిదే రాకడ—ఇంటికి పోయేటాల్లకు నువ్వు రమ్మన్నవని చెప్పింది."

"పా — మీ ఇంటికే పోదాంపా." బుచ్చిరెడ్డి.

శంకరయ్య కొసేపు తటపటాయించిండు.

"నేను గిప్పుడేతిన్న. నువ్వు తినకుంట మాట్లాడేవు."

శంకరయ్య బుచ్చిరెడ్డి ననుసరించాడు.

అప్పటికి ఊళ్ళో చాలామంది పడుకున్నారు. పగలంతా అలసి పోయిన వాళ్ల తొందరగానే పడుకుంటారు.

ఇద్దరు మవునంగా నడుస్తున్నారు. చింత చెట్లల్లో గాలి నొక్కి పట్టిన ఏడుపు లాగా ఉన్నది. పయిడికంచె పలుకుతోంది.

వాళ్ళిద్దరు హరిజన వాడకు వెళ్ళే దారి దగ్గరికొచ్చారు.

"ఈ దారి మన నిరంజనన్న ఉండంగ తీసిందేగదా!" శంకరయ్య

"నాకు మతికి లేదనుకున్నవ - నాకు అన్ని మతికున్నయి. వాడు ఈ బండ గోడమీద నిలబడి మాట్లాడింది. నేను ఆనాడు ఏలాల్లి జర్గుతదోనని ఉరికచ్చిన. వాడు మాట్లాడిన ప్రతిమాట నాకు మతికున్నది. ఆయింక జరిగిన కొట్లాట."

శంకరయ్య ఆమసక వెలుతురులో తెల్లని గడ్డంలో గల బుచ్చిరెడ్డి ముఖం చూశాడు....

అక్కడి నుండి ఇద్దరు కలిసి అనుమాండ్ల గుడిదగ్గరికి వచ్చారు.

"బాపూ కొసేపు ఇక్కడ కూసుందామా" అన్నాడు శంకరయ్య.

"నీకాకలైత లేదా?" బుచ్చిరెడ్డి.

"ఎప్పుడు పుర్సతు లేదు. ఆరేండ్లాయె కడుపునింద మాట్లాడుకోక."

బుచ్చిరెడ్డికి "కడుపునింద" అన్నమాటనాభిలో తాకింది. అత్తిరి బిత్తిరి అయిపోతూ గద్దెమీద కూర్చున్నాడు. అతనికి కిందిమెట్టు మీద శంకరయ్య కూర్చున్నాడు.

ఊరులకు మగ్గిపోయింది....గుడి లోపల చీకటి చీకటిగా ఉన్నది.

బుచ్చిరెడ్డి తన ప్రయాణం సంగతి చెప్పుకొచ్చాడు.

శంకరయ్య మాటలు రానివానిలాగా తత్తర పడుతున్నాడు.

"నిరంజన్ మన ఊళ్ళెనుంచి ఎల్లిపోయిన్నాటినుంచే ప్రజల మనిషై పోయిండు. పెద్దపెల్లి సుట్టుపక్కల ఉన్నప్పుడు అనోట ఈనోట మనకు సంగతులు తెలిసేటియి." శంకరయ్య.

"వాడు ఈన్నుంచి పోకపోవు. రైలుస్టేషన్ల బాంబుదేలి చెయ్యికాలి పోయినప్పుడు మాఇంటికచ్చిండు. మాఇంటికాడ గదే తినుడు కొడుకు." బుచ్చిరెడ్డి.

"ఇగ అప్పటినుంచి మరాఠిదేశంలకు బోయిండు. మన భాషగాదు. వాళ్ళ మన మనుషులుగాదు. జంగల్‌పట్టోల్లు- వాళ్ళండ్ల రెండేండ్లు పనిజేసిండు. తుపాకి బట్టిండు. దళంల దిర్గిండు. కాలుకు ఆపరేషనైనంక మల్లో పని- గపనిల ఆయినె ఉన్న ఇల్లు పోలీసోల్లకు దెల్సిపోయింది. దాన్ని చుట్టుముట్టేటాల్లకు అందరిని సెఱపుకొని ఉరికి లావెక్కబోయిండు. కాలు మంచిగలేక దొరికి పోయిండు." శంకరయ్య వరుస క్రమంలో చెప్పుకొస్తున్నాడు. అక్కడినుండి కోరాపుట్ జిల్లా - అక్కడి పోరాటాలు.

బుచ్చిరెడ్డికి సగం తెలుసు. అయినా ఇవ్వన్ని ఇప్పుడు ఎందుకు చెప్పుతున్నట్లో అర్థంకాలేదు.

"శంకరీ తెల్లారి మాట్లాడుకుందాం. నువ్వెప్పుడనంగ తిన్నవో- కొమురమ్మ నీ కోసం ఎదురుసూత్తది."

"బాపూ నీకు నిరంజన్ అందరితీర్గ బతుకుతే బాగుండుననిలేదా?" శంకరయ్య కంఠంలో ఏదో గురగుర లాడుతోంది.

బుచ్చిరెడ్డికి నోటమాటరాలేదు. అయినా తమాయించుకొని "నేనుగీ ఊళ్ళె బుట్టి గీఊళ్ళనే బతుకు గడిపినోన్ని వాడో.... దేశదేశాలు దిరిగినోడు" బుచ్చిరెడ్డి.

"అయినా ఇంకా నీకొడుకే ననుకుంటన్నవ్‌గదా!" శంకరయ్య.

"ఢిల్లీకి రాజైన తండ్రికి కొడుకే గదా!"

"బాపూ మన నిరంజన్ గిప్పుడు కోట్లమందికి కొడుకైండు" శంకరయ్య గొంతు వనికింది.

"ఏందిరా శంకరీ!" బుచ్చిరెడ్డికి ఆ మాట అర్థంకాలేదు. కాని ఆ గొంతు అర్థమౌతోంది.

"బాపూ నాకు చెప్పత్తలేదు. నేను నిరంజన్ తండ్రినికాదు. కేసుకు తీసుకపోంగ నిరంజన్‌ను పోలీసులు కాల్చేసిండ్లట." శంకరయ్య బుచ్చిరెడ్డి వనికే చేతులు పట్టుకున్నాడు.

''అవద్దం. నువ్వు అవద్దం చెప్పుతన్నవ్- నా కొడుకు నా నిరంజన్ రాసిన ఉత్తరం....'' మాటకు మాట పొంతన లేకుండా బుచ్చిరెడ్డి వదురుతున్నాడు.

శంకరయ్య బుచ్చిరెడ్డిని పొదివి పట్టుకున్నాడు. పిచ్చిపిచ్చిగా మాట్లాడి ఒక్కసారే నోరు పడిపోయిన వానిలాగా అయిపోయాడు.

శంకరయ్య తనకానించుకొని ఇంటికి తీసుకొచ్చాడు.

సుగుణమ్మ తలుపుతీసి వాళ్ళిద్దరిని చూసి నోటమాట రాలేదు.

శంకరయ్య ఏమిచెప్పలేదు.

బుచ్చిరెడ్డిని మంచంలో పడుకోబెట్టి శంకరయ్య వెళ్ళిపోయాడు....

సుగుణమ్మ బుచ్చిరెడ్డి ఒళ్ళుతడిమి చూసింది. చల్లగా చల్లారిపోయి ఉన్నాడు. కళ్ళు చూస్తూనే ఉన్నాయి.... గంట తరువాత కళ్ళు తెరిచి

''సుగుణా నువ్వు తిన్నవా?'' అన్నాడు.

''ఏమయ్యింది.'' సుగుణమ్మ మీదపడి ఏడుస్తూ.

''ఏంకాలే- గేరచ్చింది. రేపొద్దుటివరకు బాగైతది. శంకరయ్యేడి'' అన్నాడు.

శంకరయ్య బయట పడుకున్నాడు.

''పడుకోనియ్యి - నువ్వు పడుకో.'' బుచ్చిరెడ్డినిండా శద్దరు కప్పుకొని పడుకున్నాడు.

సుగుణమ్మకు ఏమి అర్థంకాలేదు. బాగా అలసిపోయి ఉన్నది కనుక పడుకోగానే నిదురపోయింది.

బుచ్చిరెడ్డి - నిరంజన్ కన్నతండ్రి - తన ప్రాణానికి ప్రాణంగా ప్రేమించిన కన్నతండ్రి - చప్పుడుకాకుండా ఈ దేశంలోని కోటాను కోట్ల తండ్రుల్లాగే రోదించాడు.

* * *

ఈదుల వాగు ఈవలి పక్క పొలాలల్లో సందడిగా ఉన్నది. మడికట్టు దున్నుతూ రైతులు ఎడ్లను అదిలిస్తున్నారు. రంగు రంగుల చీరెలు కట్టి స్త్రీలు నాట్లే స్తున్నారు.

బుచ్చిరెడ్డి బాయికాడి పొలంలో దాదాపు ముప్పయిమంది స్త్రీలు నాటేస్తున్నారు. కొమురమ్మ అందరిని హుషారు చేస్తూ పరినారు పంచేస్తున్నది. సుగుణమ్మ బురదలో దిగి చాతకాక ఒడ్డు మీదికెక్కింది. కుమ్మరి పోశవ్వ తన తీగెలాంటి కంఠంతో ఏవో పాటెత్తుకున్నది.

శంకరయ్య జంబు కొడుతున్నాడు. మరో మూడు నాగండ్లు కైలిచేస్తు న్నాయి.

బుచ్చిరెడ్డి ఒడ్లవెంట అడికీడికి తిరుగుతున్నాడు. అతనికి ఏదన్న చెయ్యాలని ఆరాటంగా ఉన్నది. కాని శంకరయ్య అతన్ని పొలంలోకి దిగనియ్యలేదు.

పిల్లలు బావికాడి జామ చెట్టుకింద ఆడుకుంటున్నారు.

పెసరు చెలుకల్లో నుండి బక్కపలుచగా ఉన్న ఒక వ్యక్తి అస్తుబిస్తుగా నడుస్తూ వస్తున్నాడు. అతని ముఖం వాడిపోయి ఉన్నది. అతని కండ్లు బాగా ఏడ్చాడేమొ ఉబ్బి ఉన్నాయి.

అతన్ని ముందుగా చూసింది బుచ్చిరెడ్డే - అవచ్చేది బుచ్చిరెడ్డి మూడో కొడుకు సత్తిరెడ్డి.

బుచ్చిరెడ్డి బావిదగ్గరికి కొడుక్కు ఎదురొచ్చాడు.

"బాపూ" అంటూ సత్తిరెడ్డి తండ్రి మీదబడి ఏడ్వబోయాడు - అతన్ని వారించి కరంటు మోటర్ షెడ్డుపక్క నిమ్మ చెట్టు కిందికి తీసుకపోయాడు.

పిల్లలు ఆటలు ఆపేసి వాళ్లిద్దరి చుట్టు మూగారు.

సత్తిరెడ్డిని కూర్చుండబెట్టి పిల్లలను జామచెట్టు కిందికి తీసుక వచ్చాడు. మళ్ళీ కొడుకు దగ్గరికి వచ్చాడు.

"బాపూ తమ్మున్ని చెట్టుకు కట్టి కాల్చేసిండ్లట." సత్తిరెడ్డి కంఠం రుద్దమై పోయింది.

బుచ్చిరెడ్డి మాట్లాడకుండా కూర్చున్నాడు. తండ్రిముఖంలో ఏమార్పు లేక పోయేసరికి సత్తిరెడ్డి ఆశ్చర్యపోయాడు.

"బాపూ నీకు...."

"మా ఎరికేరా ? వాడు ఇంట్లనుంచి పోయినప్పుడే ఎరుక - మీచిన్న బాపు దగ్గరికి పోలీసచ్చి జేల్లనుంచి పారిపోయిండని చెప్పిండట- మీఅమ్మకు అదే చెప్పిండు. మీఅమ్మ ఎప్పటికైనా తిరిగి వత్తడనుకుంటంది - నువ్వు చెప్పకు." బుచ్చిరెడ్డి-

సత్తిరెడ్డికి మాటలు రాలేదు.....

"ఇంటికాడ పిలగండ్లు బాగున్నరా ?" బుచ్చిరెడ్డి మాటమారుస్తూ- సత్తిరెడ్డి మాట్లాడలేదు.

"మీతమ్ముడు నిరంజన్ ఏమి చెప్పిండో ఎరికేనా ? పుట్టుడు అందరొక్క తీర్గనే పుడ్తరట - బతుకుడు సానామంది తమకోసమే బతుకుతరట- నాకు చెప్పత్త లేదు. మీ అమ్మకు చెప్పకు. మీఅమ్మకు తన కొడుకు బతికి ఉన్నట్టుగనే ఎరిక- నాకు గంతే" బుచ్చిరెడ్డి లేచిపోయి పిల్లల దగ్గర కూర్చున్నాడు.

సత్తిరెడ్డి కళ్లు తుడుచుకున్నాడు. ఇంతలోనే సుగుణమ్మ వచ్చింది. సత్తిరెడ్డి యోగక్షేమాలడిగింది. పిల్లల గురించి అడిగింది.

"నిరంజన్ తప్పించుకున్నడట - మీసిన్నాయినె సెప్పిపంపిండు. ఆడుంటరా? నాకొడుకు ఎట్లనైన మందిల బడుతడు. వాడెక్కడున్నా పానాలతో నున్నడు అదే పదివేలు - ఎన్నటికైనా వాని తల్లి పేగు పొర్లకపోదు - వాడు నాదగ్గరికచ్చి సూసి పోతడు. మన పొలం ఊరోల్లు నాచేత్తంద్రు ఎరికేనా ? వాడు ఏన్నుంచో మళ్ళ ఊరోల్లను ఒక్కటి చేత్తండు" గుసగుసగా చెప్పింది ....

సత్తిరెడ్డికి తన తమ్ముడు నిరంజన్‌రెడ్డిని కాల్చేశారంటే నిజంగానే నమ్మబుద్ధి కావడంలేదు ....

నాట్లకాడ పాట సాగుతూనే ఉన్నది ....

* * *

(కోరాపుట్ జైలునుండి విశాఖపట్నం కేసుకోసం తీసుక వస్తూ మార్గ మధ్యంలో అడవిలో చెట్లకు కట్టి పోలీసులు కాల్చేసిన అమరులు సుచంద్ర రమణా రెడ్డి స్మృతిలో.)

ప్రజాసంగీతం - పట్టించుకోవలసిన సంగతులు

గద్దర్

మనిషి ఎంతో కష్టపడి అభివృద్ధి చేసుకున్న సంగీత సాధనాలను నేను అవమానిస్తానని ఒక విమర్శ ఉంది. ఏకతార మీద వీణ అభివృద్ధికదా, వీణ ఎందుకు వాడరు అని ఒక ప్రశ్న ఉంది. వీణను నేను మెచ్చుకోననే అనుమానం కూడ ఉన్నట్టుంది. ఈ నేపథ్యంలో సంగీతం గురించి, సంగీత సాధనాలను గురించి నా అభిప్రాయాలు వివరిస్తాను.

మానవులందరు సమష్టిగా శ్రమించి సంపాదించిన సంపద అంతా, అభివృద్ధి అంతా అందరికీ కాక కొందరికే చెందుతోంది. ఆ సంపదను, ఆ అభివృద్ధిని, ఆ జ్ఞానాన్ని నేను కించ పరచడం లేదు. కాని ఆ అభివృద్ధిని ఎవరు సాధించారో వాళ్ళకు దక్కకుండా దోచుకుంటున్న వాళ్ళను మాత్రం ప్రశ్నిస్తాను. ఆ అభివృద్ధి అంతా దానికికారకులైన ప్రజలకు ఎంత మాత్రం తోడ్పడడంలేదు సరిగదా, వాళ్ళను నాశనం చేస్తోంది.అటువంటప్పుడు ఆ అభివృద్ధిని నేను గట్టిగానే వ్యతిరేకిస్తాను.

టైప్‌రైటర్ నుంచి కంప్యూటర్ అభివృద్దే. కాదనను. కాని ఇవాళ కంప్యూటర్‌ను అభివృద్ధి పరచిన వేలాది మంది శ్రమజీవులకు తోడ్పడకుండా, వాళ్ళను నిరుద్యోగులుగా మార్చివేసి కొందరికి కోట్లు కూడబెట్టే ప్రమాదం ఉంది. అందుకే దాన్ని వ్యతిరేకిస్తున్నాను. దాన్ని అసలే ఉపయోగించగూడదా అంటే, ఉపయోగించవచ్చును. ఏదైనా మనిషికి అసాధ్యమైనవిషయం ఉంటే, ఉదాహరణకు మనిషికి అంతుచిక్కని రోగాలను నిర్ధారణ చేసేందుకు ఉపయోగించవచ్చు. కాని గుమస్తా పనుల కోసం కంప్యూటర్ ఎందుకు ? దానిలో పెట్టుబడిదారుల ఉద్దేశ్యం ఏమిటి ? ఈ పద్ధతిని నేను వ్యతిరేకిస్తాను. అందుకే ఇవాళ్టి పరిస్థితుల్లో మన దేశంలో కంప్యూటరైజేషన్‌ను నేను వ్యతిరేకిస్తున్నాను. అత్యధిక సంఖ్యాక ప్రజలకు ప్రయోజన కరం కానిది ఏదయినా, ఎంత అభివృద్ధి అని పేరు పెట్టుకున్నా అయా పరిస్థితుల్లో వ్యతిరేకించవలసిందే. అంటే అభివృద్ధి అనే దాని మీద మనకు సరైన అవగాహన ఉండాలి.

ఏక్‌తార నుంచి వీణ, గిటార్ అభివృద్దే. కాని ఇవాళ్టి మన సమాజంలో వీణ, గిటార్ ఎంతమంది ప్రేక్షకులకు అందుబాటులో ఉన్నాయి ? అతి తక్కువ

మందికి. అందుకే ఏకతార మీద వీణ అభివృద్ధే అయినప్పటికీ, ఆ అభివృద్ధికి కారకులైన శ్రమ జీవులకు ఏ విధంగాను ఉపయోగ పడడం లేదు. అందుకే నేనుదాన్ని ప్రజల వాయిద్యంగా గుర్తించడం లేదు. అయితే నేను వీణనేమీ అవమానించడం లేదు. ఆ వీణ వాయించే చెల్లిని ప్రేమతోనే ఓ ప్రశ్న అడుగుతున్నాను.

ఓ చెల్లీ
నవరసాలు పలికించే
నీ వీణ తీగలు ఎవరో తెలుసా ?
గనిలో నుంచి ముడి ఇనుమును తవ్వి
బట్టీలా కాగి కాగి మాగి మాగి
సన్నని తీగలుగా మారిన
శ్రమ జీవుల నరాలు
వాళ్ళకోసం ఎన్నడైనా నీ వీణను మోగించావా ?

ఓ అన్నా
నీ తబలా మీద
తాదిన్ దిన్ తరికిటదోం
త్రితాల్ - ఏక్‌తాల్
శబ్దాల తరంగాలు ఎక్కడివో తెలుసా ?
మనుషులుగా గుర్తించబడని మనుషులు
తమ ఎండిన డొక్కలోని పల్చని పొరను చీల్చి
నీ డోలుకు తోలుగా మార్చారు
వాళ్ళ గుండె చప్పుళ్ళను ఎప్పుడన్నా మోగించావా ?

ఓ నాట్యమాడే చెల్లీ
నీ పాదాలకు అంటుకున్న
మువ్వలు - సిరిమువ్వలు
నీ చిందులకు అందాన్నందించే మువ్వలు
నువు నాట్య తరంగానిపై
గాలిలో ఎగిరి గంతులేసి నప్పుడు

తెగిపోయి
నీ కాళ్ళకింద నలిగిపోయిన మువ్వలు
ఎవరో తెలుసా ?

రాగై, ఇత్తడై, సొంపై
కాల్చుకున్న చేతుల నుంచి
చిందుతున్న నెత్తురు చుక్కలు
వాళ్ళ కోసం
ఒక్క క్షణం
నీ కాలి మువ్వను కదిలించి, అదలించావా ?

ఓ చెల్లీ,
ఓ అన్నా
ఓ నా ప్రియమైన కళాకారుడా
నీ అద్భుతమైన కళా సంపదను
కలిగిన వాడు కొనేశాడు
నీకు తెలియకుండానే
నువు అమ్ముడు పోయావు
అందుకే ఆ కళా బానిస సంకెళ్ళు తెంచుకో
నిన్ను గుండెకద్దుకునే
జనం కళలలోకి రా ....

ఈ మాటలు నేను వేదికలమీది నుంచి కళాకారులను సంబోధిస్తూ పదే పదే చెప్పాను. ఇందులో అవమానించడం ఏమీ లేదు. నేను వీణను గాని, వీణ వాయించే చెల్లిని గాని అవమానించడంలేదు. అది నా ఉద్దేశ్యం కాదు. ఆ సంగీత సాధనాలు అందరికీ అందుబాటులో లేవనేదే నా బాధ.

ఈ పరిస్థితిలో ప్రజా కళాకారులు ప్రజల వాయిద్యాల మీదనే ఎక్కువ ఆధార పడాలి. వాటిని గౌరవించి, ప్రేమించాలి. వాటితో పాటు కొత్త సాధనాలను కూడ

అవసరాన్ని బట్టి వాడుకోవాలి గాని విషయాన్ని సంగీతం డామినేట్ చెయ్యగూడదు. అట్లాగే కొత్త సాధనాలే మన ప్రధాన వాయిద్యాలు కాగూడదు. ఎందుకంటే ప్రజలు ఇప్పుడే ఈ కొత్త వాయిద్యాలను అందుకునే స్థితిలో ఉండరు.

అయితే అభివృద్ధి పొందిన సంగీత వాయిద్యాలను వాడుకోవాలా లేదా, వాడు కుంటే ఎంతవరకు వాడుకోవచ్చు అని ప్రజా కళాకారుల్లో ఈ మధ్య చర్చలు జరుగుతున్నాయి. వివిధ సాంస్కృతిక బృందాలకు ఈ విషయంలో విభిన్నమైన అభిప్రాయాలు ఉన్నాయి. అసలు కొత్త వాయిద్యాల జోలికే పోగూడదని కొన్ని మిత్ర కళా సంస్థలు మొండిగా, గుడ్డిగా వాదిస్తున్నారు.

పాట అంటే విషయం, రాగ తాళ సమ్మేళనం కదా. ఈభావ రాగ తాళాలకు విడదీయరాని, అవినాభావ సంబంధం ఉంది. ఒకదాన్ని మరోదాని నుంచి విడదీసి చూడలేం. ఈ మూడింటి సమ్మేళనం సరియైన రూపంలో కలవనప్పుడు అది సంపూర్ణమైన కళారూపంగా రూపుదాల్చదు. అటువంటి కళ కళాహీనంగా తయారు కావడానికి ఎన్నో అవకాశాలున్నాయి. ఈ మూడింటిలో ఒక్కొక్క దానికీ ఎంత ప్రాధాన్యత ఉన్నదో అర్థం చేసుకున్న తర్వాత మన చర్చలోకి, తాళం గురించి, వాయిద్యం గురించి చర్చలోకి వెళదాం. ఈ విషయం కూడ మళ్ళీ ప్రజల వాయిద్యాల నుంచే మొదలు పెట్టవచ్చు.

మనం ఏ వాయిద్యం గురించయినా చర్చించే ముందు మన గురువులైన ప్రజల వాయిద్యాల గురించి తెలుసుకోవడం ప్రథమ కర్తవ్యం. ఎందుకంటే ఎటు తిరిగీ మనం ఆ ప్రజల దగ్గరికే పోవాలి కాబట్టి, ఆ ప్రజలే మనను సరిచేయాలి కాబట్టి. ప్రజల్లో, అందులో అట్టడుగు ప్రజల్లో కనిపించే వాయిద్యం డప్పు. డప్పు అన్ని సాంస్కృతిక కార్యక్రమాల్లోను వాడే ఒకే ఒక్క సాధనం.

తాళం లేకుండా పాటగాని, ఆటగాని లేదు. ఉండదు కూడ. ప్రజలు చేసే పనిలో నుంచి వచ్చే లయాత్మక శబ్దమే ప్రజల పాటకు తాళం వేస్తుంది. మొద్దు (కలప)ను కోసేటప్పుడు పాడే పాటకు, రంపం నుంచి జనించే రపరపలే తాళం వేస్తాయి. చీకట్లో మోటతోలే రైతుకు, మోట గిరక గిరగిర ధ్వని, గల గల ఒలక బోస్తున్న నీళ్ళ చప్పుడు అతని పాటకు తాళం వేస్తాయి. గూడలు వేసే వాళ్ళకు గూడ బొక్కెన నీటిలో మునిగినప్పుడు బుడుక్, బుడుక్‌న వచ్చే శబ్దమే వాళ్ళ పాటకు తాళంగా మారుతుంది. మైళ్ళ దూరం బండ్లను తోలుకు పోయే బండివానికి ఎడ్ల

మెడలోని మువ్వల చప్పుడు, టిక్, టిక్ మనే గిట్టల చప్పుడు, కిర్రు కిర్రు మనే చక్రాల చప్పుడు తాళం వేస్తాయి. ఈ రకంగా పనిలో పాటను, తాళాన్ని పరిశీలిస్తే, వాళ్ళ పనిలోని ధ్వనులే, వాళ్ళ పాటలకు తాళం వేస్తాయన్న సత్యం రుజువవుతుంది.

ఇక పనితో కాకుండా విరామ సమయాల్లో పాడుకునే పాటలకు, కళా రూపాలకు కొన్ని తాళాలు అనివార్యంగా అవసరమైనాయి. ఉయ్యాల పాటకు చప్పట్లు, కోలాటంకు కోలలు, కాళ్ళకు గజ్జెలు, జముకుల కథకు జమిడిక, భాగోతానికి మద్దెల, తాళాలు, హార్మోనియం, గజ్జెలు, బుర్రకథకు బుర్రలు, తాంబుర్ర, ఒగ్గు కథకు డిల్లెం డిల్లెం, తాళాలు, గజ్జెలు, బాల సంతోళ్ళకు శంఖం, గంట, ఫకీరుకు కంజెర, తీగలతో చుట్టిన గజ్జెలు, కొండమామకు ఏక్ తార, ఎరుకల సానికి ఏక్ తార.... ఈ విధంగా మనం ప్రజల కళారూపం దేన్ని తీసుకొని చూసినా తప్పకుండా సంగీత వాయిద్యాలు కనబడతాయి. చివరికి, ఇళ్ళముందు బిచ్చం అడుక్కుంటూ తిరిగే డక్కలి పాటకు తన ఛాతి మీద గుద్దుకుంటూ లయాత్మక సంగీతం సృష్టిస్తూ బిచ్చం ఎత్తు కుంటుంటాడు. అందుకే విరామ కాలంలో ప్రజలు ప్రదర్శించే ఏ కళారూపం తీసుకున్నా సంగీత వాయిద్యం లేకుండా ఉండనే ఉండదు.

పైన చెప్పిన ప్రజల కళలను పరిశీలిస్తే పనికాలంలో కళలకు, విరామకాలంలో కళలకు తేడా ఉందని తెలుస్తోంది. ఈ రెండింటిలో మనం ఏ కాలంలో ప్రజల దగ్గరికి వెళుతున్నాం? విరామకాలంలోనే గదా. కాబట్టి మనం కూడ తప్పకుండా, అనివార్యంగా వాయిద్యాలపట్ల శ్రద్ధ వహించాలి. తప్పనిసరిగా మన సాంస్కృతిక రంగం చక్కని వాయిద్యాలతో, వాయిద్యకారులతో నిండి ఉండాలి. కాని కొందరు మిత్రులు అనవసరమైన చర్చ లేవదీస్తున్నారు. 'మనకు ఏ వాయిద్యాలు, గీయిద్యాలు అక్కరలేదు' అని కొందరు, 'ఒక్క డప్పు ఉంటే చాల'ని కొందరు 'వాయిద్యాలు కష్టం. మాకురావు. మేం నేర్చుకోం' అని కొందరు. ఎవరికి తోచినట్లు వాళ్ళు వాదించడం మొదలుపెట్టారు.

ఈ ఆలోచనలన్నీ ప్రజలను సరిగా అధ్యయనం చేయకపోవడంవల్ల వచ్చినవే. వాయిద్యాలు అసలే అక్కర్లేదనుకోవడం ఎంతమాత్రం సరైనదికాదు. మన కళ విప్లవకళ. ధనస్వాములకు, భూస్వాములకు అది వ్యతిరేకమైనది. అంటే వాళ్ళ కళలతో మనకళలు పోటీపడాలి. వాళ్ళకళలను ఓడించగలిగే ప్రజాకళలను మనం

సృష్టించుకోవాలి. మన కళద్వారా విప్లవాశయాల్ని ప్రచారం చేసి ప్రజలను విప్లవానికి సన్నద్ధులను చేయాలి. మనలో ఒక్కొక్కరమూ ఒక సాంస్కృతిక సైనికులం. ఆ బాధ్యతలు మనమీద ఉన్నాయని మరచిపోవడంవల్లనే ఇలాంటి ఆలోచనలు వస్తున్నాయి. కాబట్టి మన కళారూపాలు ప్రజల కళారూపాలకు అతిదగ్గరగా ఉంటూ, మార్పులతో కూడుకుని నూతనంగా ఉండాలి. అందుకే జనం కోరుకున్న రీతిలో ఉండాలి. జనం కోరుకున్నట్లే, వాళ్ళు వాళ్ళ కళారూపాల్లో వివిధ వాయిద్యాలను వాడుకున్నట్లే మనంకూడా అన్నిరకాల వాయిద్యాలను ఉపయోగించుకోవాలి. ఈ విషయంలో సరైన శ్రద్ధ చూపకపోవడంవల్లనే మన సాంస్కృతిక బృందాలకు నైపుణ్యంతో, సమర్థంగా డప్పుగాని, డోలక్‌గాని వాయించే సభ్యులు ఉండడంలేదు. దీన్నిబట్టే మనం వాయిద్యాల విషయంలో ఎంత వెనుకబడి ఉన్నామో తెలుస్తుంది.

అయితే వాయిద్యాలను వాడుకోవాలి అన్నప్పుడే ఎంతవరకు వాడుకోవచ్చుననే ప్రశ్నవస్తుంది. ఎలాంటి వాయిద్యాలు వాడుకోవాలనే ప్రశ్నవస్తుంది. 'కళలా సారస్వతం ఎవరికోసం ?' అనే ఉపన్యాసంలో మావో మన ప్రేక్షకులు ఎవరనే విషయం సరిగా తెల్సుకోవాలని పదేపదే నొక్కి చెప్పారనేది ఎల్లప్పుడూ గమనంలో ఉంచుకుంటే ఈ ప్రశ్నలకు జవాబులు చెప్పుకోవచ్చు.

మన ప్రేక్షకులెవరు ? గ్రామాల్లో రైతులు, కూలీలు, పట్టణాల్లో పెటీబూర్జువా వర్గానికి చెందినవారు, కార్మికులు. కనుక ఈ ప్రేక్షకులనుబట్టే మన వాయిద్యాలపట్ల శ్రద్ధ వహించాలి. గ్రామాల్లో మన సాంస్కృతిక సంస్థలు తప్పకుండా డప్పుమీదనే ఆధారపడాలి. ఎందుకంటే 1) డప్పును చాల సులభంగా నేర్చుకోవచ్చు. 2) డప్పు నేర్పేవాళ్ళు ప్రతిగ్రామంలోనూ ఉంటారు. 3) మన పాటలన్నీ ప్రజల బాణీల పాటలే కాబట్టి, తప్పకుండా డప్పు మీదపడే అన్ని, దాదాపు అన్ని దరువులు మన పాటలకు సరిపోతాయి. 4) డప్పు గురించి కొంచెం నైపుణ్యంతో కూడిన పరిజ్ఞానం ఉంటే దాని మీదనే శాస్త్రీయ దరువులుకూడ వాయించవచ్చును. 5) డప్పు శత్రువుకు అనుమానం రాకుండా ఉంటుంది. 6) డప్పు చంకకు వేసుకోవడంతోనే కళాకారులు ప్రజలలో మమేకం కాగలుగుతారు. ప్రజలు ఆ కళాకారుణ్ణి తమలో ఒకరుగా చూసుకోగలుగుతారు.

ఈ కారణాలవల్ల మనం గ్రామాలలోని మన సాంస్కృతిక బృందాల వాయిద్యం డప్పు అని తేల్చుకున్నాం. గ్రామాల్లోనే కాదు, మొత్తంగా జననాట్యమండలి వాయిద్యమేదంటే డప్పు అనేంతగా మనం దాన్ని వాడుకున్నాం. అయితే గ్రామా

లలో ఈ డప్పు తప్ప వేరే వాయిద్యాలు వాడగూడదా? ఎందుకు వాడగూడదు? ప్రజలు తమ కళా ప్రదర్శనల్లో ఒకే వాయిద్యం వాడుతున్నారా? అదేమీ లేదే! వాళ్ళు తమకు అందుబాటులో ఉన్న రకరకాల వాయిద్యాలను చక్కని సమ్మేళనంతో వాడుతున్నారు. మనంగూడ డప్పు, గజ్జెలు, డోలక్, పిల్లనగ్రోవి, కొమ్ము మొదలైన ప్రజా సంగీత వాయిద్యాలను సమర్థంగా జతపరచి కార్యక్రమాలు ఇవ్వాలి. ఈ జత పరచడం ఎట్లా చేయాలో మనం ప్రజలనుంచే నేర్చుకోవచ్చు. పండగలలో, ప్రజలు ప్రదర్శించే కాళమ్మ పూజ, వీధిభాగోతం, ఒగ్గుకథ లాంటి రూపాలను పరిశీలిస్తే ఇది చక్కగా బోధ పడుతుంది. అందుకే మనం ప్రజల వాయిద్యాలను ఓర్పుతో నేర్చుకోవడమో, లేదా వాళ్ళలోనుంచి వచ్చే యువకళాకారులకు రాజకీయ చైతన్యం కలిగించి ప్రజా కళాకారులుగా తీర్చిదిద్దడమో లేదా ప్రజలనుంచి వచ్చిన కళాకారునికి సంగీత సమ్మేళనపు బాధ్యత ఇచ్చి మన వాయిద్యాలను ఆ సంగీతంతో జతపరచ డమో చేయాలి.

మరి మాండొలిన్, బుల్ బుల్, సితార, వీణ, గిటార్ లాంటి కొత్తవాయిద్యాలు గ్రామాల్లో వాడాలా వద్దా? తప్పకుండా వాడవచ్చు. ప్రజలకు తెలియని, వినని వాయి ద్యాలను వాడితే వాళ్ళు మొదట వింతగా చూస్తారు. దానిలోని రాగాలను, తమ వాయి ద్యాలలోని రాగాలతో పోల్చుకుని చూస్తారు. ఆ వాయిద్యాలలో తమ జీవితం గురిం చిన పాటల్ని విని ఆనందపడతారు. "మీరు ఈ వాయిద్యం ఎందుకు వాయిస్తు న్నారు" అని వాళ్ళెన్నడూ మనతో పోట్లాటకు రారు. అట్లా ఎప్పుడూ పోట్లాటకు రాలేదు. కాని వాళ్ళకు అర్థం కాని విషయం చెప్పినప్పుడు మాత్రం నిరసనగా కార్యక్రమం నుంచి లేచిపోతారు.

ఐతే ఈ వాయిద్యాలు మనం వాయించగలమా, ఆర్థికంగా మన సంస్థకు అంత స్తోమత ఉందా, అవి వాడడం సాంకేతికంగా సరైనదేనా లాంటి ప్రశ్నలు మనం వేసుకోవాల్సి ఉంది. అందుకే ఏ వాయిద్యం వాడాలన్నా ఆ గ్రామంలోని పోరాట స్థాయిని గమనంలో ఉంచుకోవాలి. శత్రు నిర్బంధం తీవ్రస్థాయిలో ఉండేచోట మన వాయిద్యాలు ఎంత తక్కువగా ఉంటే అంత మంచిది. కొత్త వాయిద్యాలను అసలే వాడవద్దు. శబ్దం దూరంగా పోని వాయిద్యాలను వాడుకుంటే మంచిది. అటువంటి జాగ్రత్తలు తీసుకోకపోతే చాల నష్టాలు జరిగే అవకాశాలున్నాయి. అందుకే మన కళాకారులు గ్రామాల్లోని ప్రజల వాయిద్యాలను వాడడమే ప్రస్తుత పరిస్థితుల్లో సరైనది.

ఇక పట్టణాల్లోని ప్రేక్షకుల విషయానికి వస్తే, మన వాయిద్యాలపట్ల, సాంకేతిక విషయాలపట్ల ప్రత్యేకమైన శ్రద్ధ వహించాలి. పట్టణాల్లో జీవించే చాలమంది కార్మికులకు అటు గ్రామీణ జీవితంతో సంబంధం ఉన్నప్పటికీ, పెటీ బూర్జువా మనస్తత్వంతో జీవిస్తున్నారు. చిల్లరమల్లర సినిమాలు ప్రభావంకూడ వీళ్ళమీద ఉన్నది. వీళ్ళకు గ్రామీణ జీవితాల గురించి, గ్రామాల్లో జరుగుతున్న పోరాటాల గురించి సరైన అవగాహన లేదు. ఇక పెటీబూర్జువా మేధావులకు విప్లవంపై ప్రేమ ఉన్నా ఆచరణతో సంబంధంలేని కారణంచేత విపరీతమైన అనుమానాలు ఉంటాయి. ఇక మధ్యతరగతివాళ్ళు అటు ఉట్టికి, ఇటు స్వర్గానికి కాక, అందీ అందని జీవితం కోసం పాకులాడుతుంటారు. ఇలాంటి వాళ్ళను మనం మన కళలద్వారా కదిలించి ఆలోచింపజేయవలసి ఉన్నది. గ్రామ సీమల్లో జరుగుతున్న దీర్ఘకాలిక సాయుధ పోరాటాన్ని వివరించి, దానిలో భాగస్తులు కాకుండా తమ సమస్యలు పరిష్కారం కావని చెప్పాలి. ఆర్థిక పోరాటాలకే పరిమితంచేసిన రివిజనిస్టులను ఎండగట్టి విప్లవానికి నాయకత్వం వహించవలసిన బాధ్యత కార్మికవర్గానికి ఎట్లా ఉన్నదో మన కళల ద్వారా వివరించాలి. ఈ కర్తవ్యాలన్నీ చాలకష్టతరమైనవి. అందుకే మనం మనరాజకీయాలను ఎంతో కళాత్మకంగా వాళ్ళ గుండెలకు హత్తుకునేలాగ సమర్పించాలి. అందుకే మనం వాయిద్యాలపట్లకూడ శ్రద్ధవహించాలి. సరికొత్తగా వచ్చిన వాయిద్యాలు వాయించే వాళ్ళందరూ మధ్యతరగతి, కార్మికుల బిడ్డలే అన్న విషయం మరచి పోరాదు. "అన్నా, నీ కళ ఎవరికోసం" అని వాళ్ళను ప్రశ్నించి, మనవైపు తిప్పుకొని, ఆ వాయిద్యాన్ని విప్లవీకరించాలి, ఈ విషయంలో జననాట్యమండలి కొంత వరకు విజయం సాధించిందనే చెప్పుకోవచ్చు.

ఈ మధ్యకాలంలో రగల్‌జెండా బ్యాలేలో సంగీత వాయిద్యాలను శక్తివంతంగా వాడుకున్నాం. మాండొలిన్ వాయించే ఒక మిత్రుడు బ్యాలేకు సంగీత సహాయం అందించాడు. బ్యాలేలో మాండొలిన్ ఎంతో ముఖ్యమైనపాత్ర వహించింది. బుల్ బుల్ సితార, పిల్లనగ్రోవి, హార్మోనియంలను కూడ బ్యాలేలో వాడుకున్నాం. బ్యాలేకు వాయించిన క్లారినెట్ ఎన్నో వేలమందిని ఉద్రూత లూగించింది. రాష్ట్రం మొత్తంగా జరిగిన సాంస్కృతిక ప్రదర్శనల్లో ఈ క్లారినెట్ చాల ప్రధానమైన పాత్ర వహించింది. ఈ అనుభవం వల్ల మనకు ఏ వాయిద్యం, ఎక్కడ, ఎందుకు వాడుకోవాలనే అవగాహన వచ్చింది. మన ఉద్యమం విస్తరిస్తున్నా కొద్దీ నిర్మాణంలోకి వివిధ వాయిద్యాలు వాయించే కళాకారులు వచ్చి చేరే వాళ్ళు. వాళ్ళను, వాళ్ళ వాయి

ద్యాలను అవమాన పరిచే కంటె వాటిని విప్లవీకరించి విప్లవ కళకు అనుగుణంగా తీర్చిదిద్దు కోవాలి. ఐతే మనం ఎప్పుడూ మన ఉద్దేశ్యాలను వాళ్ళమీద బలవంతంగా రుద్దగూడదు. మనకు పిల్లనగోవి ఇష్టం గనుక మాండొలిన్ కళాకారుణ్ణి పిల్లనగోవి నేర్చుకొమ్మని బలవంత పెట్టగూడదు.

జన నాట్యమండలి వాడిన సంగీత వాయిద్యాలలో ఈ వైఖరే కొనసాగింది. డోలకిస్టులు వచ్చి చేరినప్పుడు డోలక్ ప్రధాన వాయిద్యమైంది. డప్పులు వాయించే మిత్రులు వచ్చినప్పుడు డప్పుల ప్రాముఖ్యం పెరిగింది. బుల్ బుల్ సితార కళాకారుడు వచ్చినప్పుడు పరిచయానికి, బ్యాలేకు బుల్ బుల్ సితార వాడుకున్నాం. మాండొలిన్, క్లారినెట్, వేణువు, వీణ, హార్మోనీ, కంజిర, బుర్రలు, డిల్లెం డిల్లెం, కొమ్ము, చిటికెలు, తబ్లా-ఇట్లా అన్ని వాయిద్యాలనూ మనం వాడుకున్నాం. అన్నిటి విషయంలోనూ మనం తీసుకున్న వైఖరి అదే. ఈ మిత్రులందరూ ఆ యా వాయిద్యాలలో అంతకు ముందు ఎంతో కొంత అనుభవం, అభిరుచి ఉన్నవాళ్ళే. వాళ్ళ వాయిద్యాలను బయటికి తీసి మనం విప్లవీకరించాం. ఇవాళ సాంస్కృతిక సంస్థల ముందున్న కర్తవ్యం ఇదే. అయితే ఒక ముఖ్యమైన విషయం గుర్తుంచుకోవాలి. ఏ సంగీత వాయిద్యమైనా సరే ఆ కళారూపంలోని విషయాన్ని ఎటువంటి పరిస్థితిలోనూ డామినేట్ చెయ్యకుండా జాగ్రత్త తీసుకోవాలి.

మనం ఒక విషయాన్ని, ఒక భావాన్ని మరింత బలంగా చెప్పడానికీ, జనం గుండెల్లో చొప్పించడానికీ ఒక సంగీత వాయిద్యాన్ని వాడుకుంటున్నాం. కాబట్టి ఆ వాయిద్యం ఎలాంటి పరిస్థితిలోనూ ఆ భావాన్ని మించిపోయేదిగా ఉండగూడదు. మనం చెప్పిన భావం కన్న ఆ సంగీతాన్నే జనం ఎక్కువగా మెచ్చుకున్నట్టయితే, ఆ వాయిద్యాన్ని వాడుకోవడంలో, విప్లవీకరించడంలో మనం పూర్తిగా విఫలమయినట్టే. ఇదే ఈ రోజుల్లోని ఆధునిక సంగీతానికి, మనకుఉన్న ముఖ్యమైన తేడా, ఈ రోజుల్లో చాలమంది 'ఆపాట సంగీతం బాగుంది' అనిఅంటున్నారు. బూర్జువా వర్గాలకు కావలసింది కూడ అదే. కాని మనకు కావలసింది ఆ పాట. ఆ పాటలో అర్థం బాగుందని జనం అనాలి.జనం అలా అనేలా మనం పాడాలి. అందుకే ఏ వాయిద్యాన్నయినా ఈ జాగ్రత్త తీసుకుని వాడుకోవాలి.

వాయిద్యాలను ఎట్లా, ఎప్పుడు, ఏ జాగ్రత్తలు తీసుకొని వాడుకోవాలో చర్చించిన తర్వాత మరొక ముఖ్యమైన సమస్య వాయిద్యాలు ఎక్కడ ఉండాలనేది. వాయి

వ్యాలు తెరముందు ఉండాలా ? తెర వెనుక ఉండాలా ? వాయిద్యాల కళాకారులు గుర్తింపు పొందేదెట్లా ?

గుర్తింపు కోసమే సంగీత వాయిద్యాన్ని వాయించే కళాకారుడు మరే కళాకారుడన్నా కావచ్చు గాని విప్లవ కళాకారుడు మాత్రం కాడు. కళాకారుడు గుర్తింపు పొందడమంటే సంస్థ గుర్తింపు పొందడమేననేది మనకు వర్తించే సూత్రం. వేదిక మీద దుమికి, ఎగిరి, పాడే కళాకారుని లాగ వాయిద్య కళాకారుడికి పేరు రాక పోవచ్చు. అది అతని చేతిలో లేదు. ప్రదర్శిస్తున్న రూపమే వారివారి పాత్రలను అలా నిర్ణయించి ఉంచుతుంది. విప్లవ కళాసంస్థ ఆశయం విప్లవం తేవడమే. అంతే. మనకళాకారులు గుర్తుంచుకో వలసినది ఆ విషయమే.

వాయిద్య కారులు తెర వెనుకనే ఉండాలని గాని, తెరముందే ఉండాలని గాని ఎప్పుడూ వర్తించే నియమం తయారు చేయలేం. తెర వెనుక ఉండాలా, తెరముందుండాలాఅని నిర్ణయించేది ప్రదర్శిస్తున్న కళారూపమే. ఆ రూపం ఆ యా వాయిద్య కారులను ఎక్కడ ఉంచి జీర్ణం చేసుకోగలదో అక్కడనే ఉంచగలుగుతుంది.

ఈ విషయం మనకు స్పష్టంగా అర్థం కావాలంటే మనం మళ్ళీ జనంలో ఉన్న కళారూపాలను, వాయిద్య కారులను అధ్యయనం చేయవలసిందే. ప్రజల కళారూపాలన్నిటిలోను కళాకారులు, వాయిద్య కారులు ఒకరికోసం మరొకరు అన్నట్లే ఉంటారు. ఒకరికోసం అందరు, అందరి కోసం ఒక్కరు అనే సూత్రం మీదే వాళ్ళ ప్రదర్శన ఆధారపడి ఉంటుంది. వాళ్ళ రూపాలలో ప్రధానంగా రెండు విషయాలు కనబడతాయి.

మొదటిది, ప్రజా కళారూపాల ప్రదర్శనల్లో గాయకుడే, అంటే ఎవరు ప్రధాన పాత్ర నిర్వహిస్తున్నారో వాళ్ళే దర్శకుడుగానూ, సంగీత దర్శకుడు గానూ వ్యవహరిస్తారు. కనుక సంగీత వాయిద్యాలపై గాయకుని అజమాయిషీ ఉండాలంటే వాయిద్య కళాకారుడు గాయకుడి పక్కనే ఉండవలసి వస్తుంది.

రెండోది, ప్రజాకళా రూపాలలోని కవిత్వం ఆశు కవిత్వం కాబట్టి గాయకుడు ఏ రాగం ఎత్తుకుంటాడో, ఎక్కడ ఆపివేస్తాడో, ఎందుకు ఎగిరి దుముకుతాడో - ఇవన్నీ వాయిద్య కళాకారుడు చెప్పవాల్సికుండా పరిశీలిస్తూ ఉండవలసి ఉంటుంది. అప్పుడే వాళ్ళిద్దరి కలయికలో ఐక్యత ఏర్పడి భావానికి న్యాయం చేకూరుతుంది.

ఈ రెండు అంశాలనూ ఖవాలి, ఒగ్గుకథ, భజన వంటి ప్రజా కళారూపాల నుంచి నిర్ధారించి చూడండి.

ఖవాలిలో గాయకుడు, హార్మోనియం, డోలక్, చప్పట్లుకొట్టే కోరస్, అప్పటి కప్పుడు పాట రాసి ఇచ్చే (కట్టి ఇచ్చే) కవి, లేదా గాయకుడే ఆశు కవిత్వం అల్లు కోవడం ఉంటుంది. వీళ్ళందరూ ఒకరికి ఒకరు అన్నట్టుగా కలిసిపోయి సమష్టిగా ప్రదర్శన ఇస్తారు. ఇక్కడ కళాకారులందరు వేదిక పైనే ఉంటారు. ఈ రూపం ఈ రకంగా వేరు వేరు కళాకారులను ఇముడ్చుకుని అద్భుతమైన కళారూపంగా రూపొం దుతుంది.

ఒగ్గు కథలో గాయకుడు, వాయిద్యకారులు ఉంటారు. వీళ్ళు కూడా ఒకరిని ఒకరు అంటుకునే ఉంటారు. వీళ్ళకు సిద్ధంగా స్క్రిప్టు ఏమీ ఉండదు. కథ ఎన్ని మలుపులు తిరిగి, ఎన్ని రాగాలాపనలతో, ఎలా పరిణమిస్తుందో ఎవరూ జోస్యం చెప్పలేరు. ఒక స్థూల ప్రణాళిక మాత్రం బుర్రలో ఉంటుంది. ఆ ప్రణాళిక కూడ ఆయా పరిస్థితులను బట్టి మారిపోతూ ఉంటుంది. ఉదాహరణకు ఎల్లమ్మ కథ చెప్పా లంటే రెండుగంటలలోనూ చెప్పగలుగుతారు. రెండు నెలల్లోకూడ చెప్పగలుగుతారు. అంటే ఆ కథ ప్రయాణం ఎన్నెన్ని మలుపులు తిరుగుతుందో ఎవరూ ఊహించలేరు. దానిలో ఎన్నో సంవత్సరాల అనుభవం ఉన్నవాళ్ళు కూడ కచ్చితంగా ఊహించ లేరు. కళాకారులు ముందు ఆచరణలోకి దిగి వాళ్ళకున్న శక్తిసామర్థ్యాలను ఆయా పరిస్థితులకు అన్వయిస్తూ కథను నడిపి గమ్యం చేరుస్తారు.

ఈ క్రమంలోనే వాళ్ళరూపం, ఆ ప్రత్యేక కళారూపంగా రూపాంతరం చెందింది. ఆ కళారూపం అభివృద్ధి క్రమంలోనే వాయిద్యం కూడ మారుతూ కథతో సరిగ్గా జతకూడేలా తయారయింది. ఒగ్గు కథను నిశితంగా పరిశీలిస్తే ఈ కింది విష యాలు కనబడతాయి.

i) కథకుడు పాటపాడే ప్రతి సారీ కొంచెం ముందుకు వచ్చి పాడతాడు.

ii) వాయిద్యకారులు గాయకుణ్ణి అంటుకుని కొంచెం దూరంలో ఉంటూ ఎప్పుడూ అంతే దూరాన్ని పాటిస్తూ ఉంటారు.

iii) ఎవరు ప్రధాన గాయకుడిగా ఉంటే వాళ్ళే సంగీతాన్ని (ధ్వనిని) అదుపు చేస్తుంటారు.

iv) కథకుడు దుఃఖభరిత సన్నివేశాన్ని వివరిస్తున్నప్పుడు సంగీతం (ధ్వని) దానంతటదే తగ్గిపోతుంది.

v) కథకుడు వీరరసంలోకి వెళుతున్నప్పుడు వాయిద్యాలు హోరుమోగి పోతాయి.

vi) తాళం ఎక్కువయిందనుకుంటే కథకుడు ఆటలో భాగంగానే అన్నట్టు చేతి సైగ తోనో, కనుసైగతోనో తాళాన్ని సవరిస్తాడు.

vii) తాళం, పాట సరిగ్గా సరిపోయినప్పుడు, పాటలో భాగంగా అన్నట్టు 'వారెవ్వా' అని ప్రోత్సహిస్తాడు.

viii) తాళంలోగాని, తన పాటలోగాని తప్పు జరిగితే, ఆఁ అంటూ పెద్ద అరుపుతో మొత్తం కథనే ఆపి, తాను అనుకొన్న ప్రకారం మళ్ళీ మొదలెడతాడు.

ix) కథలో మార్పులు, చేర్పులు, రిహార్సల్, రచన అన్నీ వేదికమీదనే ఏక కాలంలో జరుగుతూ ఉంటాయి. ఇదే జానపద కళారూపాలలోని అత్యంత సృజనాత్మకమైన శక్తి. మన కళాకారులు ఈ శక్తిని పట్టుకోవలసి ఉంది.

x) కథలో శంకరుని పాత్ర రాగానే కథకుడు ఆటోమేటిక్‌గా చేతిలోకి ఢమరుకం తీసుకుంటాడు. కథలో మాయల ఫకీరు పాత్ర రాగానే కథకుని చేతిలోకి మాయబెత్తం వస్తుంది. కథలో గారడీవాని పాత్రరాగానే కథకుని చేతిలో పిల్లన గోవి, నాగస్వరం వస్తాయి. ఇవన్నీ ఎట్లా జరిగాయో మనం అర్థం చేసుకో వాలి.

అదే విధంగా బుర్రకథ చూడండి. కథకుడు స్వయంగా తంబుర వాయిస్తూ శ్రుతిని అందిస్తాడు. ఇద్దరు వంతలు బుర్రలతో తోడుగా ఉంటారు. ఒకరితో ఇద్దరు ఇద్దరితో ఒక్కరు అన్నట్టుగా కథ నడుపుతారు. ఎవరి వాయిద్యాలు వారి చంకలోనే ఉంటాయి. ఈ రూపం వాయిద్యాలను తనలో ఇట్లా ఇముడ్చుకున్నది. ఇట్లా ఇముడ్చు కోవడంవల్లే ఈ రూపంలో రాగ, తాళ, గానాలు సమపాళ్ళలో కలిసి సరైన ఫలితాలు వచ్చాయి.

ఇక భూస్వామ్య భక్తిలోని భజనలు తీసుకోండి. ఇందులో పాడే భక్తులు, వాయిద్యాలు వాయించే భక్తులు కలిపే పాడుతారు, కలిసే ఆడుతారు, కలిసే మొక్కు తారు. అందరు కలిసి భజనచేస్తే అందరికీ పుణ్యం. భజన అప్పుడప్పుడు మెల్లగా సాగుతుంది, అప్పుడప్పుడు వేగంగా సాగుతుంది. చివరికి 'జై బోలో భగవాన్ శంకర్‌కీ జై' అంటూ ముగిస్తారు. వీళ్ళు అచ్చంగా ప్రజల ఫక్కీనే అనుకరిస్తారు. అందుకనే భజన భక్తి యుగంలో ఒక గొప్ప ప్రచార కళాసాధనంగా రూపుదాల్చి ఇప్పటికీ ఇంకా బతికే ఉన్నది.

ఇక పెట్టుబడిదారీ కళారూపాలు చూస్తే, అక్కడ అన్నీ పెట్టుబడిదారుని ఇష్టమే. సంగీతం, సాహిత్యం, వాయిద్యం మూడూ పెట్టుబడిదారు ఆస్తులై పోతాయి. ఇక్కడ సూత్రం ఏమిటంటే 'ఒకని కోసమే అందరు'. అందుకే దేనికి దానినే విడదీసి, అభివృద్ధి చేసి, తమ వ్యాపారాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రదర్శిస్తారు. పెట్టుబడిదారు ప్రధానమైన ఉద్దేశ్యం ప్రజలకు విజ్ఞానాన్నో, వినోదాన్నో అందించడం కాదు, తాను లాభాలు సంపాదించడమే. కళాకారులను ఎవరిని ఎక్కడ ఉంచాలో తానే నిర్ణయిస్తాడు. ఒకవేళ ఏదైనా వాయిద్యాన్ని వాయిస్తున్నప్పుడు చూపించాల్సి వచ్చినా డమ్మీ వ్యక్తే కనబడతాడు గాని నిజమైన వాయిద్యకారుడు కనబడడు. కవికి, గాయకునికి, సంగీతకారునికి ఒక పరిధిగీసి, ఆ పరిధిలో మాత్రమే తిరిగే స్వేచ్ఛ ఇస్తాడు పెట్టుబడిదారు. ఇక్కడ అందరూ కూలివాళ్ళే. అందుకే కళాకారులకు న్యాయం జరగదు. వాయిద్యకారులు పూర్తిగా తెరవెనుకకే నెట్టివేయబడ్డారు.

పైన చెప్పిన కళారూపాలన్నీ మనముందు ఇప్పుడు కనబడుతున్న సత్యాలు. జననాట్యమండలి అనుభవంలో వాయిద్యకారుల విషయంకూడ పరిశీలిద్దాం.

జననాట్యమండలి కళాప్రదర్శనలకు నిజంగా చెప్పాలంటే తెర అనేదే లేదు. ఎప్పుడైనా అవసరంకొద్దీ వెనుక పక్కన ఒకతెరలాంటిది కడితే మన సభ్యులు, జనం కలిసి దాన్ని ఎత్తిపారవేసేవాళ్ళు. "పర్దా గిర్దా ఎందుకయ్యా! చెప్పేదేదో చెవులబడితే చాలు, ముందుండి ఏం జూడాలె, దుంకులాట జూడాల్నా?" అని జనం అనేవాళ్ళు.

జననాట్యమండలి కళారూపాలేవైనా, పాటగాని, నృత్యంగాని, ఒగ్గుకథ గాని, వీధిభాగోతం గాని, బ్యాలేగాని, బీదలపాట్లు నాటికగాని ఏదైనా తీసుకుని చూడండి. జననాట్యమండలి జనం అడుగుల్లో అడుగులు వేయడానికి ప్రయత్నించింది. మన కళాకారులు, వాయిద్యకారులు ఒకొరికొకరు ప్రాణంగా ప్రదర్శనలు ఇచ్చేవాళ్ళం. హాలు కార్యక్రమాల్లో, మధ్యతరగతికోసమే ప్రధానంగా ఇచ్చిన ప్రదర్శనల్లో, బాలేల్లోకూడ గాయకులు, వాయిద్యకారులు వేదికమీదే ఒకపక్కన, ప్రదర్శనలో పాల్గొనే కళాకారులు కనబడేలా కూచునే వాళ్ళం. ఒకవేళ ప్రేక్షకులు మావైపే చూస్తూ ఉన్నా మేం మాత్రం ఎటువంటి ఆందోళన పడకుండా కూచుని ఉండేవాళ్ళం. ఎందుకంటే కథ ప్రారంభం కాగానే ప్రేక్షకుల దృష్టి మామీద ఉండదని మా నమ్మకం. అది ఆచరణలో రుజువైందికూడ.

జననాట్యమండలి పాటలు

[జననాట్యమండలి పాటల్నీ, గద్దర్ పాటల్నీ తొలి రోజుల్నించీ ప్రచారం చేస్తూ వస్తున్న పత్రికల్లో సృజన ఒకటి. 1973లో సృజన సంచికల్లో వి. వి. గద్దర్ పాటల్ని విస్తృతంగా ప్రచురించడం మాత్రమే కాక 1973 అక్టోబర్‌లో 'వి. వి. గద్దర్ పాటలు' పుస్తకాన్ని కూడ సృజన ప్రచురణగానే తెచ్చాం. 1975 జనవరిలో ఈ పుస్తకం పునర్ముద్రణ కూడ పొందింది. ఇదే క్రమంలో 'రైతుకూలీ విజయం బుర్రకథ'ను, 'చెల్లీ చంద్రమ్మ ఒగ్గుకథ'ను, 'భూమిభాగోతం'ను, 'ఆదిలాబాద్, కరీంనగర్ పోరాట పాటలు-రెండు భాగాలు', 'ప్రజాకళలు, సాహిత్యం ఎలా ఉండాలి? (వర్గీస్ వ్యాసాలు)ని', 'సాంస్కృతికోద్యమ నిర్మాణ సమస్యలు' (గద్దర్)ను సృజన ప్రచురణలుగా తెచ్చి జననాట్యమండలి ప్రచారకృషిలో సృజన పాలుపంచుకుంది. జననాట్యమండలి 18వ వార్షికోత్సవాల సందర్భంగా సృజన జనాపం చరిత్రలోంచి కొన్ని పాటల్ని ఎంపికచేసి ప్రచురిస్తున్నది. జనాపం సృష్టించిన వందలాది అద్భుతమైన పాటల్లోంచి కొన్నిటిని ఎంపిక చేయడం కష్టమనే విషయాన్ని పాఠకులు అర్థం చేసుకోగలరు. — సాహితీమిత్రులు]

ఏదైనా ఒక కళాప్రదర్శన జరిగేటప్పుడు కొన్ని సమస్యలు ఎదురవుతాయి. వాటిని సరిచేసుకొని మళ్ళీ ప్రదర్శనకు వెళ్ళేసరికి మళ్ళీ సరికొత్త సమస్యలు వస్తాయి. అవి వాయిద్యానికి సంబంధించినవి కావచ్చు, ప్రదర్శనకు సంబంధించినవి కావచ్చు. సమస్యలు, పరిష్కారాలు అనేదొక ప్రాసెస్ (క్రమం).

కాబట్టి ఈ ప్రాసెస్‌లో భాగంగానే వాయిద్యకారులు వేదికమీద ఉండాలా, లేదా అనే సమస్యను పరిష్కరించాలి. ఈ పరిష్కారాన్ని ఆ కళారూపాన్ని, వేదికను, పనినిబట్టి నిర్ణయించుకోవాలి. కాని ఎప్పుడూ ఒకేలాగ ఉండాలి అనిగాని, ఉండొద్దు అనిగాని చెప్పలేం.

మొత్తంమీద ప్రజలలాగ అందరూ కలిసి ఇచ్చిన ప్రదర్శనలోనే కళారూపం అందరి మెప్పును పొందుతుందనేది జననాట్యమండలి అనుభవం.

[ప్రజాకళారూపాలపై గద్దర్ రాసిన పుస్తకంలోంచి ఒక అధ్యాయం ఇది. ఈ పుస్తకం ప్రచురణకు సిద్ధమవుతోంది.]

రిక్షాదొక్కే రహీమన్నా

రిక్షాదొక్కే రహీమన్నా రాళ్ళుగొట్టే రామన్న
డ్రైవరు మల్లన్నా హమాలీ కొమ్రన్న
దుక్కి దున్నే దుర్గన్నా మోటగొట్టే మైసన్నా
మన్నించి మామాట వినవో రైతన్నా ॥రిక్షా॥

నీకున్న ఆస్తంత రెండురెక్కలేనన్న
రెక్కలాడక పోతే డొక్క నిండదోరన్న
పొద్దంత పనిచేకుంటె పొయిరాజదోరన్న
జరమొచ్చి మూలకుబడితె కుక్క బతుకు నీదన్న ॥రిక్షా॥

ఏండ్లు గడిచినగాని ఎట్టిదప్పలేదన్న
మంత్రులు మారినగాని నీరాత మారలేదన్న
ప్రణాళిక లేసినా నీ గుడిసె మారలేదన్న
నడ్డిరగ పనిజేసిన వడ్డి తీరలేదన్న
అప్పులోడింటికొచ్చి ఆలి అక్క అంటడన్న
విషం దాగి సచ్చేటి రోజు నీకొచ్చెనన్న ॥రిక్షా॥

మార్వాడోని దగ్గర నీఇల్లు రైనన్న
రేపోమాపోవచ్చి హర్రాజు బెత్తడన్న
బోకెల్ బొంతల్ దీసి బైటపారేస్తడన్న
ఇగ నీవు బొందలగడ్డకే పోయిబతుకాలన్న ॥రిక్షా॥

జాగీరు పీర్లకు నువు నాణి జేస్తివోరన్న
కట్ట కింద పోచమ్మకు మేకపొటేల్ గోస్తివన్న
ముత్యాలమ్మకు నువు ముక్కుపోగు లేస్తివన్న
ఏలారు నాంచారం ఎన్నోసార్లు బోతివన్న
అప్పు పెరిగిందెగాని ఆపద తీరాలేదు
గత్తరొచ్చి నీ కొడుకె సచ్చి పోయెనేమన్న ॥రిక్షా॥

నీ కష్టాల కన్నీటికి కారణం ఎవడన్న
దేవుడా దయ్యమా లేకుంటె ఖర్మనా
పాపమా పుణ్యమా లేకుంటే పూర్వజన్మా
మాయదారి మాటలింటె బాధలేవి దప్పయన్నా ॥రిక్షా॥

ఊర పందిల బలిసిన ఊరి పెద్దలోరన్న
పచ్చి రక్తమూ తాగే దొరలు భూస్వాములన్న
ఫ్యాక్టరీ యజమానులు దళారి గాళ్ళరన్న
వీళ్ళ భరతం పట్ట నడుం గట్టి నడువన్న ॥రిక్షా॥

సిరిమల్లె చెట్టుకింద

సిరిమల్లె సెట్టుకింద అచ్చుమమ్మో అచ్చుమమ్మో
సినబోయి కూర్చున్న వెందుకమ్మో ఎందుకమ్మా ॥సిరి॥

మోకాళ్ళ మట్టూకు బురదలో దిగబడి
ఎద్దోలె ఎనుకకు ఒక్కొక్క అడుగేసి
అయ్యో ! నాట్లేసి నాట్లేసి అచ్చుమమ్మో అచ్చుమమ్మా
నీ నడుమూలే యిరిగేన అచ్చుమమ్మో అచ్చుమమ్మా ॥సిరి॥

కాల్లు గడుపులు మొక్కి దొరకు గొయ్యాటోలె
వారి మోపు ఎత్తుకోని బిరాబిరా నడువంగ
అయ్యో! కాల్జారి పడ్డావ అచ్చుమమ్మో అచ్చుమమ్మా
నీ కాల్జేయి యిరిగింద అచ్చుమమ్మో అచ్చుమమ్మా ॥సిరి॥
నెత్తంత మాసింది రయికంత సినిగింది
కొత్తాది కొననీకి పైసాలు లేవాయె
అయ్యో! కుంచి పేల్కలుగట్టి అచ్చుమమ్మో అచ్చుమమ్మా
నువు కూలీకి బోయినావ అచ్చుమమ్మో అచ్చుమమ్మా ॥సిరి॥

పాసిపోయిన బువ్వ మాడిపోయిన గట్క
చలిగంజి పోసుకొని సప్పాదే మింగుతె
అయ్యో! కక్కుదేర్గుడు బెట్టి అచ్చుమమ్మో అచ్చుమమ్మా
నీ దొక్కంత గుంజింద అచ్చుమమ్మో అచ్చుమమ్మా ॥సిరి॥

గాడ్పొచ్చి గుడిసంత గాలికెగిరీ పాయె
చలికాల మొచ్చింది సాపసింపులు లేవు
బొంత గుడదామన్న పాత పేల్కలు లేవు
అయ్యో! చలికి వొణుకుడు బట్టి లచ్చుమమ్మో లచ్చుమమ్మా
నీ సంటోడు సచ్చిండా లచ్చుమమ్మో లచ్చుమమ్మా ॥సిరి॥

ఆకలికి పోరగాండ్లు అల్లాడి పోవంగ
అన్నారెడ్డికి నువ్వు జొన్నా కొయ్యబోతే
అయ్యో! జొన్నా కొయ్యదిగి లచ్చుమమ్మో లచ్చుమమ్మా
నీకాలంత వాసింద లచ్చుమమ్మో లచ్చుమమ్మా ॥సిరి॥

ఏనె గుండ్ల కింద సపుకారి గుడ్డంల
ఎరువు జల్లబోతే ఎర్ర తేలు గరిసి
అయ్యో! పోట్లు మంటాలెత్తి లచ్చుమమ్మో లచ్చుమమ్మా
నువు పొలమంత బొర్లితివ లచ్చుమమ్మో లచ్చుమమ్మా ॥సిరి॥

దసర పండుగ వొచ్చె దమ్మిడీ లేదాయె
దీపావళీ వొచ్చె దీపమే లేదాయె
శివరాత్రి వొచ్చింది ఉపాస ముండాలె
నీ బతుకంత శివరాత్రి లచ్చుమమ్మో లచ్చుమమ్మా
నీ బతుకంతా అమవాస లచ్చుమమ్మో లచ్చుమమ్మా ॥సిరి॥

ఏ కర్మమనుకోని ఎడుపాయ లెల్లంగ
గాచారమనుకోని నాచార మెల్లంగ
అయ్యో! తొవ్వలో దొంగలు లచ్చుమమ్మో లచ్చుమమ్మా
నీ బువ్వ గుంజుకొనిర లచ్చుమమ్మో లచ్చుమమ్మా ॥సిరి॥

పక్కింటి పోచమ్మ ఎనుకింటి ఎల్లమ్మ
ముందింటి ముత్తమ్మ ఇరుగింటి ఈరమ్మ
కూలోల్ల కందరికి కూడు దొరకాలని
కొమరెల్లి కొండల్ల లచ్చుమమ్మో లచ్చుమమ్మా
వాల్లు కొలిమి రాజేసిర్రు లచ్చుమమ్మో లచ్చుమమ్మా ॥సిరి॥

ఎన్నాళ్ళు ఏడ్చేవు ఎంతాని ఏడ్చేవు
ఏడ్చినా తూడ్చినా ఏమి సాధించేవు
నీ తోటి చెల్లెండ్లు నీ సాటి తమ్ముల్లు
ఎర్రదండులో జేరి ఎత్తింద్రు కొడవండ్లు
కొడవండ్లు సూరుకొసి లచ్చుమమ్మో లచ్చుమమ్మా
నువు కూలిదండులో కలువు లచ్చుమమ్మో లచ్చుమమ్మ ॥సిరి॥

కొండలు పగలేసినం

కొండలు పగలేసినం బండలను పిండినం
మా నెత్తురు కంకరగా ప్రాజెక్టులు గట్టినం
శ్రమ ఎవడిదిరో సిరి ఎవడిదిరో
బంజర్లను నరికినం పొలాలను దున్నినం
మా చెమటలు ఏరులుగా పంటలు పండించినం
గింజెవడిదిరో గంజెవడిదిరో
మగ్గాలను పెట్టినం పోగు పోగు వడికినం
మా నరాలె దారాలుగ గుడ్డలెన్నో నేసినాం
ఉడుకెవడిదిరో వణు కెవడిదిరో
యంత్రాలను తిప్పినం ఉత్పత్తులు పెంచినం
మా శక్తే విద్యుత్తుగ ఫ్యాక్టరీలు నడిపినం
మేడెవడిదిరో గుడిసెవడిదిరో
కారణాలు తెలిసినం ఆయుధాలు పట్టినం
మా యుద్ధం ఆపకుండ విప్లవాలు నడిపెదం
చావు మీదిరో గెలుపు మాదిరో

ఊరుమనదిరా

ఊరు మనదిరా! ఈ వాడ మనదిరా!
పల్లె మనదిరా! ప్రతి పనికి మనంరా!
సుత్తె మనది! కత్తి మనది
పలుగు మనది! పారమనది
బండి మనదిరా! బండెడ్లు మనయిరా
దొర ఎందుకురో? దొరతన మెందుకురో నడుమ
దొర ఎందుకురో? దొర తన మెందుకురో ॥ఊరు॥

అరకబట్టేది మనం - ఆ సెలకదున్నేది మనం
ఈ కంచెకాడ మనం - ఆ మంచెకాడ మనం
ఈ పాడికాడ మనం - ఆ పసులకాడ మనం
దొడ్డికాడ మనమే - గడ్డాముకాడ మనమే
దోపిడేందిరో - దొర పోకడేందిరో - నడుమ
దోపిడేందిరో - దొర పోకడేందిరో ॥ఊరు॥

మట్టికాడ మనం - ఆ ఎట్టికాడ మనం
ఈ నాటుకాడ మనం - ఆ మోటకాడ మనం
కోతకాడ మనమే - వరిమోతకాడ మనమె
దొర ఎందుకురో - దొర జులుమెందుకురో - నడుమ
దొర ఎందుకురో - దొర జులుమెందుకురో ॥ఊరు॥

బందుకు పట్టేది మనం - బరువులు మోసేది మనం
సాకిరేవుకాడ మనం - సారెలు దింపేది మనం
సావుకాడ మనమె - సొన్నాయికాడ మనమె
దొర ఎందుకురో - దొరపెత్తనమెందుకురో - నడుమ
దొర ఎందుకురో - దొరపెత్తనమెందుకురో ॥ఊరు॥

గట్టుమీద దొరోడు - సెట్టులెక్క నిలుసుండి
ఆలిసుండి తల్లిదాకా - వాయివరస లేకుండా
తిట్టుడేందిరా - దొర కొట్టుడేందిరా నడుమ
దోపిడేందిరో - దొరపోకడేందిరో ॥ఊరు॥

కూలినాలి పేదోళ్ళము - కలిసి మెలిసి యుండాలె
సంఘ పోళ్ళ జండకింద - సంఘమొకటి బెట్టాలె
మనలదోచె ఈ దొరల - మక్కెలిరగదన్నాలె ॥ఊరు॥

యాలరో ఈ మాదిగ బతుకు

యాలరో ఈ మాదిగ బతుకు
మొత్తుకుంటె దొరకదురా మెతుకు
నీకు మొత్తుకుంటె దొరకదురా మెతుకు ॥యాల॥

మాలన్న మాదిగన్న నీరుడన్న వేగరన్న
మేదరన్న మ్యాతరన్న లంబడన్న చెంచన్న
కులం కులం కులమంటు కుమిలిపోయె మాలన్న
గొంతు విప్పి పాడుతున్న.... మనసు విప్పి వినరన్నా ....
॥యాల॥

బొందలు తొవ్వేటి బ్యాగరక్కు మనదీ
సచ్చిన పసులు మోసె మాదిగక్కు మనదీ
నీల్లను కాపాడే నీరుడక్కు మనదీ
రోతను సాపుచేసే మ్యాతరక్కు మనదీ
బాంచ బతుకె మన బతుకని మన బతుకుల మన్నుబోసి
బలిసిన దోపిడి దొంగలు.... బాగ బలిసి పోతుండ్రు.... ॥యాల॥

బంగారు పంటలిచ్చె భరత గడ్డ మనది
గంగమ్మ ప్రవహించే పుణ్యభూమి మనది
గంగ యమున బ్రహ్మపుత్ర కృష్ణ పెన్న కావేరి
ఎన్నెన్నో జీవనదులు ప్రవహించే జీవగడ్డ
మాల మాదిగన్నలకే.... మంచినీల్లు కరువాయె.... ॥యాల॥

శాస్త్రిగారి ఆవులకు గర్క దెచ్చి గడ్డిదెచ్చి
పిండిపెట్టి కుడితిబోసి బుదగరిచ్చి పాలుపిండి
పాలు మీగడలు శాస్త్రిలు పసందుగా మింగుతుంటె
చల్లబొట్టు శాస్త్రిలంటె అంటైతది అడగకనే ॥యాల॥

ప్రాణాలు బోవంగ పునాదులు దొవ్వి
రక్తాలు కారంగా రాళ్ళ గోడబెట్టి
కంటికి ఇంపైనా కర్నపోని బంగ్లా గట్టి
ఇంటి లగ్నమైతుంటె ఇనామిస్తడని పోతే
కులం తక్కువ ముండాకొడక.... గడపదాటి రాకుమనే.... ॥యాల॥

మతం మార్చుకుంటెనేమో మనసు చల్లబడ్తదాని
కష్టాలు బోతయని క్రైస్తవ మతములో చేరితె
కమ్మక్రైస్తు, రెడ్డిక్రైస్తు, మాలక్రైస్తు, మాదిగ క్రైస్తు
అంటరాని పశాచము···· ఎంటబడుతున్నాది— ॥యాల॥

మాల మాదిగల నడుమ మంచి నీళ్ళ బాయిగొట్టి
మాలోళ్ళ గిరక దిక్కు గజంలోతు ఎక్కువ దొవ్వి
మాలోల్ల గిర్క దిక్కు మాదిగోల్లు రావొద్దని
మనలో మన మిద్దరమె తన్నుకొని చస్తుంటే
తాకులాటబెట్టి దొరలు తమాష చూస్తున్నరు— ॥యాల॥

సర్పంచు గ్రామపంచు సంతకాలు తీసుకొని
కర్నము కనకయ్యకు కోడిపుంజు కాలబెట్టి
గిర్దావరు గానికి గురుదక్షిణ చెల్లించి
తాసిల్దారు సంతకముకు తలపానము తోకకొచ్చె
ఎర్రగబుర్రగ ఉన్నావు మాదిగంటె నమ్మనంటు
సర్టిఫికెటు లేకుంటే సీటురాదు సారంటే
నొసటిమీద మాదిగోల్ల— ముద్రేసుకోమన్నడు— ॥యాల॥

దొరవారి కొడుకులను అరె అన్నందుకు
తెల్లని మల్లె మొగ్గ చీర కట్టినందుకు
కోటేశును కాల్చిండ్రు కొండమ్మను చెరిచిండ్రు
తప్పుడు కొడుకులను తన్న— ఉప్పెన వలె ఉరికి రార— ॥యాల॥

పెర్చిలో భూస్వాముల కథ తెలుసా నీకు
దున్నేవానిదే భూమి అన్నందుకు
భూస్వాముల కాల్లకాడ పడియుండా నందుకు
భూస్వాములు ఏకమయ్యి మీసాలు దువ్వుకుంటు
పట్టపగలే నీ వాల్లను కాళ్ళు చేతులా గట్టి
మంటలల్ల కిసిరేసి మజా చేసుకున్న రంట— ॥యాల॥

టర్కుమన్ గేటుకాడి తతంగము తెలుసా
గేటుచుట్టు గరీబోల్ల గుడిసెలున్నాయన్నా
నాపచింపులు లేని చీపురోల్ల వాడలు
కూడుగుడ్డాలేని కార్మికుల పాకలు
ఇది చూసి సంజయ్‌కి ఇషిఇషి మనిపించిందట

ఢిల్లీలాంటి నగరంలో అల్లి బిల్లి గుడిసెలేల
బుల్డోజర్ దీసుకొచ్చి భూమట్టం జేసింద్రు
గుడిసెలు పీకేయొద్దని తిరగబడ్డ వాళ్లను
పిట్టలను కాల్చినట్లు పట్టపగలే కాల్చి కాల్చి
టాంకు కింద పడదోసి— తారురోడ్డు లేసింద్రట ॥యాల॥

ఇందిరా కాంగిరేసు హితం జేస్తదంటా
జనతా నాయకులు జయం చేస్తరంటా
నిన్న మొన్న నేడు రేపు నీ రక్తం దాగినోళ్ళు
కపల పిల్ల లీల్లంత— కలల గూడ మరసిపోకు— ॥యాల॥

భూమంతా భూస్వాముల వలల ఉందిరన్నా
వాళ్ళను కూల్చేదాక కులం పోదురన్నా
గనిలో బొగ్గు దవ్వే గని మనిషివి నీవు
నమ్మేట పట్టినోడ నమ్మె చేయరార
కమ్మని బతుకు కొరకు కత్తి నూరుకోర
నీ చెమటినకని చేనుందా నువు చెయ్యని చీజుందా
శ్రమజీవుల విముక్తికై పిడికిలెత్తి బాస చెయ్ ॥శ్రమ॥

ఏదిగొనేటట్లులేదు

ఏది గొనేటట్లులేదు ఏది దినేటట్లు లేదు
నాగులో నాగన్నా
దరలిట్లా పెరగవట్టె నాగులో నాగన్నా
అమ్మదిగి అయ్యెక్కె అయ్యదిగి అమ్మెక్కె
నాగులో నాగన్నా
దరలమీర దరలెక్కె నాగులో నాగన్నా ॥ఏది॥

కరమొచ్చి నోరంతా పెండ పెండ అయిపోతే
తొక్కు నూరుకుందామని చింతపండు కొనబోతె
చింతపిక్క ధరజూడు నాగులో నాగన్నా
సూరెక్కి ఎక్కిరిచ్చె నాగులో నాగన్నా ॥ఏది॥

పచ్చిబాలెంత కింత పప్పుగాసి పోద్దామని
చెయిసంచి దీసుకొని పేరు పప్పు గొనబోతే
నాగులో నాగన్నా
సెటాకంత రాకపోయే నాగులో నాగన్నా ॥ఏది॥

పండుగ దినము గోలె పాశ మొండుకుందామని
సుక్కలు తెగిపడ్డట్లు చెక్కరనే గొనబోతె
చెక్కర ధర యినగానే నాగులో నాగన్నా
చెక్కెరొచ్చి నట్టాయె నాగులో నాగన్నా ॥ఏది॥

దసరగోలె సంటోల్లక్కు సైనుబట్ట దేనబోతె
బారెడంత పన్నబోయి మూరెడంత పన్నాయె
సైనుబట్ట ధరజూస్తే నాగులో నాగన్నా
నన్ను రైను బెట్న రాకపాయె— నాగులో నాగన్నా ॥ఏది॥

గ్యాసునూనె కోసమేమొ కోసంత లైను గడితె
డబ్బలు సప్పుడుజేసి దర్వాజా మూసుకునే
ఖాళీ డబ్బాతోని గడపల్ల అడుగు బెడితె
నీ గుడ్డిదీప మారిపోయె నాగులో నాగన్నా
నీ గుడిసంతా సీకటాయె నాగులో నాగన్నా ॥ఏది॥

ఈ కట కట రాజ్యంలో పెట పెట పేగులు మాడె
కట కట రాజ్యాన్ని గూల్చ నాగులో నాగన్నా
పట పట పండ్లు గొరుకు నాగులో నాగన్నా ॥ఏది॥

దొంగలు దొంగలు గలిసి ఊర్లు పంచుకున్నట్లు
దొరలు దొరలు గలిసి రాజ్యమేలుతున్నరంట
ఈ దొంగల గద్దె దింప నాగులో నాగన్నా
యుద్ధము చేద్దామురార నాగులో నాగన్నా ॥ఏది॥

ప్రయాణం

శ్రీకాకుళములో....సీ(వ కొండకీ! ఏం పిల్డో ఎల్దు మొత్తవా?
సిలకలు కత్తులు—దులపరిత్తయట ” ”
సాలూర త్తల—సవర్ల కొండకి! ” ”
చెపుల పిల్లులే—శెంఖమూదెనట! ” ”
బొడ్డపాడు నడి—గెడ్డలోనికీ! ” ”
బటితెలు బట్టిన—మిడత లున్నయట! ” ”
మొండింఖల్—అంకమ్మ కొండకీ! ” ”
బండలు గుద్దిన—మెండ లున్నయట! ” ”
నలగొండా—నట్టడవి లోనికీ! ” ”
పామును పొడిసిన—సీమ లున్నయట! ” ”
తెలంగాణ—కొమరయ్య కొండకీ! ” ”
గెద్దని దన్నిన—గేతులున్నయట! ” ”
కలకత్తా కొస—కారు కొండకి! ” ”
ఎలుకలు పిల్లిని—యెంట దగిలెనట! ” ”
మేకలు మేసిన—ఆకుల కొండకి! ” ”
పులుల్ని మింగిన—గొర్రెలున్నయట! ” ”
రాయిల సీమా—రాలు కొండకీ! ” ”
రత్తం రాజ్యం—ఏత్తందటా ” ”
తూరుపు దిక్కున—దోర కొండకీ ” ”
తుపాకి పేల్చిన—తూరీగ లున్నయట! ” ”

దప్పు పాట

జజ్జనకరి ఝనారే
ఝణకు ఝణా జనారే
జజ్జనకరి జజ్జనకరి జజ్జనకరి ఝనారే ॥జజ్జ॥
గేటులు కాసిన సిన్నోడా మూటలు మోసిన కుర్రోడా
ఎన్నాలయ్యా తిన్నావో ఎండుతొక్క లాగున్నావు
అన్నోరన్న—రారోరన్నా నిన్ను దిన్న దున్నపోతునుదన్నా ॥జజ్జ॥

కొండలు ఎక్కిన కోదోడా కట్టెలు గొట్టిన పేదోడా
మంచులోను తొంగున్నావా మన్నుబెడ్డ కప్పుకున్నావా
అవున్నోడు తెగతిన్నోడూ నీ వుసురు తగిలి మరి సవ్వకపోడూ ॥జజ్జ॥

భూమిని దున్నిన రైతన్నా ఏమీలేని కూలన్నా
కాకిలాగ నువ్వున్నావు కావుకావు మంటున్నావు
కాయితాల్లో దాసిరి భూములు కాల్చర నువ్వా కాగడాలతో ॥జజ్జ॥
ఇనపకొండ మీమన్నోడా ఇంజనులు కదుతున్నోడా
ఎప్పుడు ఇంటికి వస్తావో ఎక్కడ పడి సత్తావో
ఆ దిక్కులేని సావు చచ్చేకన్నా వీరుడవై నువు సావర అన్నా ॥జజ్జ॥

మట్టిని మోసిన మాలోడా గట్టులు బోసిన కూలోడా
గునపామెత్తి బొడవలేకా గుండెలు పీకుతు వున్నాయా
ఆ గుండె బలము మరి కావాలంటే రండిర అన్నా దండుగ ఎల్దాం ॥జజ్జ॥

నడవరో రెంకన్నా

నడవరో రెంకన్న నడవరో
బిర బిర నడవరో రెంకన్న నడవరో
రుమాల్పేల్కు జుట్టుకోని కారంబొట్టె కట్టుకోని
గొంగడి భుజానేసుకోని గొడ్డలి సిప్పందుకోని
నడవరో రెంకన్న నడవరో
రాడికల్ యువజన సంఘం రమ్మంట పిలుస్తుంది ॥నడవ॥
ఉదయించే సూర్యునోలె చిగురించే కొమ్మవోలె
పదునెక్కిన కత్తివోలె.... తిరగబడ్డ తుపాకోలె ॥నడవ॥
ముల్లవనం నరికినరికి పండ్లవనం జేసినోడ
భూమిని తలకిందుజేసి బువ్వపంచి యిచ్చినోడ
అంతను యింతజేసి గింతకైన నోచనోడ ॥నడవ॥
దుక్కిల మొక్కయినోడ మొక్కకు కొమ్మయినోడ
కొమ్మకు పువ్వయినోడ పువ్వుకు పండయినోడ
పండ్లకైన నోచుకోక బతుకు ఎండిపోయినోడ ॥నడవ॥

కమ్మరోల్లు కుమ్మరోల్లు బైండ్లోలు బ్యాగరోల్లు
చాకలోల్లు సాలోల్లు మాలోల్లు మాదిగోల్లు
చేతిలొ చెయ్యేసుకోని అలాయ్ బలాయ్ దీసుకొని
పని పాటోల్లంత కలిసి దొరతో పందెమేసిండ్రంట ॥నడవ॥
పోలీసులు పట్టుకొని పొట్టుపొట్టు జేసినారు
జబ్బలిర్గ విరిసికట్టి జైల్లల్లో పెట్టినారు
అడ్లబాడు అన్నయ్యలు కరీంనగర్ కూలన్నలు
పాణాలే పర్వలేక పోరు నడుపుతున్నారట ॥నడవ॥

వోలీ వోలీలరంగ వోలీ

వోలీ వోలీల రంగవోలీ
రెమ్మ కేలీల వోలీ ॥వోలీ॥
ఏడబుట్టె ఏడ బెరిగె
ఏడికొచ్చి ఏడసచ్చె
ఎవరికొరకు వచ్చినారు
ఎవరికొరకు సచ్చినారు
ఏ తల్లి కడుపు పంటలోలీ
రెమ్మ కేలీల వోలీ
కూలితల్లి కంటిపాప లోలీ
రెమ్మ కేలీల వోలీ ॥వోలీ॥
పట్టణంలో బుట్టినారు
పెద్ద సదువు సదివినారు
పల్లె పల్లె దిరిగినారు
మాలపల్లె కొచ్చినారు
గంజిగట్క దాగినారు
గట్టుమీద పన్నారు
పాలికాపు కండలమ్మ వోలీ
రెమ్మ కేలీల వోలీ
రైతుకూలి గుండెలమ్మ వోలీ
రెమ్మ కేలీల వోలీ ॥వోలీ॥

కూలినాలి బతుకుకొరకు
కాశెబోసి కదిలినోల్లు
తిడితె తిరగబడతరమ్మ
కొడితె కొట్టి తీర్తరమ్మ
వారి పేరు ఇంటెనమ్మ వోలీ
శెమ్మకేలీల వోలీ
ఊరిపెద్ద గుండెలదురు వోలీ
శెమ్మ కేలీల వోలీ ॥వోలీ॥

దోసుకునే దొరలగుట్టు
పూసగుచ్చినట్టు జెప్పి
ముద్దుముద్దు మాటలతో
బుద్ధులెన్నొ జెప్పినారు
సూరులంటే సూరులమ్మ వోలీ
శెమ్మకేలీల వోలీ
సూరుసంత బంటులమ్మ వోలీ
శెమ్మ కేలీల వోలీ ॥వోలీ॥

మాదిగోల్ల మల్లన్న
సాకలోల్ల సాయన్న
మాలోల్ల మైసన్న
కురుమోల్ల కొమ్రన్న
లంబడి లచ్చన్నతోటి
చెంచూ చంద్రన్నతోటి
సాపకింద నీళ్ళలాగవోలీ
శెమ్మకేలీల వోలీ
సోపతేమొ జేసిరమ్మ వోలీ
శెమ్మకేలీల వోలీ ॥వోలీ॥

పట్టపగలె బిడ్డలాను
పట్టుకొని యెమినోల్లు
తమిలిపోయెటట్టు గొట్టి

కీలుకీలు విరిచిపెట్టి
లాగులల్ల తొండలిడిసి రోలీ
శెమ్మ కేలీల వోలీ
తీరొక్క బాధపెట్టిరోలీ
శెమ్మ కేలీల వోలీ ॥వోలీ॥

కొడుకులాకు కండ్లుగట్టి
చిట్టడవికి తీసుకొచ్చి
చెట్లకు గట్టేసినారు
గన్నులు గురి పెట్టినారు
పిట్టలన్ని ఎగిరినాయి
పావురాలు రాలిపోయె
తూటమీద తూట పేల్చిరోలీ
శెమ్మ కేలీల వోలీ
తూర్పు ఎర్రబారెనమ్మ వోలీ
శెమ్మ కేలీల వోలీ ॥వోలీ॥

కన్ను దెరిసి కన్ను మూస్తె
కండ్లల్ల కదులుతుండ్రు
కాలుదీసి కాలుయేస్తే
కాళ్ళల్ల మెదులుతుండ్రు
సక్కనయిన కొడుకులమ్మ వోలీ
శెమ్మ కేలీల వోలీ
సుక్కలల్ల కలిసిరమ్మ వోలీ
శెమ్మ కేలీల వోలీ ॥వోలీ॥

కొడుకులార మిమ్ములాను
కలలగూడ మరసిపోము
బిడ్డలార మిమ్ములాను
బాదలల్ల మరసిపోము
కసిదీర్చుకోనీకి వోలీ
శెమ్మ కేలీల వోలీ
కాళమ్మ లొతాము వోలీ
శెమ్మ కేలీల వోలీ ॥వోలీ॥

సూర్యుడు చంద్రుడు

సూర్యుడు సెంద్రుడు సుట్టమై రాంగో
కాళ్ళకు నీళ్ళిచ్చి కన్నీళ్ళు దీసె ॥సూర్య॥
అడవిలో ఎర్రమల్లె పూసినదన్నా
అడివన్న లందరూ బాగున్నరన్నా ॥అడివన్న ॥ సూర్య
పెదతోట్ల పెదమల్లె వాడిపోయింది
పెద్ది శంకరన్న యేడున్నడన్న ॥పెద్ది॥సూర్య॥
మరట్వాడా పల్లెలో మల్లెపూసింది
ఏ తల్లి కడుపులో అన్న వెలిసిండో ॥ఏతల్లి॥సూరు
గోండు గూడెంలోన ఎలుగు పుట్టింది
ఏ గుండెలో అన్న దాగున్నడన్న ॥ఏగుండె॥సూర్య
బెల్లంపల్లిలోన బాల పుట్టింది
ఏ బాలుని పేరు శంకరన్నన్నా ॥ఏ బాలు॥సూర్య॥
శంకరన్న తల్లి కడుపు గాలింది
ఇందిర గద్దెకు నిప్పంటుకుంది ॥ఇందిర॥ సూర్య

అన్నావో గంగన్న

నీ పాట పాడుతున్నమే అన్నావో గంగన్న
నీ ఆట ఆడుతున్నమే అన్నావో గంగన్న
నీ బాట నడుస్తున్నమే ,,
నీ బందు కందుతున్నమే ,, ॥నీ॥
నీవు బాస నేర్చుకున్నవో ,,
బాధపంచుకున్నవో ,,
యీ బతుకుమాదన్నవో ,,
నివ్ సచ్చి బతుకుతున్నవో ,, ॥నీ॥
నువు మట్టిలోని బొగ్గువే ,,
బొగ్గులోని అగ్గివో ,,
అగ్గిలోని వేడివో ,,
నువు కార్మికుల సెమ్మసువో ,,
నువు సింగరేణి సమ్మెవో ,, ॥నీ॥

నీవ్ అవ్వలకు మనుమడివో   అన్నావో గంగన్న
అక్కలకు తమ్ముడివో   ,,
తమ్ములకు అన్నవో   ,,
నీవ్ కూలితల్లి కొడుకువో   ,,
నీవ్ పోరుతల్లి బిడ్డవో   ,,
నీవ్ పొడుస్తున్న సుక్కవో   ,, ||నీ||
నీవ్ ఆదిలాబాద్ అడివివో   ,,
అడవిలోని మొగ్గవో   ,,
నీవ్ పూస్తున్న పూవువో   ,,
కాస్తున్న కాయవ్వో   ,,
నువ్ ఎరుపెక్కిన పండువో   ,, ||నీ||
నువ్ రగల్ జెండా రంగువో   ,,
నువ్ ఉరుముతున్న ఉరుమువో   ,,
నువ్ మెరుస్తున్న మెరుపువో   ,,
నువ్ కురుస్తున్న వానవో   ,,
నువ్ పారుతున్న ఏరువో   ,, ||నీ||
నీవు పొంగుతున్న గంగవో
నీవ్ రామచిలక పలుకువో   ,,
నువ్ కోకిలమ్మ పాటవో   ,,
నువ్ నెమలితల్లి ఆటవో   ,,
నువ్ అడివితల్లి తేనెవో   ,,
నువ్ పెద్దపులి పంజవో   ,, ||నీ||
నీవ్ పోరాటం బాటవో   ,,
నువ్ పీపుల్స్‌వార్ పిలుపువో   ,,
నువ్ రాడికల్ నడకవో   ,,
నువ్ గోండోల్ల గుండెవో   ,,
నువ్ గెరిల్లా గన్నువో   ,, ||నీ||
నీవ్ మొగులు మీద మొగులువో   ,,
నీవ్ మొలుస్తున్న సుక్కవో   ,,

నీవ్ సందమామ సలువవో — అన్నా వో గంగన్న
నీవ్ సూర్యునిలో ఎరుపువో — ,,
నీవ్ కమ్మరోల్ల కొలిమివో — ,,
నువ్ కుమ్మరోల్ల కుండవో — ,,
నువ్ మంగలోల్ల కత్తివో — ,,
నువ్ సాకలోల్ల బండవో — ,,
నువ్ మాదిగోల్ల దప్పువో — ,, ॥నీ॥

ఎర్రజెండెర్ర జెండెన్నియ్యలో

ఎర్రజెం డెర్రజెం డెన్నియ్యలో
ఎర్రెర్రని దీజెం డెన్నియ్యలో
పేదలపాలి జెన్నియ్యలో
మరి పెన్నిధిఈజెం డెన్నియ్యలో ॥ఎర్ర॥
అన్నలు అన్నా లెన్నియ్యలో
మరి వెన్నెలకోనా లెన్నియ్యలో
వెన్నెలకోనా లెన్నియ్యలో
మరి వెలుగూరవ్వా లెన్నియ్యలో
తూరుపుదిక్కూ నెన్నియ్యలో
మరి సూర్యుడు పొడిసిం డెన్నియ్యలో
ప్రజలాకొరకూ ఎన్నియ్యలో
మన అన్నలు నిలిచా రెన్నియ్యలో
పడమటిదిక్కూ నెన్నియ్యలో
మరిసూరుడు గుంకిం డెన్నియ్యలో
ప్రజలా మధ్యా నెన్నియ్యలో
మన అన్నలు ఒరిగా రెన్నియ్యలో
ఒరిగిన అన్నల కెన్నియ్యలో
మన ఎర్రనిదండా లెన్నియ్యలో ॥ఎర్ర॥
సీకటి కొండల్లెన్నియ్యలో
మరి సివరీమూలా లెన్నియలో

ప్రజాసంగీతం కోసం అనంతాన్వేషణ

గూగి వా థియోంగో

[గూగి వా థియోంగో కెన్యన్ రచయిత. ఆయన రాసిన నవలల్లో ప్రధాన మైనది 'డెవిల్ ఆన్ ది క్రాస్'. ఈ నవలలో నాయకుడు గటూరియా సంగీతం మీద పరిశోధన చేస్తుంటాడు. కెన్యాలోని అనేక జాతుల సాంప్రదాయిక సంగీతాన్ని సమ్మిళితం చేసి ఒక సంగీత రూపకాన్ని సృష్టించాలని, సామ్రాజ్య వాద సంస్కృతి కింద అణిగిపోతున్న తన 'జాతి జీవన నాళిక'ను తవ్వి తీయాలని గటూరియా తపన. ఆ తపనకు అక్షరరూప మిది. నవలలో ఒక సంభాషణగా రూపుదాల్చింది—అను.]

గటూరియా గొంతు సవరించుకున్నాడు. మటూరీవంక చూసి "నేను విశ్వ విద్యాలయంనుంచి వచ్చినట్లు మీకు తెలిసినట్లు మాట్లాడుతున్నారే. నిజమే నేను

నక్సల్ బరి నుం డెన్నియ్యాలో
మరి నాలుగు దిక్కు లెన్నియ్యాలో
పోరూసాగం గెన్నియ్యాలో
మరి పోరూమార్గం లెన్నియ్యాలో
ఒరిగిన అన్నల కెన్నియ్యాలో
మన ఎర్రనిదండా లెన్నియ్యాలో ॥ఎర్ర॥

ఆగదు ఆగాదెన్నీయలో
పోరాటామాగా దెన్నీయలో
పోరూమార్గం లెన్నీయలో
మరి నువ్వూ నేనూ ఎన్నీయలో
నువ్వూ నేనూ ఎన్నీయలో
మరి కలిసే పోదా మెన్నియ్యాలో
కలిసేపోదా మెన్నీయలో
మరి నడిచేపోదా మెన్నీయలో ॥కలిసే॥
ఎర్రజెం డెర్రజెం డెన్నియ్యాలో
ఎర్రెర్రని దీజెం డెన్నియ్యాలో

అక్కడ నుండే వస్తున్నాను. నేను ఒకరకంగా సంస్కృతిలో పరిశోధకుణ్ణి. ఆఫ్రికన్ సంస్కృతిలో జూనియర్ పరిశోధకుణ్ణి. మన సంస్కృతిపై సామ్రాజ్యవాద సంస్కృతి పెత్తనం చేస్తోంది. దీన్నే మనం సాంస్కృతిక సామ్రాజ్యవాదం అంటాం. మానసిక, శారీరక బానిసత్వానికి ఈ సాంస్కృతిక సామ్రాజ్యవాదంకన్న తల్లి. 'అడవిలో నివసించడం ఎలా వుంటుందో అక్కడ వున్నవాడికే తెలుస్తుంది. కాబట్టి ఒక పరదేశి మరో వ్యక్తికి మార్గదర్శకుడు కాలేడు' అనే విషయాన్ని ఇది విస్మరింపజేస్తుంది. ప్రజలు తమ స్వదేశంలో ఏమి చేయాలో చెప్పడానికి విదేశీయులకు అవకాశమిస్తుంది. విదేశీయులను జాతీయ వ్యవహారాలకు చెవులుగా, నోళ్ళుగా చేసే ఈ సామ్రాజ్యవాదం మానసిక అంధత్వాన్ని, చెవిటితనాన్ని పెంచి పోషిస్తోంది. మన తరంగూర్చి ఒక గాయకుడు ఇలా పాడాడు :

చెవిటివాడు, చెవిటివాడు
జాతికోసం వినలేనివాడు చెవిటివాడు
గుడ్డివాడు, గుడ్డివాడు
జాతికోసం చూడలేనివాడు గుడ్డివాడు !

ఇప్పుడు మనమొకసారి చుట్టూవున్న పరిస్థితులను చూద్దాం. మన జాతీయ భాషలు ఏమయ్యాయి ? మన జాతీయ భాషల లిపిలో రాసిన పుస్తకాలు ఏమయ్యాయి? మన సాహిత్యం ఏమైంది ? మన తండ్రుల తెలివితేటలు, జ్ఞానం ఇప్పుడెక్కడున్నాయి ? మన పూర్వీకుల తత్వశాస్త్రం ఏది ? మన జాతీయ గృహానికి ద్వారపాలకుల్లా వుండే విజ్ఞుల సముదాయాన్ని ధ్వంసం చేశారు. వివేకాగ్నిని ఆరిపోనిచ్చారు. చలినెగళ్ళ చుట్టు తివాచీలను చెత్తకుప్పలో పారేశారు. ద్వారపాలకుల స్థావరాలను ధ్వంసం చేశారు. జాతి యువకులు ఈటెలను, డాళ్ళను దించేశారు. మనదేశ చరిత్ర తెలుసుకోడానికి మనకి అవకాశం లేకపోవడం విషాదకరం. పిల్లలకు మంచి చెడులు చెప్పే తల్లిదండ్రులు లేనప్పుడు వారు విదేశీ కుళ్ళను రుచికరమైన జాతీయ ఫలాహారమని పొరబడటాన్ని ఎవరు నివారించగలరు ?

మన కథలు, మన పొడుపు కథలు, మన సాంప్రదాయాలు, మన ఆచారాలు, మన జాతి ఘనకీర్తిని చాటిచెప్పే ప్రతి విషయాన్ని మనం పోగొట్టుకున్నాం.

'గికాండి'ని ఈనాడు ఎవరు వాయించగలరు ? 'గోర్డ్'పై రాసిన పద్యాలను ఎవరు చదవగలరు ? ఎవరు వాటి అర్థాలు విప్పిచెప్పగలరు ? ఒకే తీగగల వాయొలిన్ 'వాడిండి'ని ఎవరు వాయించగలరు ? బొలంనుండి తన ప్రేయసి బటానీలు తెంపు

కొస్తుండగానో, లోయలోని గుహనుండి నీళ్ళు తోడుకొస్తుండగానో, దుంపలకోసం ఆమె మట్టి తవ్వుతుండగానో, లోయపంపుల్లో ఆమె చెరుకు కోస్తుండగానో ప్రియుని పిలుపులోని మాధుర్యాన్ని పలికించే విధంగా 'వాడిండి'ని ఎవరు వాయించగలరు? ఉదయిస్తున్న చంద్రుడు భూమిపై వెలుగు ప్రసరిస్తుండగా జొన్న చేలల్లో పక్షులను తోలడానికి వడిసెలలు పట్టిన యువతీయువకుల హృదయస్పందనాలను ఏకంచేసే విధంగా మురళిని ఎవరు వాయించగలరు?

అందుకనే విశ్వవిద్యాలయంలోని విద్యార్థులు, ఉపాధ్యాయులు మనసంస్కృతీ మూలాలను తెలుసుకునే ప్రయత్నాలు మొదలుపెట్టారు. అన్నిరకాల కెన్యా జాతుల సాంప్రదాయాల్లోనే కెన్యా జాతీయ సంస్కృతి దాగివుంది.

ఉదాహరణకి నేను సంగీత విభాగంలో పనిచేస్తున్నాను. ఈ విభాగం సంగీతం, సంగీత వాయిద్యాలు, వాటి అవసరాలకు సంబంధించినది. నేను సాంప్రదాయిక వాయిద్యాలు, ప్రధానంగా డోలు, మురళి, కంజరి, గిలకలు, నగారా, వాయొలిన్, వీణవంటి తీగ వాయిద్యాల గూర్చి అధ్యయనం చేస్తున్నాను.

నేను సంగీతకారుడిని. అన్నిరకాల జాతీయ వాయిద్యాలు మోగుతుండగా అనేక స్వరాలు గొంతుకలిపి గీతాలాపనచేసే సంగీతాన్ని సృష్టించాలనేది నా చిరకాల వాంఛ. అది నా స్వప్నం. ఈ సంగీతంలో తోలు, గాలి, తీగ, కంచు సంబంధిత వాయిద్యాలన్నిటిని వాడాలనుకున్నాను. అయితే కలలోని ఈ సంగీత భావాన్ని, దాని రాగాన్ని నేను పట్టుకోలేకపోయాను. రాత్రింబవళ్ళు నేను ఆ రాగంకోసం, భావం కోసం మథనపడ్డాను. నా ప్రయత్నం వృథాప్రయాసైంది.

నా మనసులోని ఆవేదన మీకు అర్థంకాదు.

తరచు నేను ఒక పూరింట్లో ఏకాంతంగా వున్నప్పుడో, వాన కురుస్తుండగానో, గాలి వీస్తుండగానో, ఒంటరిరాత్రి భూమిపై చంద్రుడు మెరుస్తుండగానో మనని విడిచిపెట్టిన అనేక గళాలు, ఇప్పటికీ సజీవంగా వున్న గళాలు, భవిష్యత్తుకు చెందిన గళాలు అన్నీ నా కోసం లోగొంతుకతో పాడుతున్నట్లు అనిపిస్తుంది. అటువంటి సమయాల్లో నేను రాయాలనుకున్న పాట రాగాన్ని, లయను, భావాన్ని పట్టుకోగలిగానే అనుకుంటాను. అంతలో అది దూరమై గాలి దాన్ని మోసుకెళ్ళిపోతుంది.

మరొకప్పుడు నేను ఒక విశాలమైన చెట్టునీడలో పడుకున్నప్పుడో, మైదానంలో ఒంటరిగా నడుస్తున్నప్పుడో, సముద్రతీరంలో తచ్చాడుతున్నప్పుడో నా హృదయానికి నేరుగా మైదానాల్లో పశులకాపర్ల ఈలలు, పిల్లనగ్రోవులు వినిపిస్తాయి.

ధరణిపై మద్దెలలన్నీ దేశ యువతను యుద్ధానికి సన్నద్ధం కమ్మని హెచ్చరిస్తున్నట్లు అనిపిస్తుంది. మన జాతీయ నాయకులు విజయగీతాలు పాడుతుండగా వేలాది కంజర్లు మోగుతున్నట్లు అనిపిస్తుంది. విజయం సాధించిన తమ పుత్రులను కీర్తిస్తూ స్త్రీలు పాడుతున్నట్లు, ఒక్కసారి జాతీయ నగారా విజయసూచనగా మోగుతున్నట్లు, ఇతర వాయిద్యాలు పులకించి ప్రతిస్పందించినట్లు అనిపిస్తుంది. ఆ తర్వాత మనుషుల గళాలు, సంగీత వాయిద్యాల శబ్దాలు అన్నీ కలసి వినిపిస్తాయి. ఒక స్వరం అనేక స్వరాల్లో విలీనమైనట్లు, అనేక స్వరాలు ఒకే స్వరంలో విలీనమైనట్లు అనిపిస్తుంది. జాతి వీరోచిత చర్యలకు గర్వపడి దేవతలు మేళతాళాలను ఏర్పాటు చేసినట్లు అనిపిస్తుంది.

గాలి మోసుకెళ్ళిపోయే ఈ గళాల సందేశాన్ని రాసుకోడానికి నేను కాగితం కలాన్ని ఆత్రంగా చేతిలోకి తీసుకుంటాను.

నేనేం చెప్పేది ?

మండు వేసవిలో గొంతు తడారిపోతుండగా మీ కళ్ళముందు ఒకపండు వేళ్ళాడుతుంటే దాహం తీర్చుకోడానికి దానికోసం మీరు చేతులుచాస్తే ఆ పండు మరింత పైకెళ్ళి క్రమేపీ ఆకాశంలోకె అదృశ్యమై 'నేనిక్కడున్నాను. ఇక్కడున్నాను. నువ్వు నన్ను పట్టుకోడానికి నిరాకరించావుగా అందుకే వెళ్ళిపోతున్నాను' అని అన్నట్లుగా మన ఆకలిని, ఆకాంక్షలను మరింత ఎక్కువచేసి వెక్కిరిస్తున్నట్లు మీకెప్పుడైనా అనిపించిందా? ఆ గళాలు, వాయిద్యాలు అదేవిధంగా నా ఆకలిని మరింత పెంచుతున్నాయి. అయితే నేను కలం చేతబట్టగానే ఆ సంగీతం, మురళి మూగబోతున్నాయి.

ఏడవడంద్వారా ఎవరు లాభం పొందారు కనుక అని అనుకుని నన్ను నేను సముదాయించుకుంటాను.

మళ్ళీ నా అన్వేషణను ప్రారంభిస్తాను. అనేకసార్లు వేసుకున్న ప్రశ్నసే మళ్ళీ వేసుకుంటాను. కెన్యాలోని అన్ని జాతులకు చెందిన వాయిద్యాలను, కెన్యా వారసులమైన మనం 'భిన్నస్వరాల్లో ఏకత్వం'లా గొంతుకలిపి ఒకే స్వరాన్ని పలికించే సంగీతాన్ని సృష్టించగలమా అనే ప్రశ్న నన్ను పదేపదే వేధిస్తుంది.

నేను అనేక రాత్రిళ్ల నిద్రలేమితో గడిపాను. రాగాన్ని, భావాన్ని, తాళాన్ని పట్టలేని సంగీతకారుడు కేవలం మానవ ప్రతిమ అయిపోతాడు.

విదేశాలనుండి వచ్చిన తర్వాత నేను ఒక సంవత్సరంపాటు మొండికర్రతో చెట్టును తవ్వడానికి ప్రయత్నిస్తున్న రైతుమాదిరిగా ప్రయాసపడ్డాను. నేను చేరాలను కున్న మూలానికి చేరుకోలేకపోయాను...."

తన అనంతాన్వేషణగూర్చి గటూరియా చెప్పుకుంటూ పోతున్నాడు. అందరూ మౌనంగా వింటున్నారు.

స్మృతి

మృత్యువులోనే పాట పాడుతూ...

మిగ్యూయెల్ కాబెజాస్

విక్టర్ జారా చిలియన్ కవి, సుప్రసిద్ధ ప్రజా గాయకుడు. 1973 సెప్టెంబర్ 11న అలెండీ హత్య జరిగిన కొద్ది గంటల్లోనే సైనిక పాలకులు విక్టర్ జారాను కాల్చివేశారు. అప్పటికి ఆయన వయసు 27 సంవత్సరాలు. ఆయనను కాల్చివేస్తున్నప్పుడు, అలెండీ ప్రభుత్వకాలంలో క్విమాంటు ప్రచురణ సంస్థ అధిపతి అయిన మిగ్యూయెల్ కాబెజాస్ కూడ ఖైదీగా ఉన్నాడు. కళ్ళారా చూసిన ఈ హత్య గురించి కాబెజాస్ ఆ తర్వాత ప్రకటించాడు.

"సెప్టెంబర్ 11న స్టేడియంలో విక్టర్ వేదిక దగ్గరికి వెళ్ళాడు. కొత్త ఖైదీలు ప్రవేశిస్తున్న ద్వారందగ్గరికి చేరుకున్నాడు. అక్కడే ఇరుకుదారిలో ఆ నిర్బంధ శిబిరం కమాండర్ విక్టర్‌కు ఎదురుపడ్డాడు. కమాండర్ విక్టర్ వైపు చూసి గిటార్ వాయిస్తున్నట్టు సైగ చేశాడు. విక్టర్ విషాదంగా, సూటిగా చిర్నవ్వుతో సరేనన్నట్టు తలూపాడు. ఆ సైనికాధికారి తనలోతానే నవ్వుకున్నాడు. తను కనిపెట్టిన విషయానికి తనను తానే అభినందించుకుంటున్నట్టు. ఓ నలుగురు సైనికుల్ని పిలిచి, విక్టర్‌ను అక్కడే నిలిపి ఉంచమని ఆదేశించాడు. తర్వాత ఒక బల్ల తెప్పించి వేదిక మధ్యలో వేయించాడు. అక్కడేం జరుగుతుందో అందరికీ కనబడేలా ఏర్పాటు చేశాడు. సైనికులు విక్టర్‌ను బల్లదగ్గరికి నడిపించుకు వెళ్ళారు. విక్టర్‌ను ఆ బల్లమీద చేతులు పెట్టమన్నారు. హఠాత్తుగా ఆ అధికారి చేతిలోకి ఒక గొడ్డలి వచ్చింది.

ఒకే ఒక్క వేటుతో వాడు విక్టర్ ఎడమచేతి వేళ్ళను తెగగొట్టాడు. మరొక్క వేటుతో విక్టర్ కుడిచేతి వేళ్ళు తెగిపోయాయి. వేళ్ళు చెక్కబల్లమీద పడి ఇంకా వణుకుతూ కదులుతూ ఉన్నాయి. విక్టర్ శరీరం దబ్బుమని కిందపడిపోయింది.

ఆరువేలమంది ఖైదీలు ఒక్కపెట్టున ఆర్తనాదం చేశారు. గాయకుడూ నటుడూ విక్టర్ జారా క్షతగాత్ర దేహం మీదపడి ఆ అధికారే "ఇప్పుడు పాడు, పాడురా లంజకొడకా ఇప్పుడు పాడు" అంటూ కొడుతుండగా ఆ పన్నెండు వేలకళ్ళు కళ్ళారా చూశాయి.

అప్పుడక్కడ ఉన్న వాళ్ళెవరూ ఆ అధికారి ముఖాన్ని, వాడి చేతిలో గొడ్డలిని, నుదుటిమీద చెల్లాచెదురుగా పడిన వెంట్రుకల్ని మరిచిపోలేరు. అది పాశవికత్వం మూర్తీభవించిన, ద్వేషం వెచ్చరిల్లుతున్న ముఖం.

చేతుల చివర్ల నుంచి నెత్తురు చిందుతుండగా, ముఖం అప్పటికప్పుడే నీలం రంగుకు తిరుగుతుండగా విక్టర్ చావుదెబ్బలు తిన్నాడు.

అనూహ్యంగా, శక్తినంతా కూడదీసుకుని విక్టర్ లేచి నిలబడ్డాడు. చూపు ఆనని కళ్ళతో, స్టేడియంలో బెంచీలున్న వేపు తిరిగాడు.

ఆయన అడుగులు తడబడుతున్నాయి, మోకాళ్ళు వణకుతున్నాయి. మొండి చేతులు ముందుకుచాపి నిద్రలో నడుస్తున్నవాడిలా అడుగులు వేస్తున్నాడు.

వేదిక చివర మెట్లు మొదలయ్యే చోటికి ఆయన చేరేసరికి గంభీరమైన నిశ్శబ్దం వ్యాపించింది. అప్పుడతను ఎలుగెత్తిన గొంతు వినబడింది.

"సరే, కామ్రేడ్స్ - మనమిప్పుడు కమాండెంట్ పెద్దమనిషి చెప్పినట్టు చేద్దాం !"

ఆయన ఒక్క-క్షణం తనసుతాను నిలదొక్కు-కున్నాడు. రక్తమోడుతున్న తన చేతులెత్తి పాడడం మొదలెట్టాడు. ఆత్రపడుతున్న కంఠంతో "యునిడాడ్ పాపులర్" గీతాన్ని పాడడం మొదలెట్టాడు. ప్రతి ఒక్క-రూ ఆయనతో గొంతు కలిపారు.

ఆ ఆరువేల కంఠాలు పాడుతున్నప్పుడు విక్టర్ నెత్తురోడుతున్న చేతితో తాళం వేశాడు. ఆయన ముఖంమీద చిరునవ్వు వెలిగింది. అది ముఖమంతా పరచు కుంది, ప్రశాంతంగా ఉంది. ఆయన కళ్ళు మైమరచినట్టున్నాయి.

ఈ దృశ్యం సైన్యానికి భరించరానిదయి పోయింది. తూటాలవర్షం కురిసింది. తన కామ్రేడ్స్‌పట్ల గౌరవంతో పూర్తిగా, మెల్లగా ఒంగి అభివాదం చేస్తున్నట్లు విక్టర్ శరీరం ముందుకు ఒరగడం ప్రారంభమైంది. ఆయన మృతదేహం పక్క-కు పడి పోయింది.

మెషిన్‌గన్‌ల నోళ్ళలోంచి మరిన్ని తూటాల వర్షాలు వచ్చాయి. బెంచీల మీదనుంచి విక్టర్ పాటకు గొంతుకలిపిన వాళ్ళమీదికి వాటిని ఎక్కు-పెట్టారు.

తూటాలతో చిల్లులుపడిన మృతదేహాల ప్రవాహం బెంచీల మీదినుంచి వేదిక మీదకు సాగివచ్చింది. గాయపడ్డవాళ్ళ హాహాకారాలు దుస్సహంగా వినిపించాయి. కాని అవి విక్టర్ జారాకు వినిపించి ఉండవు. ఆయన అప్పటికే మరణించాడు....

కాలిన కన్నీటి పువ్వు

ఆర్కే

అక్క నాకు పరిచయం చేసినప్పుడు
అంగుళం అంగుళం కాలిపోతున్న నిన్ను చూశాను
క్షణం క్షణం కాలిపోతున్న నిన్ను
యివ్వాళ మళ్ళీ చూశాను
చావుతో యిన్నాళ్ళూ నువ్వాడిన ఆటలో
ఈసారి మేం ఓడి నువ్వే గెల్చావు
ఐనా బతుకీడుస్తూ ఏం సుఖపడ్డావని
బంధాలు తెంచుకుని కష్టపెట్టావనాలి ?
సముద్రం హోరులో వినబడని మూగబాధ నీది
సముద్రం యిసుకలో కూరుకుపోయిన బతుకు నీది
విరుగుతున్న కలపై ఒరుగుతూ
ఎగసిపడే అలల్ని ఆహ్వానించావ్
అలల గర్భంలో దాగిన విద్యుద్గీతం వింటూ
చేతికందని కలలో కరిగిపోయావు
లక్ష నక్షత్రాలు ఒక్కసారి అదృశ్యమైతే
కాళ్ళు తెగి కూలిన ఒంటరి ఒంటైనావు
కంటికి పట్టని నిద్రకై తపించి తపించి
కళ్ళముందు జీవితాన్ని వెలివేశావు
నీ చుట్టూ ఎవరెందరున్నా
నీలో నువ్వే ఐ
ఒంటరి శూన్యాన్ని గూడు చేసుకున్నావు
వసంతం కరువైన శిశిరంలో
అలసిన బాటసారీ !
నువ్వు మరువలేని స్మృతివి
మౌనంలో విన్పించే రాగానివి
కడలి తరగపై విరిసిన కన్నీటి పువ్వువి
సగం వెన్నెలలో కాలిన జాబిల్లి కూనవి
(కరుణ స్మృతిలో)

(ఆంధ్రభూమి, దినపత్రిక సౌజన్యంతో)

మళ్ళీ నిన్ను చూడాలనివుంది

సౌదా

"Blessed are we, the poor
for we escaped gallows"

చివరికి నేను గడపమీద పాదం మోపేసరికి నా పురహృ పంజరంలోని లోల కాలన్నీ భీకరంగా మోదుకున్నాయి. నా ముఖంమీద, గడియారంమీదా అసంఖ్యాక మైన సమయాలు అల్లల్లాడాయి. కాలం కల్లోలకంగా కనిపించింది.

మబ్బులు ఆగిపోయిన ఆకాశాన్నీ అలలు నిలిచిపోయిన సముద్రాన్నీ వూహించడానికి ప్రయాసపడుతూ వొక బైరాగిపలె యిల్లు కూర్చుని వుంది. కానీ ఆ వెన్నెలరాత్రి యింటిపైన మేఘాల నీడలు ప్రవహిస్తూనే వున్నాయి. వెనక అలల హోరు వినిపిస్తూనే వుంది.

యెదురుగా యింటి ముంగిట అాటెండెన్సు రిజిష్టరు కనిపించింది. జలపాతాల లోనూ వూరేగింపుల నడుమా నాకెన్నడూ కనిపించని అాటెండెన్సు రిజిష్టరు. నేనొక సమాధిలోకి ప్రవేశిస్తున్నట్లు వొణికిపోయాను. కానీ నా విశ్వాసం నన్ను సుడిగాలిలా లేపి జనవరి 13న రాజధానిలో దింపింది.

ఆ గడపమీద పాదం మోపేసరికి నా పురహృ పంజరంలోని లోలకాలన్నీ యేకవచనం పలికాయి. నా ముఖంమీనా గడియారంమీదా వొకే వొక విజయ సమయం కనిపించింది. చివరికి నేను రాజధాని అట్టడుగునుండి లేచిన రాజధాని అంతటా వ్యాపించిన అడివిని చూశాను. అడివిపై బుద్ధ పూర్ణిమ వెన్నెల చూశాను.

కనిపించే ఆయుధాలతో కనిపించే మరణాన్ని మాత్రమేకాదు. ఆశయంతో అలసిపోయేటట్టు, కనిపించని మరణాన్నికూడా కనిపెట్టిన ప్రభుత్వం గురించి నాకు యిదివరకే తెలుసు. అలిసిపోయిన సహచరులను నేనుగాక మరెవరు ప్రేమించారు ?

అలసటకు కాపలా కాస్తున్న శిశిర ఋతువును వొడిగించాలనుకున్నవారికి వసంతం చేతులు చాచడం కనిపించే వుంటుంది. ఆ చేతులన్నీ రాజధాని మబ్బుల మధ్యనుండి వాతావరణంలోకి వూగాయి. ఆ! అరచేతుల్లోని రేఖలన్నీ వొక్కసారిగా మెరుపులై లేచాయి. ఆకాశంలోకి చొచ్చుకుపోయాయి. యిక యే హద్దుల రేఖలూ లేని చేతులు వొకదానినొకటి కలిశాయి. బుద్ధ పూర్ణిమలోని అడివంతా కరతాళ ధ్వనులు మోగాయి. ప్రభుత్వం సృష్టించిన అలసట అంతా నలిగి నలిగిపోయింది.

వూరికి తిరిగివస్తూ నేనేం తెచ్చుకున్నానో తెలుసా ? వొక దోసెడు కరతాళ ధ్వనులు ! నా దోసిటిని వూయలచేసి ఆ ధ్వనులను పెంచుకుంటాను. యుద్ధం తీవ్రమయ్యే సమయానికి అవి చేతులై లేస్తాయి. [ఉదయం దినపత్రిక సౌజన్యంతో]

గల్పిక :

సాహిత్యవేత్త

ఎమ్. ఎస్. ఆర్.

"గద్దర్ పాటకు కొత్త అర్థాన్ని కల్పించాడు."

"గద్దర్ శ్రమజీవుల అంతరంగాన్ని అద్భుతంగా ఆవిష్కరించాడు"

"గద్దర్ బుకిష్ మార్క్సిస్టు మేధావులకు పాఠాలు చెప్పగల ఆచరణ శీలి అయిన మేధావి."

"గద్దర్ మనదేశం గురించి చేదు వాస్తవాలు చూపించి నిద్రపోనివ్వడు."

"గద్దర్ ప్రజాకళలకు చేసిన సేవ సాటిలేనిది."

"గద్దర్ త్యాగశీలి"

* * *

"సార్, గద్దర్ పై వున్న అక్రమకుట్ర కేసును ఖండించి, ఎత్తివేయాలని ప్రకటిస్తారా?"

"సార్ ...."

ప్రతిస్పందన

సృజన వెలువడించట. ఇంకా చూడనందుకు గిల్టీగా వుంది.

తా॥క॥ సృజన ఇప్పుడే చేతికి వచ్చింది. చాల కాలంతర్వాత కనిపించిన ఆత్మ బంధువువలె చేతుల్లోకి తీసుకొని కవర్ స్పృశించి కాగితాలు తిరిగేసి ఆ స్పర్శలోని ఆత్మీయతను అనుభవించాను. చదివాక మళ్ళీరాస్తాను.

— ఒక ఆత్మీయుడు.

హైదరాబాదు

11-1-90.

నాలుగేళ్ళ విరామం తర్వాత తిరిగి సృజనను చూస్తే మిమ్ముల్ను, మీతో పాటు సాహితీ మిత్రులందరినీ చూస్తున్నట్లు అనిపించింది. పాత సృజన సంచికలు, ఆ సంచికల కోసం జరిపిన చర్చలు యిత్యాది అన్నీ ఒక మారు జ్ఞాపకం వచ్చాయి. ఈ దీర్ఘ నిర్బంధంలో ఎందరెందరో కామ్రేడ్స్ మనతో, సృజనతో అనుబంధం వున్నవారు అమరులై సృజన మార్గాన్ని గమ్యం తప్పనీయకుండా, లక్ష్యం విడువనీయకుండా తమతో వెంటబెట్టుకొని ముందుకు తీసుకపోవడానికి మన మధ్యనే నిల

బద్దారా? అని అనిపిస్తుంది. ఒక్కసారి గతంలో మనందరి అనుబంధాలు గుర్తు వస్తుంటే....

కల్లోల భరిత సముద్రంలో
సాగిపోయేనావకు
లైట్ హౌస్ ప్రసరించే వెలుగులు
అమరులకంటికి చూపైన వేళ....
అవరోధాలెన్నైనా
సాగిపోదాం కడలి ప్రయాణంలో
కలుద్దాం మళ్ళీ మళ్ళీ
జనసంద్రపు పోరు హోటలో.

మనమధ్య సజీవ ఆత్మీయత నిలిపే సృజన ప్రారంభమైంది. కనుక రచనలు, ఉత్తరాల ద్వారా మీ యింటికి తపాలా మిత్రులు మమ్మలందరినీ తీసుక వస్తూనే వుంటారు.

ఫిబ్రవరి 1, 90.

మీ నేస్తం

సృజన కొత్త అడ్రస్

సృజన,
ప్లాట్ 11, బ్లాక్ 2,
ఎం ఐ జి II,
బాగ్‌లింగంపల్లి,
హైదరాబాద్ 500 044

సృజన సంవత్సర చందా రు. 40.
విడిప్రతి రు. 4.

మోట కడుతూ నాటు పెడుతూ
కలుపు తీస్తూ కల్లుగీస్తూ
బీళ్ళు దున్నుతు నీళ్ళుకడుతూ
కోతకోస్తూ కుప్ప గొడుతూ
పసుల గాస్తూ పెండదీస్తూ
మగ్గమేస్తూ పగ్గమేస్తూ
కంప జెలుగుతు గంపలెత్తుతు
కుమ్మరాము కాడ సాముకాడ
కొలిమికాడ దొర కొలువుకాడ
సహస్ర వృత్తుల
సమస్త బాధలూ గాథలూ మాత్రమేకాదు
చైతన్యాన్ని స్పందించే పాటలు
ఆటలూ నాటకాలూ
రూపాలు రూపకాలు

* * *

పాట పోరాటపు పొత్తిళ్ళలోని కేరింత
పాట ఉద్యమం నెలబాలుని పులకరింత
పాట నెత్తుటి మడుగులోంచి పాలపుంత
పాట కర్షక-కార్మిక కళాకారుల కౌగిలింత
పాట పురి
పాట దరి
పాట పోరాటపు ఊపిరి
పాట దమ్ము తీసుకుని పోరాటం సాగింది
పోరాటం నెపథ్యంలో పథంలో విరామంలో
అవిరామంగా పాట ఉద్రూత లాగింది

('భవిష్యత్తు చిత్రపటం' నుంచి)